


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 190

శుక్రవారం 30-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



A quality product from
PAN BAHAR
దుర్గామాత
శుభాశీస్సులతో
మీ జీవితాలలో
వెలుగులు నిండాలి
శుభ
నవరాత్రి
Bahubali
PAN MASALA
CHEWING OF PAN MASALA IS INJURIOUS TO HEALTH. NOT FOR MINORS
NO TOBACCO NICOTINE



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 190

శుక్రవారం 30-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అట్టహాసంగా ఆరంభం

గుజరాత్‌లో జాతీయ క్రీడల్ని ప్రారంభించిన ప్రధాని మోదీ - 10లో



వర్ధమాన దేశాల్లో 'స్టార్'

2022–23లో భారత్ 7.3% వృద్ధి సాధిస్తుందని ఎస్అండ్‌పీ అంచనా -10లో



కాంగ్రెస్ అధ్యక్ష బరిలో లేను

కాంగ్రెస్ అధ్యక్ష రేసులో తాను లేనని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ చెప్పారు. సీఎంగా కొన సాగింపుపై అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు.

వివరాలు 6లో



కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్స్

ప్యాసింజర్ కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్ తప్పని సరి నిబంధనను కేంద్రం వాయిదా వేసింది. 2023 అక్టోబర్1 నుంచి అమలవుతుంది.

వివరాలు 10లో



ఏడేళ్లు నివాసం ఉంటే గ్రీన్‌కార్డు!

అమెరికాలో వరుసగా ఏడేళ్లు నివాసమున్న వలసదారులు శాశ్వత నివాస అర్హత పొందడా నికి వీలు కల్పించే బిల్లును సెనెట్‌లో పెట్టారు.

వివరాలు 6లో



అమెరికాలో హరికేన్ బీభత్సం

ఇయన్ హరికేన్ ప్రతాపానికి అమెరికాలోని ఫ్లోరిడా విలవిలలాడుతోంది. గంటకు 241 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి.

వివరాలు 6లో

విశాఖ పరిపాలన రాజధాని కావడం తథ్యం

విశాఖ పరిపాలన రాజధాని కావడం తథ్యమని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర వాసులెవ రైనా అడ్డుకుంటే చరిత్రహీనులుగా నిలి చిపోతారన్నారు. రాష్ట్రమంతా అభివృద్ధి చెందాలని సీఎం జగన్ విశాఖను పరి పాలన రాజధానిగా చేస్తుంటే.. టీడీపీ నేతలు భూముల ధరల కోసం యాత్ర చేస్తున్నారని విమర్శించారు.

7లో

సింహ వాహనంపై శ్రీమన్నారాయణుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమల శ్రీవారు గురువారం యోగ నరసింహుని అలంకా రంలో సింహ వాహనంపై భక్తులకు అభయ మిచ్చారు. బెజవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

7లో

గడప గడపకు పనులు నెలలో మొదలు

ప్రాధాన్యతగా చేపట్టాలని స్పందనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం

అక్టోబర్ 25న సచివాలయాల్లో ఈ–క్రాప్ జాబితాలు

- డిసెంబర్ 21 నాటికి ఐదు లక్షల గృహ నిర్మాణాలు పూర్తి లక్ష్యం
- జగనన్న కాలనీల్లో 3.5 లక్షలు.. 1.5 లక్షల టిడ్కో ఇళ్లు
- కొత్త లబ్ధిదారులకు ఫేజ్ 3 కింద డిసెంబర్‌లో ఇళ్ల మంజూరు
- ఎస్‌డీజీ లక్ష్యాల సాధన ఆధారంగా కలెక్టర్లకు మార్కులు
- అక్టోబరు 26న రైతు భరోసా రెండో విడత సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ
- నవంబరు 10న విద్యార్థులకు వసతి దీవెన
- స్పందన అర్జీల్లో సమయ పాలన, నాణ్యత బాగుంది
- అర్జీదారులకు ముందుగానే ఫోన్ ద్వారా విచారణ వివరాలు
- దరఖాస్తుదారుడితో లొకేషన్‌లో సెల్ఫీ అప్‌లోడ్



వేగంగా మంజూరు.. ప్రారంభం

ఒక సచివాలయంలో రెండు రోజుల పాటు గడప గడపకు కార్యక్రమం ముగిశాక అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన పనులను మంజూరు చేయాలి. వాటిని యుద్ధ ప్రాతి పదికన ప్రారంభించాలి. మంజూరైన నెల రోజుల్లోగా పనులు ప్రారంభం కావాలి. నిర్దే శించుకున్న మేరకు ప్రతి వార్డు లేదా గ్రామ సచివాలయంలో రెండు రోజులపాటు రోజు కు 6 గంటలపాటు గడప గడపకూ కార్యక్ర మాన్ని నిర్వహించకుంటే పనులు మంజూరు కావు. ఇప్పటివరకూ గడప గడపకూ నిర్వ హించిన సచివాలయాల్లో ప్రాధాన్యతగా గు ర్తించి పెండింగ్‌లో ఉన్న పనులను అక్టోబర్ 5లోగా మంజూరుచేయాలి. అవి అక్టోబర్ చివరి నాటినుంచి ప్రారంభం కావాలి.

సాక్షి, అమరావతి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఆయా సచివాలయాల పరిధిలో నెల రోజుల్లోగా ప్రాధా న్యత పనులు ప్రారంభం కావాలని అధికార యం త్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ–క్రాప్ జాబితాలను అక్టోబర్ 25న సచివాలయాల్లో ప్రదర్శించాలని నిర్దేశించారు. డిసెంబర్ 21 నాటికి ఐదు లక్షల గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందులో జగనన్న కాలనీల్లో 3.5 లక్షలు, 1.5 లక్షల టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అర్హు లైన లబ్ధిదారులకు ఫేజ్ – 3 కింద డిసెంబర్‌లో ఇళ్లను మంజూరు చేయాలన్నారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనే కలెక్టర్ల పనితీరుకు ప్రామాణికమని, వాటి ఆధారంగానే మార్కులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అక్టోబరు 26న రైతు భరోసా రెండో విడత సాయంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా విడుదల చేస్తామని తెలిపారు. వసతి దీవెన నవంబరు 10న విడుదల చేస్తామని చెప్పారు. స్పందనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

నెలలో ఆరు సచివాలయాలు..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల అభ్యర్థనల మేరకు ప్రాధాన్యత పనులకు ప్రతి గ్రా మ, వార్డు సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున

మిగతా 2వ పేజీలో ▶

పెళ్లయినా.. కాకున్నా..

అబార్షన్.. ఆమె ఇష్టం



24 వారాల్లోపు అబార్షన్‌కు అవివాహితలూ అర్హులే

- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- వివాహిత, అవివాహిత వ్యత్యాసం రాజ్యాంగ విరుద్ధం
- అత్యాచారానికి గురైనట్టు రుజువు చేసుకునే అవసరం లేదు
- కుటుంబీకుల అనుమతి, మైనర్ల వివరాల వెల్లడి అనవసరం
- ఎంపీటీ చట్టం ప్రకారం రేప్ కిందికి వైవాహిక అత్యాచారం



సాక్షి, న్యూఢిల్లీ: గర్భధా రణ, మాతృత్వపు హక్కు కు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువ రించింది. చట్టపరమైన సురక్షిత అబార్షన్ మహిళలందరికీ సమా నంగా వర్తించే హక్కేనని తేల్చిచెప్పింది. వివాహితులు, అవివాహితులు అంటూ తేడా చూపించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. పెళ్లయిన వారితో సమానంగా అవివా హితులకు కూడా 24 వారాల్లోపు అబార్షన్ చేయించుకునే హక్కు ఉంటుందని పేర్కొంది. అంతేగాక వైవాహిక అత్యాచారాన్ని కూడా వైద్య పరమైన గర్భవిచ్ఛిత్తి (ఎంపీటీ) చట్ట నిర్వచనం ప్రకారం రేప్‌గానే పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎంటీపీ చట్ట పరిధిని విస్త రిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్డీవాలా, జస్టిస్ బొపన్నలతో కూడిన ధర్మాసనం గురువారం చరిత్రాత్మక తీర్పు

మిగతా 6వ పేజీలో ▶

> చట్టపరంగా సురక్షిత అబార్షన్ చేయించు కోవడానికి మహిళలందరూ అర్హులే. గర్భిణులు 20–24 వారాల మధ్య అబా ర్షన్ చేయించుకోవచ్చని వైద్యపరమైన గర్భవిచ్ఛిత్తి చట్టం సెక్షన్ 3(2)(బి) చెబు తోంది. దీన్ని వివాహితులకే వర్తింపజేసి అవివాహితులను దూరం పెట్టడం ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమే.
>
> స్త్రీకి తన శరీరంపై సంపూర్ణ హక్కుంటుంది. అవాంఛిత గర్భం ఆమె శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. కనుక పెళ్లయిందా, లేదా అనేదానితో నిమిత్తం లేకుండా అబార్షన్‌పై ఆమెదే అంతిమ నిర్ణయం. అత్యాచారానికి, లైంగిక వేధింపులకు గురైనట్టు నిరూపించు కోవాల్సిన అవసరం కూడా లేదు. కుటుంబ సభ్యుల సమ్మతీ అవసరం లేదు. మైనర్, లేదా మానసిక వైకల్యమున్న వారికి మాత్రమే సంరక్షకుల సమ్మతి అవసరం.
>
> – జస్టిస్ డీవై చంద్రచూడ్

'ప్రత్యేకాధికారుల' పాలన గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: మంగళగిరి–తాడేపల్లి, శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ల ప్రత్యేకాధికారుల పాలన గడువును ప్రభుత్వం మరో 7 నెలలు పొడిగించింది. ఈ రెండు అర్బన్ లోకల్ బాడీస్‌ల్లో స్పెషల్ అధికారుల పాలన అక్టోబర్ 2,10 తేదీలతో ముగియనుంది. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు వీరి పాలన గడువును ప్రభుత్వం పొడిగించింది.

ఏపీ టెట్ ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ పరీక్ష (ఏపీ టెట్-2022) ఫలితాలను పాఠశాల విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. ఈ పరీక్షకు హాజరైన 4,07,329 మంది అభ్యర్థుల మార్కుల వివరాలు https://cse.ap.gov.in/ DSE/ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు అర్హత పరీక్ష మార్కులను నార్మలైజేషన్ పద్ధతి అమలు చేసిన తర్వాత మొత్తం 58.07 శాతం మంది టెట్‌లో అర్హత సాధించారు. అభ్యర్థులు తమ మార్కుల వివరాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి అమరావతి: రాష్ట్రంలో 2022–23 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు 8వ తరగతి చదువుతోన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, 8వ తరగతి ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. పరీక్ష రుసుమును ఓసీ,బీసీ విద్యార్థులకు రూ.100గా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50గా నిర్ణయించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 30 నుంచి స్వీకరిస్తారు. దరఖాస్తు, పరీక్ష రుసుము సమర్పణకు అక్టోబర్ 31 వరకు గడువు ఉంది. పరీక్ష రుసుమును ఎస్బీఐ కలెక్ట్ ద్వారా మాత్రమే చెల్లించాలి. పూర్తి వివరాలను www. bse. ap. gov. in లో పొందుపరిచారు.

వీఆర్‌వోలకు ప్రభుత్వం భరోసా

గ్రేడ్–1, 2 వీఆర్‌వో మరణిస్తే.. కుటుంబంలోని ఒకరికి కారుణ్య నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రేడ్–1, 2 గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్‌వో)కు ప్రభుత్వం భరోసానిచ్చింది. సర్వీస్‌లో ఉన్న గ్రేడ్–1, 2 వీఆర్‌వో మరణిస్తే అతని కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకానికి అవకాశం కల్పిస్తూ ఏపీ వీఆర్‌వో సర్వీస్ నిబంధనలు–2008 లో మార్పులు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. దీంతో గ్రేడ్–1, 2 వీఆర్‌వో కుటుంబంలో డిగ్రీ విద్యార్హత కలిగిన భాగస్వామి/పిల్లలకు కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్, ఈ క్యాడర్‌కు సమానమైన ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తారు. కారుణ్య నియామకాలపై వీఆర్‌వోలు ఏళ్ల తరబడి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం వీఆర్‌వోల డిమాండ్‌ను పట్టించుకోలేదు. సీఎం జగన్ సర్కార్.. వీరి డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని వీఆర్‌వోల సుదీర్ఘ కాల డిమాండ్‌ను నెరవేర్చింది.

పదవి నుంచి చింతపల్లి ఎంపీపీ తొలగింపు

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా) : చింతపల్లి ఎంపీపీ వంతాల బాబూరావును పదవి నుంచి తొలగించాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్నికల అథారిటీ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పరిషత్ ఎన్నికల సమయంలో ఎంపీపీ ఎన్నికల్లో 20 మంది ఎంపీటీసీల్లో 9 మంది ఇండిపెండెంట్లు బాబూరావును బలపర్చగా, మరో 9 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అనూషదేవిని బలపర్చారు. ఇద్దరికీ సమానంగా సభ్యుల మద్దతు రావడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీంద్రనాథ్ లాటరీ తీశారు. డ్రాలో బాబూరావుకు ఎంపీపీ పదవి వరించింది. ఎన్నికల నామినేషన్ దాఖలు సమయంలో బాబూరావు ఆయనపై ఉన్న కేసుల వివరాలను నమోదు చేయలేదని అనూషదేవి కోర్టును ఆశ్రయించడంతో పాడేరు సబ్ కలెక్టర్ విచారణ జరిపారు. బాబూరావుపై కేసులు ఉన్నట్టు తేలడంతో పదవికి అనర్హుడిగా పేర్కొంటూ ఎంపీపీ పదవి నుంచి తొలగించాలని ఎన్నికల అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కోరాబు అనూషదేవిని ఎంపీపీ పదవి వరించనుంది.

పోలీస్ క్రీడాకారులకు డీజీపీ అభినందన

సాక్షి, అమరావతి: జాతీయ పోలీస్ జూడో క్లస్టర్ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర పోలీసు విభాగం క్రీడాకారులను డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అభినందించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఢిల్లీలో సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఏడో జాతీయ పోలీస్ జూడో క్లస్టర్ పోటీలో ఏపీ పోలీస్ విభాగం నుంచి 20 మంది పాల్గొని రెండు రజత, ఐదు కాంస్య పతకాలు సాధించారు. నంద్యాల జిల్లాకు చెందిన ఎస్.ఫరాహాతుల్లా, ప్రకాశం జిల్లాకు చెందిన డీఎస్పీ రత్నంబాబు పెన్‌కాట్ శిలాట్ (మార్షల్ ఆర్ట్) విభాగంలో వెండి పతకాలు, నెల్లూరు జిల్లాకు చెందిన ఎ.శ్రావణి కరాటేలోను, కర్నూలు జిల్లాకు చెందిన పి. కల్పన, నంద్యాల జిల్లాకు చెందిన ఎస్.మహబూబ్ బాషా, చిత్తూరు జిల్లాకు చెందిన ఎం.షంషేర్ తైక్వాండోలో కాంస్య పతకాలు సాధించారు.

'గంజాయి' నిరోధంలో ఏపీ టాప్

సాక్షి, అమరావతి: 'గంజాయిలో టాప్' అనటానికి... 'గంజాయిని నిరోధించటంలో టాప్' అనటానికి తేడా లేదా? ఈ తేడా 'ఈనాడు' పత్రికకో, దాని అధిపతి రామోజీరావుకో తెలియదా? తెలియకేమీ కాదు. ఆంధ్రప్రదేశ్‌ను ఏలుతున్నది తమ బాబు కాదు కాబట్టి... ఎంత వీలైతే అంత బురద జల్లాలి. నిజాలు చెప్పి బురద జల్లలేరు కాబట్టి... వీలైనంత తప్పుదోవ పట్టించాలి. గురువారం 'ఈనాడు' ప్రచురించిన వార్త ఇలాంటిదే. దేశవ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణాను సమర్థంగా అడ్డుకుంటున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని, ఇక్కడే ఈ ఏడాది ఎక్కువ గంజాయిని పట్టుకున్నారని, ఎక్కువ కేసులు పెట్టారని, ఎక్కువ విస్తీర్ణంలో గంజాయి తోటల్ని ధ్వంసం చేశారని జాతీయ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నివేదిక ఇచ్చింది. షరామామూలుగా 'ఈనాడు' తన పైత్యాన్ని జోడించి 'గంజాయిలో ఏపీ టాప్' అని శీర్షిక పెట్టేసింది. లోపల నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో నివేదికలోని అంశాలనే పేర్కొంది. నిజానికి గంజాయి సమస్య కొన్ని దశాబ్దాలుగా ఉన్నా... వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకే దీనిపై సమగ్ర కార్యాచరణ మొదలెట్టింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ప్రత్యేకంగా ఏర్పాటు చేయటంతో పాటు... గంజాయి సాగుకు అలవాటుపడ్డ గిరిజనుల్ని మార్చి, ఇతర పంటలు వేయిస్తూ ఆపరేషన్ 'పరివర్తన్' కూడా అమలు చేస్తోంది. ఎన్‌సీబీ నివేదికలోని వాస్తవాలివీ...

జాతీయ నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డ్ నివేదిక-2021 వెల్లడి



గంజాయి దందాపై ఉక్కుపాదం మోపడంలో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ అత్యంత సమర్థవంతంగా పనిచేస్తోందని ఎన్‌సీబీ వెల్లడించింది. గంజాయి సాగు ధ్వంసం, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందని స్పష్టం చేసింది. దేశంలో 12 రాష్ట్రాల్లో గంజాయి సాగవుతోంది. దీని సాగును అడ్డుకోడానికి ఏపీ ఒక్క రాష్ట్రమే ప్రత్యేక కార్యాచరణను చేపట్టిందని వెల్లడించింది. అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణాను కూడా ఏపీ సమర్థంగా నిరోధిస్తోందని తెలిపింది. ఎన్‌సీబీ నివేదికలోని అంశాలు సంక్షిప్తంగా..

40 శాతం పంట ధ్వంసం ఏపీలోనే..

గంజాయి పంటను ధ్వంసం చేయడంలో 2021లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమే దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఏపీతో పాటు గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ–కశ్మీర్, త్రిపుర రాష్ట్రాల్లో గంజాయి పంటను ధ్వంసం చేశారు. ఈ రాష్ట్రాల్లో మొత్తం 27,510 ఎకరాల్లో గంజాయిని ధ్వంసం చేశారు. అందులో ఒక్క ఏపీలోనే అత్యధికంగా 11,550 ఎకరాల్లో పంటను ధ్వంసం చేశారు. అంటే 40% గంజాయి పంటను ఏపీ పోలీసు శాఖే ధ్వంసం చేసింది. తరువాతి స్థానంలో ఒడిశా 3,500 ఎకరాలు, జమ్మూ–కశ్మీర్ 3 వేల ఎకరాలు, తెలంగాణ 2 వేల ఎకరాలు, మహారాష్ట్ర 1,500 ఎకరాల్లో పంటను ధ్వంసం చేశాయి. మిగిలిన అన్ని రాష్ట్రాలుకలిపి 5,960 ఎకరాల్లో ఈ పంటను నాశనం చేశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021లో 'ఆపరేషన్ పరివర్తన్' ద్వారా భారీ స్థాయిలో గంజాయి పంటను పెకలించడంతోనే ఇది సాధ్యపడింది. గంజాయి సాగుకు వ్యతిరేకంగా అంత భారీ ఆపరేషన్ చేపట్టడం దేశంలో ఇదే తొలిసారి.

అక్రమ రవాణాకు సమర్థంగా అడ్డుకట్ట

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కూడా ఆంధ్రప్రదేశ్ సమర్థవంతమైన పాత్ర నిర్వర్తించింది. ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తోంది. 2021లో దేశం మొత్తం మీద అక్రమంగా రవాణా అవుతున్న 7.49 లక్షల కిలోల గంజాయిని కేంద్ర, రాష్ట్ర పోలీసు విభాగాలు జప్తు చేశాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సమర్థంగా వ్యవహరించి అత్యధికంగా 2.04 లక్షల కేజీల గంజాయిని జప్తు చేసింది. ఆపరేషన్ పరివర్తన్ కింద సాగు చేస్తున్న గంజాయిని ధ్వంసం చేయడంతో పాటు వివిధ మార్గాల్లో సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి రవాణాను అడ్డుకుంది. స్వాధీనం చేసుకున్న గంజాయి మొత్తాన్ని అనకాపల్లి సమీపంలో ఒకేసారి కాల్చివేసింది. ఇంత భారీస్థాయిలో గంజాయిని పట్టుకోవడం, కాల్చివేయడం దేశంలో ఇదే తొలిసారి. ఏపీ తరువాత స్థానంలో ఒడిశా 1.70 లక్షల కిలోల గంజాయిని జప్తు చేసింది. ద్రవ రూపంలో మార్చిన లిక్విడ్ గంజాయి (హషీష్ ఆయిల్) అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కూడా ఏపీ ఇతర రాష్ట్రాలకంటే ముందుంది. 2021లో ఏపీ పోలీసు శాఖ దేశంలోనే అత్యధికంగా 18.14 లీటర్ల హషీష్ ఆయిల్‌ను జప్తు చేసింది.

బందరు పోర్టుకు లైన్‌క్లియర్

అడ్డుకునేందుకు యత్నించిన 'నవయుగ'కు హైకోర్టులో మళ్లీ చుక్కెదురు

- ప్రభుత్వాన్ని నియంత్రించే ఉద్దేశంతో సంస్థ దాఖలుచేసిన అనుబంధ పిటిషన్లు కొట్టివేత
- పోర్టు నిర్మాణ పనులను ఇతరులకు అప్పగించకుండా ఆదేశాలివ్వలేం
- హైకోర్టు స్పష్టంచేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మచిలీపట్నం (బందరు) పోర్టుకు ఎదురైన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. తాజాగా గురువారం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో పోర్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. వచ్చే నెలలో ముఖ్యమంత్రి దీనికి శంకుస్థాపన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంట్రాక్టు వ్యవహారంలో నవయుగ పోర్టు లిమిటెడ్‌కు హైకోర్టులో మరోసారి చుక్కెదురు కావడమే ఇందుకు కారణం. మచిలీపట్నం పోర్టు నిర్మాణంలో ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు 'నవయుగ' సంస్థ దాఖలు చేసిన మూడు అనుబంధ పిటిషన్లనూ హైకోర్టు గురువారం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. పోర్టు నిర్మాణ పనులను ఇతరులెవ్వరికీ అప్పగించకుండా ఆదేశాలివ్వాలంటూ ఆ సంస్థ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌నూ కొట్టేసింది. అలాగే, తమతో ఒప్పందం రద్దుచేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలుపుదల చేయాలన్న అనుబంధ పిటిషన్‌ను కూడా తోసిపుచ్చింది. అంతేకాక.. ఒప్పందం రద్దుచేసుకుంటూ ప్రభుత్వం జారీచేసిన జీఓ–66, ప్రాజెక్టును పీపీపీ నుంచి ఈపీసీ విధానంలోకి మారుస్తూ జారీచేసిన జీఓ–9 అమలును నిలుపుదల చేయాలంటూ దాఖలుచేసిన అనుబంధ పిటిషన్‌ను కూడా హైకోర్టు కొట్టేసింది. ఈ పోర్టు నిర్మాణం విషయంలో యథాతథస్థితి ఉత్తర్వులతో సహా నవయుగ కోరిన విధంగా ఏ రకమైన మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడం సాధ్యంకాదని హైకోర్టు తేల్చిచెప్పింది. టెండర్ ఖరారు, లెటర్ ఆఫ్ అవార్డ్ జారీ, లోయస్ట్ బిడ్డర్ ఒప్పందం కుదుర్చుకోవడం వంటి విషయాల్లో ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని స్పష్టంచేసింది. పోర్టు నిర్మాణంపై ముందుకెళ్లే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదన్న నవయుగ వాదనలనూ తోసిపుచ్చింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం 2,360 ఎకరాల భూమిని అప్పగించేందుకు సిద్ధమైనా కూడా నవయుగ తిరిగి కొత్త షరతులను విధిస్తూ వచ్చిందని హైకోర్టు ఆక్షేపించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. సింగిల్ జడ్జి తీర్పుపై దాఖలైన అప్పీల్‌ను డిసెంబర్ మొదటి వారంలో తదుపరి విచారణ జరుపుతామని తెలిపింది.

మొత్తం భూమిని ఒకేసారి ఇవ్వాలని ఎక్కడాలేదు...

'2008లో ఒప్పందం కుదిరినప్పటికీ, ఎప్పటికప్పుడు అవసరమైన భూమిని అప్పగిస్తూ వచ్చినప్పటికీ ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే మొత్తం భూమిని ఒకేసారి ఇవ్వాలన్న నిబంధనలు ఎక్కడా కనిపించలేదు. పైగా.. ఒప్పందంలోని బాధ్యతలను నిర్వర్తించడంలో రాయితీదారు (నవయుగ) విఫలమైతే ఆ ఒప్పందాన్ని రద్దుచేసుకోవచ్చునని ఒప్పందంలో స్పష్టంగా ఉంది. ఇక పోర్టు అభివృద్ధి కోసం 2,360 ఎకరాలతోపాటు మరో 519 ఎకరాల అసైన్డ్ భూమిని అప్పగించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే, ఈ ప్రతిపాదనను నవయుగ తిరస్కరించింది. 5,324 ఎకరాలను ఒకేసారి ఇవ్వాలని పట్టుబట్టింది. వీటన్నింటి దృష్ట్యా మొత్తం భూమిని ఒక్కసారే ఇవ్వలేదు కాబట్టి ప్రాజెక్టును చేపట్టలేదన్న నవయుగ వాదనను ఆమోదించలేకున్నాం.

సింగిల్ జడ్జి తీర్పుపై నవయుగ అప్పీల్

నవయుగ పోర్ట్ లిమిటెడ్‌తో ఒప్పందం రద్దు చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సింగిల్ జడ్జి సమర్థిస్తూ గత నెల 25న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ధర్మాసనం ముందు 'నవయుగ' అప్పీల్ చేసింది. దీంతోపాటు పోర్టు నిర్మాణ పనులను ఇతరులెవ్వరికీ అప్పగించకుండా ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు చేయడంతో పాటు సింగిల్ జడ్జి తీర్పు అమలును, ఒప్పందం రద్దు ఉత్తర్వుల జీఓ అమలును నిలిపేయాలని కోరుతూ మూడు అనుబంధ పిటిషన్లు దాఖలు చేసింది. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం ఈ నెల 20న మధ్యంతర ఉత్తర్వుల జారీపై తన నిర్ణయాన్ని రిజర్వ్‌చేసింది. తాజాగా గురువారం తన నిర్ణయాన్ని వెలువరించింది.

పరస్పర విరుద్ధంగా 'నవయుగ' లేఖలు

'నిజానికి.. 2019 ఏప్రిల్‌లో పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శికి రాసిన లేఖల్లో ప్రాథమిక పనులను మొదలుపెట్టినట్లు నవయుగ చెప్పింది. అయినప్పటికీ నవయుగ ముందుకెళ్లలేదు. అంతేకాక.. నవయుగ రాసిన లేఖలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ప్రాథమిక ఆధారాలను బట్టి నవయుగ బాధ్యతలను నిర్వర్తించలేదు. పైపెచ్చు కొత్త షరతులు విధిస్తూ వచ్చింది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదన్న నవయుగ వాదనను తోసిపుచ్చుతున్నాం. సింగిల్ జడ్జి తీర్పులో వ్యక్తంచేసిన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాం. వీటన్నింటి దృష్ట్యా నవయుగ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను కొట్టేస్తున్నాం'.. అని ధర్మాసనం స్పష్టంచేసింది.

అప్పటికే ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది

'ఒప్పందం రద్దును సమర్థిస్తూ సింగిల్ జడ్జి తీర్పునివ్వగా రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత లోయస్ట్ బిడ్డర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను ఇతరులెవ్వరికీ అప్పగించకుండా ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలన్న నవయుగ అభ్యర్థనను మన్నించలేకున్నాం. ఇక పోర్టు కొత్త మోడల్ ప్రకారం ప్రాజెక్టుకు అవసరమైన భూమిని 830 ఎకరాలకు కుదించారు. అలాగే, ప్రాజెక్టు వ్యయాన్ని రూ.700 కోట్లకు తగ్గించారు. అందువల్ల జీఓ–9 అమలు నిలుపుదల సాధ్యంకాదు. జీఓ–66 సంగతికొస్తే, సింగిల్ జడ్జి ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న తరువాతే నవయుగ పిటిషన్‌ను కొట్టేశారు. అందువల్ల దాని అమలును నిలుపుదల చేయలేం'.. అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

గడప గడపకు పనులు నెలలో మొదలు

▶ మొదటి పేజీ తరువాయి

నిధులు కేటాయించాం. ఈ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఎలాంటి ఆలస్యం, అలసత్వానికి తావు ఉండకూడదు. 15,004 సచివాలయాలను ఈ కార్యక్రమం ద్వారా సందర్శిస్తున్నాం. ఎమ్మెల్యేలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల స్థాయి సిబ్బంది అంతా నెలలో కనీసం 6 సచివాలయాలను సందర్శించాలి. ఎమ్మెల్యేలు కనీసం రెండు రోజుల పాటు సంబంధిత సచివాలయంలో గడిపి ప్రతి ఇంటినీ సందర్శించాలి. ఒక రోజులో కనీసం 6 గంటల పాటు గడప గడపకూ నిర్వహించాలి. మండల అధికారులు, పాలనా సిబ్బంది, సచివాలయ సిబ్బంది కూడా అంతే సమయం గడపాలి.

పక్కాగా ఈ-క్రాపింగ్

ఈ- క్రాప్ అత్యంత ముఖ్యమైన కార్యక్రమం. పొరపాట్లకు తావులేకుండా నూరు శాతం పూర్తి చేయాలి. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. ఈ సీజన్‌లో 107.62 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. రైతులను వారి క్షేత్రాల్లోకి తీసుకెళ్లి ఫొటో తీసుకోవడం, వివరాల నమోదు సెప్టెంబరు 30లోగా పూర్తిచేయాలి. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలు బయోమెట్రిక్ ద్వారా వీటిని అధీకృతం చేయాలి. అక్టోబరు 3లోగా ఇది పూర్తి చేయాలి. రైతుల కేవైసీలను అక్టోబరు 10లోగా పూర్తి చేయాలి. అక్టోబరు 10 నుంచి రైతులకు ఇ– క్రాప్ డిజిటల్ రసీదులు, ఫిజికల్ రసీదులు ఇవ్వాలి. అక్టోబరు 15 లోగా అది పూర్తి చేసి సోషల్ ఆడిట్ చేపట్టాలి. అక్టోబరు 25 నుంచి వారం రోజుల పాటు ఇ-క్రాప్ తుది జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించాలి. నవంబరు 1 నుంచి తుది జాబితాను అన్ని పోర్టల్స్‌లో అందుబాటులో ఉంచాలి. ఈ షెడ్యూల్ ప్రకారం ఈ- క్రాప్ పూర్తిచేసే బాధ్యత కలెక్టర్లదే. కనీసం 10% ఈ-క్రాప్‌ను స్వయంగా ఎంఏవో, ఎమ్మార్వోలు పరిశీలించాలి. కనీసం 6 శాతం ఆర్డీఏలు, ఏడీఏలు పరిశీలించాలి. కనీసం 5% ఈ-క్రాప్‌లను డీవోలు, 2% ఈ-క్రాప్‌లను జేసీలు, ఒక్క శాతం కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలి.

17.05 కోట్ల పని దినాలు

ఉపాధిహామీ కింద ఇప్పటివరకూ 17.05 కోట్ల పనిదినాలను సృష్టించడం అభినందనీయం. ఇప్పటివరకూ సగటు వేతనం రూ.210.02 ఉండగా కనీసం రూ.240 చొప్పున అందేలా కృషి చేయాలి. కేంద్రం నుంచి రూ.1,400 కోట్ల ఉపాధిహామీ బకాయిలు త్వరలోనే వస్తాయి. రాగానే వెంటనే విడుదల చేస్తాం. సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి.

డిజిటల్ లైబ్రరీలపై ప్రత్యేక శ్రద్ధ

డిసెంబర్‌లోగా 4,500 గ్రామ సచివాలయాలకు కేబుల్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యం కలుగుతుంది. అక్కడ డిజిటల్ లైబ్రరీలను పూర్తి చేయాలి. మిగిలిన చోట్ల కూడా డిజిటల్ లైబ్రరీలపై కలెక్టర్లు దృష్టి సారించాలి. పులివెందుల నియోజకవర్గం వేల్పుల గ్రామ సచివాలయ కాంప్లెక్స్‌లో ఏర్పాటైన డిజిటల్ లైబ్రరీని వినియోగించుకుంటూ గ్రామానికి చెందిన 30 మంది వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

డిసెంబర్ 21 నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం

డిసెంబర్ 21 నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తిచేసేలా అడుగులు ముందుకేయండి. జగనన్న కాలనీల్లో 3.5 లక్షలు, 1.5 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి. ఇళ్లు పూర్తయ్యే నాటికి ఎలక్ట్రిసిటీ, వాటర్, డ్రైనేజ్ సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలి. మిగిలిపోయిన లబ్ధిదారులకు డిసెంబర్‌లో ఫేజ్ 3 కింద ఇళ్ల మంజూరుకు కలెక్టర్లు కార్యాచరణ రూపొందించాలి. పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై ఆడిట్ ప్రక్రియ వచ్చే 20 రోజుల్లో సంపూర్ణంగా పూర్తి కావాలి. డిసెంబర్ నాటికి 1.75 లక్షల టిడ్కో ఇళ్లను పూర్తిచేసి ఇవ్వబోతున్నాం. ఈమేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి కావాలి.

ఎస్‌వోపీల ప్రకారం సర్వే

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వేలో భాగంగా ఇప్పటివరకూ 5,738 గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయింది. 2,662 గ్రామాలకు సంబంధించి ఓఆర్‌ఐలు జిల్లాలకు విడుదలయ్యాయి. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం సర్వే ప్రక్రియ సాగాలి.

స్పందన అర్జీల్లో సమయ పాలన, నాణ్యత

స్పందన అర్జీల్లో సమయ పాలన, నాణ్యత కనిపిస్తోంది. దీనికి దోహదపడ్డ అధికారులకు అభినందనలు. నిర్దీత సమయంలోగా పరిష్కారం కాని పెండింగ్ కేసులు, తిరిగి విచారణ చేయాల్సిన అర్జీల సంఖ్య బాగా తగ్గింది. పరిష్కారంలో నాణ్యత ఉందనేందుకు ఇది నిదర్శనం. కలెక్టర్లు అందరికీ అభినందనలు. అర్జీ పరిష్కారానికి ముందు విచారణ వివరాలను అర్జీదారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలి. ఈ కొత్త ఫీచర్ సెప్టెంబరు 14 నుంచి ప్రారంభమైంది. ఇది తప్పనిసరిగా అమలు చేయాలి. దరఖాస్తుదారుడితో లొకేషన్‌లో సెల్ఫీ తీసుకుని అప్‌లోడ్ చేయాలి. ఈ ఫీచర్ కూడా సెప్టెంబరు 26 నుంచి మొదలైంది. ఇది కూడా తప్పనిసరిగా పాటించాలి.

ఎస్‌డీజీ లక్ష్యాలపై కలెక్టర్ల పర్యవేక్షణ

ఎస్‌డీజీ లక్ష్యాలపై కలెక్టర్లు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలి. డేటాను సక్రమంగా అప్‌లోడ్ చేయాలి. అప్పుడే ఎస్‌డీజీల్లో మార్పులు కనిపిస్తాయి. ఎస్‌డీజీల ఆధారంగానే కలెక్టర్లకు మార్కులు కేటాయిస్తాం. పనితీరు, సమర్థత ఎస్‌డీజీ లక్ష్యాల సాధన ఆధారంగా నిర్ణయిస్తాం. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనను మన రాష్ట్రమే కాకుండా దేశం మొత్తం చూస్తుంది.

సచివాలయాల్లో రోజూ సాయంత్రం స్పందన

ప్రతి బుధవారం కలెక్టర్లు స్పందనపై సమీక్ష చేయాలి. సచివాలయాల్లో రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ స్పందన నిర్వహించాలి. కలెక్టర్ల నుంచి దిగువ స్థాయి అధికారుల వరకూ తప్పనిసరిగా స్పందనలో పాల్గొనాలి. స్పందనలో పాల్గొన్న అధికారులు కలెక్టర్లు నిర్వహించే సమీక్షకు తప్పనిసరిగా హాజరుకావాలి. స్పందన అర్జీల పరిష్కారంలో కలెక్టర్లు, అధికారులు, ఎస్పీలు మానవీయత ప్రదర్శించాలి. తిరిగి విచారణ చేయాల్సిన అర్జీల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టాలి. అలా జరిగితేనే అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉన్నట్లు. తిరిగి అదే సమస్యపై అర్జీ వస్తే పై అధికారి లేదా మరో అధికారితో విచారణ చేయించండి.

ఇళ్ల నిర్మాణంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం

గృహ నిర్మాణం వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, పశ్చిమ గోదావరి, బాపట్ల, ఏలూరు, కర్నూలు జిల్లాల్లో గృహ నిర్మాణం బాగుంది. సత్యసాయి, ప్రకాశం, అనకాపల్లి, కృష్ణా, అనంతపురం జిల్లాలు దీనిపై దృష్టి పెట్టాలి. విశాఖలో 1.24 లక్షల ఇళ్లను కేటాయించాం. అక్టోబరు నాటికి అన్ని ఇళ్ల పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలి. కనీస సదుపాయాలు (బోర్‌వెల్స్, ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు, అప్రోచ్ రోడ్లు, సీడీ వర్క్స్, గోడౌన్స్) ఇప్పటికే 85 శాతం పూర్తయ్యాయి. ఇక్కడ ఇళ్ల పనులు వేగంగా జరిగేలా సంబంధిత కలెక్టర్లు చూడాలి. పూర్తయిన పనులకు సంబంధించి పేమెంట్లు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగంగా ముందుకు సాగాలి. ఆప్షన్ 3 కింద 3.27 లక్షల ఇళ్లు నిర్మాణం అవుతున్నాయి. 10 వేల ఇళ్లకు పైబడి ఉన్న లేఅవుట్లలో స్టేజ్ కన్వర్షన్ వేగంగా జరగాలి. విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, కాకినాడ, మచిలీపట్నం, విజయనగరం, ఏలూరు, ఆదోని, తిరుపతి, జీవీఎంసీ లేఅవుట్లపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టిపెట్టాలి.

ఏసీబీ, ఎస్‌ఈబీ నంబర్లతో పోస్టర్లు

దిశ యాప్‌ను ప్రతి ఇంట్లో డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలి. దిశ పనితీరుపై పర్యవేక్షణ చేసేలా కలెక్టర్లు, ఎస్పీలు మాక్ కాల్స్ చేయాలి. అవినీతి నిర్మూలనకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ నంబర్ 14400 పోస్టర్ అందరికీ కనిపించేలా 3 x 5 సైజులో ఉండాలి. ఈ పోస్టర్ లేకపోతే సంబంధిత కార్యాలయంలో ఉండే ముఖ్య అధికారిని బాధ్యుడ్ని చేయాలి. ప్రతి యూనివర్సిటీ, కాలేజీలో కూడా ఎస్‌ఈబీ నంబర్ 14500 ఉండాలి. మాదక ద్రవ్యాలకు సంబంధించిన ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

భూసేకరణపై దృష్టి పెట్టాలి

జాతీయ రహదారులకు భూ సేకరణపై కలెక్టర్లు దృష్టి సారించాలి. బెంగళూరు– విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే రాష్ట్రంలో 345 కి.మీ మేర ఉంది. దాదాపు రూ.17 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై దృష్టిపెట్టాలి. జాతీయ రహదారులకు సంబంధించి 2,758 కి.మీ పరిధిలో రూ.33,507 కోట్లతో చేపడుతున్న 95 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. మరో 2,687 కిలోమీటర్ల పరిధిలో రూ.55,890 కోట్లతో చేపడుతున్న మరో 63 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధంగా ఉన్నాయి. జాతీయ రహదారులకు సంబంధించి దాదాపు రూ.1.05 లక్షల కోట్లకు పైగా విలువైన పనులు చేపడుతున్నాం. వీటికి భూసేకరణపై కలెక్టర్లు దృష్టి సారించాలి.

సమీక్షలో ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం, సీఎస్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



SAATCHI & SAATCHI

> దుష్టకార్యాలు చేసేవారు చివరికి, ఆ పాపపంకిలంలో పూర్తిగా కూరుకుపోతారు. అలాంటివారే నరకవాసులు. దీనికి భిన్నంగా సత్యాన్ని విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు స్వర్గవాసులవుతారు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, సెప్టెంబర్, 30

పాలకులకు మేలుకొలుపు!

'**ఉ**త్తములైన సివిల్ సర్వీస్ అధికారులుంటే సరైన చట్టాలు లేకున్నా సమర్థవంతమైన పాలనకు లోటుండదు. అత్యుత్తమ చట్టాలున్నప్పటికీ అధికారులు సరైనవారు కాకుంటే అలాంటిచోట పాలన కుంటుబడుతుంది' అంటాడు జర్మన్ రాజనీతిజ్ఞుడు బిస్మార్క్. బాలికలుగా తమ అవసరాలేమిటో చెప్పిన ఒక విద్యార్థినికి బిహార్ మహిళా ఐఏఎస్ అధికారి హర్‌జోత్ కౌర్ నిర్దయగా ఇచ్చిన జవాబు గమనిస్తే దేశంలో అధికార యంత్రాంగం మొద్దుబారుతున్నదా అనే సందేహం కలుగుతుంది. రాజధాని పట్నాలో బుధవారం ఒక గోష్ఠి సందర్భంగా జరిగిన ఈ ఉదంతం ఒక రకంగా ఆశ్చర్యకరం. ఎందుకంటే ఆ గోష్ఠి మకుటమే 'సశక్తి బేటీ, సమృద్ధ బిహార్'. బాలికా సాధికారత ద్వారానే బిహార్ సమృద్ధి సాధిస్తుందన్నది దాని సారాంశం. కానీ ఆ అధికారిణి అందుకు విరుద్ధమైన పోకడలకు పోయారు. ప్రశ్న అడిగిన బాలికతో వాదులాటకు దిగారు. అనుచితమైన వ్యాఖ్యలు చేశారు. 'ఇన్ని పథకాలకు ఇంతగా ఖర్చుపెడుతున్న ప్రభుత్వంవారు బాలికలకు ప్రతి నెలా 20, 30 రూపాయల విలువ చేసే నాప్‌కిన్‌లు ఇవ్వలేరా?' అన్నది ఆ బాలిక ప్రశ్న.

నిజానికి బాలికలు అడగకముందే పాలకులు గమనించి తీర్చవలసిన సమస్య ఇది. దేశంలో మధ్యలోనే చదువు ఆపేస్తున్న బాలికల శాతం ఆందోళనకరంగానే ఉంది. కౌమార దశలో బడి మానేస్తున్న ఆడపిల్లల శాతం గత మూడేళ్లలో బిహార్‌లోనే అధికమని మొన్న ఏప్రిల్‌లో కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణా దేవి పార్లమెంటులో చెప్పారు. రుతుస్రావ సమయంలో పరిశుభ్రమైన నాప్‌కిన్‌లు వాడలేకపోవటం, ఉన్నా వాడటానికి అనువైన మరుగు స్కూళ్లలో కొరవడటం బాలికలకు శాపంగా పరిణమిస్తోంది. వారు అనేక వ్యాధులబారిన పడవలసివస్తోంది. కేవలం ఈ కారణంతో ఏటా చదువులకు దూరమయ్యే విద్యార్థినులు 23 శాతం ఉంటారని ఐక్యరాజ్యసమితికి చెందిన నీటి సరఫరా, పారిశుద్ధ్యం వ్యవహారాల మండలి నిరుడు తెలియ జేసింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహిళాభివృద్ధి కార్పొరేషన్ ఎండీగా ఉంటూ కూడా ఇలాంటి దుఃస్థితిని బాలిక చెప్పేంతవరకూ గమనించలేకపోయినందుకు సిగ్గుతో తలవంచు కోవాల్సిందిపోయి హర్‌జోత్ కౌర్ దబాయింపు ధోరణిలో మాట్లాడటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది.

'ఇవాళ నాప్‌కిన్స్ అడుగుతున్నారు. రేపు జీన్స్, ఆ తర్వాత అందమైన షూస్ కావాలంటారు. చివరకు ఉచితంగా కండోమ్‌లు ఇవ్వమని అడుగుతారు' అంటూ ఆమె జవాబివ్వటం బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ఠ. అడిగిన ప్రశ్నకు జవాబివ్వలేక 'అన్నీ ప్రభుత్వమే ఎందుకివ్వాలి... ఇది తప్పుడు ఆలోచనాధోరణి' అంటూ వాదులాటకు దిగడం ఆమె వైఖరికి అద్దం పడుతుంది. మరుగుదొడ్ల గురించి అడిగినప్పుడు సైతం తలతిక్క సమాధానమే వచ్చింది. పైగా దేశాన్ని పాకిస్తాన్ చేస్తారా అని బాలికలను ప్రశ్నించారు. అయినా తొమ్మిది, పది తరగతులు చదువుతున్న ఆ బాలికలు వెరవకుండా నిలదీసిన తీరు ప్రశంసించదగ్గది. మొదటగా ప్రశ్నించిన బాలిక నేపథ్యం గమనిస్తే సమస్య తీవ్రతేమిటో అర్థమవుతుంది. రియా కుమారి అనే ఆ బాలిక నగరంలోని ఒక మురికివాడకు చెందినామె. నాప్‌కిన్ వాడకం ఈమధ్యే తెలిసిందట. తనవంటి బాలికలు ఇంకా వేలాదిమంది ఉన్నారని, తెలిసినా వాటిని వాడే స్థోమత ఆ బాలికలకు లేదని చెబుతోంది.

చదువుల్లో చురుగ్గా ఉండేవారు, నాయకత్వ లక్షణాలున్నవారు, సవాళ్లను ఎదుర్కొనే సాహస వంతులు సివిల్ సర్వీసుల బాట పడతారని ఒక అభిప్రాయం ఉంది. దేశంలో మెజారిటీగా ఉన్న అట్టడుగువర్గాల ప్రజానీకం సమస్యలపై సహానుభూతితో వాటిని ఆకళింపు చేసుకుని, సృజనాత్మక పరిష్కారాలను వెదికే అధికారుల వల్లనే సమాజానికి మేలు జరుగుతుంది. హర్‌జోత్ కౌర్‌కు ఈ అవగాహన ఏ మేరకుందో అనుమానమే. సివిల్ సర్వీసు పరీక్షలు రాసి, ఇంటర్వ్యూలో కృతార్థులయ్యాక ఆ అధికారులకు ఇక పరీక్షలేమీ ఉండకపోవచ్చు. కానీ పాలనా యంత్రాంగంలో భాగస్థులై, సమస్యలను సవాలుగా తీసుకుని పనిచేసేవారికి ఎప్పుడూ పరీక్షే. నిజానికి ఆ బాలికలు అడిగిన సమస్యలేమీ తీర్చలేనివి కాదు. దేశంలో ఎవరూ అమలు చేయనివి కాదు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుడు అక్టోబర్‌లో ఇలాంటి పథకం ప్రారంభించింది. 7వ తరగతి మొదలు ఇంటర్మీడియెట్ వరకూ చదివే పది లక్షలమంది బాలికలకు ప్రతినెలా పది నాప్‌కిన్‌ల చొప్పున ఈ పథకం కింద అందజేస్తున్నారు. ఆఖరికి ఇంటి దగ్గర వాడుకోవడానికి వేసవి సెలవుల ముందు ఒకేసారి ఇస్తున్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నారు.

రెండేళ్లనాడు సివిల్ సర్వీసుల ప్రొబేషనర్లనుద్దేశించి 'ప్రజలను కేవలం ప్రభుత్వ పథకాలు తీసుకొనేవారిగా పరిగణించొద్దు. నిజానికి మన పథకాలకూ, కార్యక్రమాలకూ వారే చోదకశక్తులు' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అధికార యంత్రాంగంలో ఈ స్పృహ కలగాలంటే పనిచేస్తున్న శాఖల్లో వారి నిబద్ధత, నిమగ్నత ఏపాటో మదింపు వేస్తుండాలి. ఇతరేతర రాష్ట్రాల్లో అమలయ్యే పథకాలు, వాటి మంచిచెడ్డల గురించి వారి అవగాహనేమిటో తెలుసుకోవాలి. అసలు సివిల్ సర్వీసులకున్న ఎంపిక ప్రక్రియనే ప్రక్షాళన చేయాలి. ఎందుకంటే ప్రజలు మునుపట్లా లేరు. అన్నీ చూస్తున్నారు. ఎక్కడేం జరుగుతున్నదో తెలుసుకుంటున్నారు. ఆ ప్రశ్నలడిగిన బాలికలు ఒక రకంగా పాలకులకు మేలుకొలుపు పాడారు. సరిదిద్దుకోవాల్సిన వంతు వారిదే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.పంచమి రా.10.37 వరకు, తదుపరి షష్ఠి
నక్షత్రం: విశాఖ ఉ.6.28 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.10.19 నుండి 11.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు తదుపరి ప.12.15 నుండి 1.03 వరకు, **అమృతఘడియలు:** రా.7.23 నుండి 8.57 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.49
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కాంగ్రెస్ లో-కమాండ్

విశ్లేషణ



నీరజా చౌదరి

కాంగ్రెస్ పార్టీ మీద గాంధీ కుటుంబం తన ప్రాభవం కోల్పోతూ వస్తోంది. ఆ కుటుంబం ఎన్నికల్లో గెలుపును సాధించలేకపోతోంది. వరుస ఎన్నికలు దీన్ని రుజువు చేశాయి కూడా! భారత్ జోడో యాత్ర సందర్భంగా అసంఖ్యాక ప్రజల అభినందనలు అందుకుంటున్న రాహుల్ గాంధీ కూడా పార్టీకి ఓట్లు సంపాదించే స్థానంలో లేరు. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ క్రియాశీలంగా వ్యవహరించడానికి ఆరోగ్యం అంతగా సహక రించడం లేదు. ఇక కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం హై కమాండ్ అనేదే లేకుండా పోయిందని రాజస్థాన్ పరిణామాలు నొక్కి చెప్పాయి. లాంఛనప్రాయంగా అధిష్ఠానం ఉనికిలో ఉన్నప్పటికీ దాని ఆదేశాలు పని చేయడం లేదు. గాంధీ కుటుంబ ఆధిపత్యం లేని కాలంలోకి కాంగ్రెస్ ప్రవేశిస్తోందా?

సీతారాం కేసరిని 1998లో సాగనంపి, సోనియా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజుల తర్వాత మాజీ ప్రధాని పీవీ నరసింహారావును కలిసి పిచ్చాపాటీగా మాట్లాడాను. మా సంభాషణ క్రమంలో ఆయన ఏమన్నారంటే... ''ఇప్పుడు ఈ పార్టీ రాబోయే 25–30 సంవత్సరాల కాలం వరకు ఈ కుటుంబం చేతుల్లోకి వెళు తుంది'' అన్నారు. పీవీ నిజంగానే జ్యోతిష్యుడి అవతారమెత్తారు. పాతికేళ్లపాటు కాంగ్రెస్ వ్యవహారాలను శాసించిన నెహ్రూ–గాంధీ కుటుంబ ప్రభావం ఇప్పుడు క్షీణించిపోతోంది.

జీకే మూపనార్, ఎమ్ఎల్ ఫోతేదార్, బూటా సింగ్ లేదా సీతారాం కేసరి వంటి వారిని హైకమాండ్ దూతలుగా పంపినప్పుడు ఆయా రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు వణికిపోయే కాలం ఒకప్పుడు ఉండేది. విషయం చెప్పగానే ఒకే ఒక వాక్యంతో రాజీనామా చేసి వెళ్లిపోయేవారు. లేదా కాంగ్రెస్ అధ్యక్షురాలికి కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసే అధికారాన్ని కట్టబెడుతూ ఒక ఆదేశం వచ్చేది. దాన్ని అందరూ బుద్ధిగా పాటించిన కాలమది.

కానీ భారతదేశం మారుతోంది. దానికి అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ కూడా మారుతోంది. మారుతున్న ఈ వాస్తవాన్ని రాజస్థాన్ నాటకీయంగా నొక్కి చెప్పింది. ఈ నాటకీయ ప్రకటన కర్త మరెవరో కాదు, కాంగ్రెస్ సొంత ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ అని చెప్పాలి. జైపూర్‌లో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశాన్ని ఏర్పర్చాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ స్వయంగా చెప్పారు. రాజస్థాన్ తదుపరి ముఖ్యమంత్రిని ఎంచుకునే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షు రాలికి కట్టబెడుతూ సీఎల్పీ నుంచి ఒకే ఒక్క వాక్యంతో కూడిన తీర్మానాన్ని ఆమోదింపచేసుకునేందుకు వచ్చినవారు రాజస్థాన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి అజయ్ మాకెన్; సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే. సోనియాగాంధీ ఈ తరహా పని విధానాన్ని సంవత్సరాలుగా అమలు చేస్తూ వస్తున్నారు మరి.

రాజస్థాన్ కొత్త ముఖ్యమంత్రిగా సచిన్ పైలట్‌ని నియమించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. సచిన్‌కి సీఎం పదవిని కట్టబెడ తామని 2014 నుంచి అధిష్ఠానం హామీ ఇస్తూ వస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనుభవజ్ఞుడైన అశోక్ గెహ్లోత్‌ని జాతీయ స్థాయికి తీసుకురావాలని అధిష్ఠానం భావించింది. ఒక రకంగా ఇది ఇరువురు నేతలకూ గెలుపు కట్టబెట్టేదేనని అనిపించింది. యువకుడైన సచిన్ పైలట్ వచ్చే సంవత్సరం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి పార్టీ గెలిచే స్థానాలను మరింతగా పెంచుతారని అందరూ భావిస్తున్నారు. ఇక గెహ్లోత్ అయితే రాజస్థాన్‌లో పార్టీని నిర్మించారు. మూడుసార్లు ముఖ్య మంత్రిగా ఆయన పాలనానుభవం కానీ, కాంగ్రెస్ వ్యవస్థను, భారత దేశాన్ని 40 సంవత్సరాలుగా అర్థం చేసుకుంటూ వచ్చిన సీనియర్‌గా



గానీ 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానాలను మరింతగా పెంచగలరని అందరూ భావిస్తూ వచ్చారు. అధిష్ఠానం కూడా గెహ్లోత్‌పై చాలా అంచనాలు పెట్టుకుంది. నరేంద్రమోదీ నేతృత్వం లోని బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఐక్యత కోసం చేసే ప్రయత్నంలో గెహ్లోత్ పార్టీలో అందరికీ ఆమోదయోగ్యమైన నేతగా ఉంటారని అధిష్ఠానం భావించింది. దానికి అనుగుణంగానే గాంధీ కుటుంబం విశ్వాసాన్ని గెహ్లోత్ పొందుతూ వచ్చారు. ఆ కుటుంబానికి నిజమైన విశ్వసనీయుడిగా ఆయన కనిపించారు కూడా.

అయితే పాతకాలపు కాంగ్రెస్ రాజకీయ నేత అయిన గెహ్లోత్ రాజస్థాన్ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటూ అధిష్ఠానం మాట పెడచెవిన పెట్టారు. కాబట్టే అనుకున్న ప్రకారం రాజస్థాన్ సీఎల్పీ సమావేశం జరగలేదు. గెహ్లోత్ అనుయాయులుగా భావి స్తున్న 92 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరోచోట సమావేశమై, నేరుగా స్పీకర్ నివాసానికి వెళ్లి తమ అసెంబ్లీ స్థానాలకు రాజీనామాలు సమర్పించారు. పైలట్‌ని సీఎంగా చేస్తే అంగీకరించమని ధిక్కారం ప్రకటించారు. వారు పార్టీకే మూడు షరతులు పెట్టారు. అక్టోబర్ 16 తర్వాతే అంటే గెహ్లోత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాతే రాజస్థాన్ సీఎం ఎవరనేది నిర్ణయించాలి(తాజాగా అశోక్ గెహ్లోత్ తాను అధ్యక్ష పోటీలో లేనని తేల్చేశారు); 2020లో సచిన్ పైలట్‌తో పాటు తిరుగుబాటు చేసిన వారిలో ఏ ఒక్కరినీ సీఎంగా చేయ కూడదు; చివరగా కాంగ్రెస్ పార్టీ కేంద్ర పరిశీలకులు ఎమ్మెల్యేలను బృందాలుగానే తప్ప వ్యక్తులుగా మాట్లాడరాదు.

తన పక్షానే మెజారిటీ సభ్యులు ఉన్నారని గెహ్లోత్ పార్టీ అధిష్ఠానానికి స్పష్టమైన సందేశం పంపారు. అసెంబ్లీకి రాజీనామా చేస్తామని ఎమ్మెల్యేలు హెచ్చరించడంతో సూత్రరీత్యా చెప్పాలంటే పార్టీని చీల్చగలనని తేల్చి చెప్పినట్లే అయింది. అదే సమయంలో గెహ్లోత్‌కూ, సచిన్ పైలట్‌కూ మధ్య సంబంధాలు పూర్తిగా బెడిసి కొట్టాయి. అవి సాధారణ రాజకీయ విభేదాల స్థాయిని దాటి పోయాయి. జాతీయ నాయకత్వం కూడా వీరి మధ్య ఘర్షణను పరిష్కరించలేకపోయింది.

భూపేందర్ సింగ్ హుడాకు విశ్వసనీయులైన హరియాణా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, 2016 రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ మద్దతున్న స్వతంత్ర సభ్యుడు సుభాష్ చంద్ర గెలుపొందడంలో సహాయం చేసినప్పుడు కూడా అధిష్ఠానం ఏమీ చేయలేకపోయింది. ఓటింగ్ సమయంలో 'తప్పు పెన్' వాడిన కారణంగా 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇటీవలి కాలంలో పంజాబ్‌లోనూ కెప్టెన్ అమరీందర్ సింగ్‌ను సీఎం పదవి నుంచి దింపేశాక, ఆ తర్వాత కాంగ్రెస్ ఆ రాష్ట్రంలోనే అధికారాన్ని కోల్పోయింది.

నరేంద్ర మోదీ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ గాంధీ కుటుంబం తన ప్రాభవం కోల్పోతూ వస్తోంది. పార్టీ కోసం ఆ కుటుంబం ఎన్నికల్లో గెలుపును సాధించలేకపోయింది. పైగా పార్టీకి అవసరమైన డబ్బును కూడా గాంధీ కుటుంబం సేకరించలేక పోయింది. ఆనాటి నుంచి వరుసగా జరుగుతూ వచ్చిన ఎన్నికలు దీన్ని రుజువు చేశాయి కూడా. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం భారత్ జోడో యాత్ర సందర్భంగా అసంఖ్యాక ప్రజల అభినందనలు అందు కుంటున్న రాహుల్ గాంధీ కూడా పార్టీకి ఓట్లు సంపాదించే స్థానంలో లేరు. ప్రియాంకా గాంధీ వాద్రా ఆశించినంతగా ఫలితాలు సాధించ లేకపోతున్నారు. ఇకపోతే కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ క్రియాశీలకంగా వ్యవహరించడానికి ఆరోగ్యం అంతగా సహక రించడం లేదు. పైగా రాజస్థాన్ వంటి సంక్షోభ పరిస్థితుల్లో జోక్యం చేసుకుని, ఒప్పందం కుదిర్చి, తన సమస్యలను పరిష్కరించ గలిగే అహ్మద్ పటేల్ వంటి అనుభవజ్ఞుల సహాయం కూడా సోనియాకు ఇప్పుడు లభ్యం కావడం లేదు. 92 మంది ఎమ్మెల్యేలు అధిష్ఠానాన్నే ధిక్కరిస్తున్నప్పుడు రాజస్థాన్ వ్యవహారాలను చూస్తున్న పార్టీ పరిశీలకులు కనీసం తిరుగుబాటు జరుగుతున్న సంకేతాలను కూడా పసిగట్టలేకపోయారు.

రాష్ట్ర భవిష్యత్ ముఖచిత్రం తానేనని చాలామంది భావిస్తున్న ప్పటికీ రాజస్థాన్ పరిణామాలు సచిన్ పైలట్‌కి కూడా షాక్ కలిగిం చాయి. అన్నిటికంటే ముఖ్యంగా పార్టీ అధిష్ఠానానికి చెంపపెట్టు అయి నట్లయింది. కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం హై కమాండ్ అనేదే లేకుండా పోయిందని రాజస్థాన్ పరిణామాలు నొక్కి చెప్పాయి. లాంఛన ప్రాయంగా అధిష్ఠానం ఉనికిలో ఉన్నప్పటికీ దాని ఆదేశాలు పని చేయడం లేదు. గాంధీ కుటుంబ ఆధిపత్యం లేని కాలంలోకి కాంగ్రెస్ ప్రవేశిస్తోందా? 1998లోనే పీవీ నరసింహారావు ఊహించినట్లు పార్టీలో గాంధీ కుటుంబ ఆధిపత్యం ముగిసిపోతున్నట్లేనా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

మనకాలం వీరుడు ఎమ్వీఆర్


సందర్భం



తాడి ప్రకాష్

2001వ సంవత్సరం. అమీర్‌పేటలో ఆర్టిస్ట్ మోహన్ ఆఫీసు. ఉదయం పది గంటలకి ఎం.వి. రమణారెడ్డి ఫోన్ చేశారు. 'హైద రాబాద్ బస్టాండ్‌లో వున్నా. అర గంటలో మీ ఆఫీసుకి వస్తాను' అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హెన్రీ షారియర్ నవల 'పాపి లాన్'ని ఆయన అనువ దించారు. కవర్ పేజీ బొమ్మ కోసం వస్తున్నారు. ఆయన చాలా రోజుల ముందే చెప్పినా మోహన్ బొమ్మ వేయ లేదు. తాపీగా ఒక ఎ4 సైజ్ బాండ్ పేపర్ తీసుకుని, రెక్కలతో ఒక మనిషి ఎగురుతున్న ఒక చిన్న బొమ్మ వేశాడు. దాన్ని స్కాన్ చేసి, పచ్చని అడివి వున్న ఒక బ్రోషర్ తీసి ఇచ్చి, దాన్ని బ్యాక్ గ్రౌండ్‌గా వాడమని కంప్యూటర్ ఆపరేటర్‌కి చెప్పాడు. ఆ పని అయ్యేలోగా 'రెక్కలు సాచిన పంజరం – ఎం.వి. రమణారెడ్డి' అని అక్షరాలు రాసిచ్చాడు. కవర్ పేజీ పైన అడివి, కింద సముద్రం అలలు, మధ్యలో ఎగిరే స్వేచ్ఛాజీవి– 20 నిమిషాల్లోనే రెడీ అయింది అందమైన కవర్ డిజైన్. ఎమ్వీఆర్ వచ్చారు. హాయిగా నవ్వి 'బాగుంది' అన్నారు. నాకు ఒకటే ఆశ్చర్యం. ప్రొద్దుటూరు ఫ్యాక్షనిస్టూ, హత్య కేసులో జైలుకెళ్లిన మనిషీ, వైద్యం చేసే డాక్టరూ, ఉద్యమాలూ నడిపి, నిరాహార దీక్షలు చేసి, ఎమ్మెల్యేగా గెలిచి రాయలసీమకోసం గొంతెత్తినవాడూ, పుస్తకాలు రాసినవాడూ ఈయనేనా? సౌమ్యంగా, వినమ్రంగా, సంస్కారవంతంగా, స్నేహశీలిగా ఉన్న ఈ నిరాడంబరమైన బక్కపలచని మానవుడేనా?

ఎమ్వీఆర్‌గా ప్రసిద్ధుడైన మల్లెల వెంకట రమణా రెడ్డి తెలుగు సాహిత్యానికి కొన్ని అరుదైన కానుకలు ప్రసాదించిన ప్రతిభామూర్తి. విప్లవ కారుడూ, తిరుగుబాటుదారుడూ అయిన ఎమ్వీఆర్ మహాభారతాన్ని లోతుగా అధ్యయనం చేసినవాడు. 'గుడిపాటి వెంకటచలం వచనం నాకిష్టం. ఆ ప్రభావం నా మీద వుంది' అని ప్రకటించినవాడు. ఎంత విస్తృతంగా చదువుకున్నాడో ఆయన రచనల్లోని వైవిధ్యమే మనకి చెబుతుంది.



మార్గరెట్ మిషెల్ 'గాన్ విత్ ది విండ్', గోర్కీ 'అమ్మ', ఆర్‌కె నారాయణ్ 'పెద్దపులి ఆత్మకథ', 'మాటకారి' నవలలు తేట తెలుగులోకి అనువదించారు ఎమ్వీఆర్. 'ఆయుధం పట్టని యోధుడు' టైటిల్‌తో మార్టిన్ లూథర్ కింగ్ జీవిత చరిత్ర రాశారు. భారతంలో ద్రౌపది ప్రాధాన్యాన్నీ, విశిష్టతనీ తెలియజెప్పే 'తెలుగింటికొచ్చిన ద్రౌపది' ఒక అరుదైన రచన. ఎమ్వీఆర్ రాసిన 'రాయలసీమ కన్నీటి గాథ' ప్రజాదరణ పొందిన ఒక సీరియస్ డాక్యుమెంట్. జీవిత చరమాంకంలో రాసిన 'తెలుగింటి వ్యాకరణం' ఒక అసాధారణమైన రచన. 'టూకీగా ప్రపంచ చరిత్ర' అని ఏకంగా నాలుగు సంపుటాలు రాసిన మన హెచ్.జి. వెల్స్ ఎమ్వీ రమణారెడ్డి. నవ చైనా సామాజిక జీవితం గురించి ఒక బ్రిటిష్ డాక్టర్ రాసిన పుస్తకాన్ని 'పురోగమనం' పేరుతో అనువదించారు.

ఎనిమిది ఉత్తమ తెలుగు చిత్రాలకు ఆయన రాసిన సమీక్షలు ఎప్పటికీ మరిచిపోలేనివి. 'తెలుగు సినిమా స్వర్ణయుగం'లో మల్లీశ్వరి, జయభేరి, దొంగరాముడు, దేవదాసు, బంగారు పాప, పాతాళ భైరవి, మాయా బజార్, విప్రనారాయణలను ఆయన సమీక్షించిన తీరు పాఠకుల్ని పరవశుల్ని చేస్తుంది. అవి డాక్టోరల్ థీసిస్‌కు దీటైన పరిశోధన చేసి రాసినవని ముళ్ళపూడి వెంకట రమణ కితాబిచ్చారు.

ఎమ్వీ రమణారెడ్డి అనే పదహారణాల ప్రజల మనిషి, అక్షరాలా ఉత్తమ సాహితీవేత్త మన సాహిత్యానికి చేసిన కంట్రిబ్యూషన్ వెలకట్టలేనిది. కడప జిల్లా ప్రొద్దుటూరు అంటే ఆనాడు 'శివతాండవం' చేసిన పుట్టపర్తి నారాయణాచార్యులవారు, ప్రొద్దుటూరు అంటే తెలుగు సాహితీ పతాకాన్ని నీలాకాశం చేసి ఎగరేసిన ఎమ్వీ రమణారెడ్డి... అనే మనకాలం వీరుడు. ఉద్యమం, అధ్యయనం, ఆదర్శం కలిసి ప్రవహిస్తే... అదే ఉజ్వలమైన, ఉత్తేజకరమైన ఎమ్వీఆర్ జీవితం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 97045 41559
(నేడు ప్రొద్దుటూరులో ఎమ్వీఆర్ విగ్రహ ఆవిష్కరణ)

ఉంటారా?



కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేయనని అశోక్ గెహ్లోత్ ప్రకటించారు. ఆయన రాజస్థాన్ సీఎంగానైనా కొనసాగుతారా? ఎంత కాలం?

– సుధీర్ చౌధరి, సంపాదకుడు

నిషేధం సరికాదు



సూత్రప్రాయంగా ఏ సంస్థనైనా నిషేధించడానికి వ్యతిరేకిని. నిషేధిస్తే అది అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంది. ఇలాంటి సంస్థలతో మనం సిద్ధాంతపరంగా పోరాడాలి.

– షాహిద్ సిద్దిఖీ, ఆర్ఎల్‌డీ ఉపాధ్యక్షుడు

రేషన్ షాపుల్లో కాదు.. గుండెల్లో పెట్టుకుంటాం!

సారాంశం
సరికొండ చలపతి

'న్యాయమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్రపంచం అన్నది ప్రతి ఒక్కరి హక్కు.. నిజం చెప్పాలంటే ప్రపంచం ఏమంత బాగాలేదు'..
– ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సమావేశంలో వారం క్రితం నటి ప్రియాంక చోప్రా మాట ఇది..

....

బ్రిటన్‌ను దాటి ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఇండియా.. కాలరెత్తుకున్న ఇండియన్
– ఓ మెట్టు ఎక్కిన ఆర్థిక భారతం.
మానవాభివృద్ధి సూచీలో 132వ స్థానంలో మనం..
– విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల్లో మరో మెట్టుజారిన పేద భారతం..

....

ఈ రెండూ దాదాపు వారం తేడాతో వచ్చిన వార్తలే. కానీ పరస్పర విరుద్ధం.

ఇది చూస్తే పాత జోక్ ఒకటి జ్ఞాపకం వస్తుంది.

ఓ రిచ్ స్టూడెంట్ పేదవాడిపై రాసిన వ్యాసం..

'వాళ్లింట్లో తల్లి, తండ్రి, పిల్లలు అంతా పేదవాళ్లే. వారి ఇంట్లో పనిమనిషి పేదవాడే, తోటమాలీ పేదవాడే.. చివరికి కారు డ్రైవరూ బాగా పేదవాడే..' అని..

....

ఎకానమీ గణాంకాలు ఎప్పుడూ 'ద్రవ్యోల్బణం'లా ఉంటాయి.. అర్థమైనట్టే ఉన్నా అయోమయంగా తోస్తాయి. పెరిగాయో, తగ్గాయో తెలియదు.. ఎక్కడ, ఎందుకు పెరుగుతాయో, తగ్గుతాయో సామాన్యులెవరికీ అర్థంకాదు.

... 'ఏమంత బాగాలేదు'.. అన్న విషయం మాత్రం అనుభవంలోకి వస్తుంది..

ఏదీ సెక్యూరిటీ?

విద్య, వైద్యంతో కూడిన 'సామాజికాభివృద్ధి సూచీ'కి ప్రాధాన్యం ఎంత ఉంటుందో ఓ నెటిజెన్ షేర్ చేసిన ఈ మెసేజ్ చూస్తే తెలుస్తుంది.

''..నేను పెద్దవాళ్లు చెప్పినట్టుగా డిగ్రీ చేశా.. మంచి ఉద్యోగం సంపాదించా.. సమాజ నియమాలకు అనుగుణంగా పెళ్లి చేసుకున్నా.. ఆర్థిక నిపుణుల సూచన మేరకు నడుచుకుని పొదుపు చేసుకున్నా. రిటైర్‌మెంట్ ప్లాన్ చేసుకున్నా.. క్రెడిట్ కార్డుల జోలికి వెళ్లనే లేదు. సర్కార్ చెప్పినట్టుగా ట్యాక్స్‌లు కట్టా.. లైఫ్ అంతా మంచి సిటిజెన్‌గా ఉన్నా..

నా భార్యకు కేన్సర్ వచ్చింది. ఇన్సూరెన్స్ పోను 20 లక్షలు ఖర్చయింది. పొదుపు చేసిందంతా పోయింది. పాతికేళ్ల కష్టం రోగం పాలైంది. ఇంటి ఈఎంఐలు ఆగిపోయాయి. పిల్లల చదువులు గందరగోళంలో పడ్డాయి.

... ఇప్పుడు చెప్పండి మీరు చెప్పే నీతులపై, ఈ ప్రభుత్వాలపై నాకు ఎందుకు గౌరవం ఉండాలి? నాకు ఏం రక్షణ ఉందని నమ్మాలి. నా పిల్లల భవిష్యత్తుకు సొసైటీ, గవర్నమెంట్ ఉపయోగపడుతుందని విశ్వసించాలా? పిల్లల్ని నాలా ఒబీడియెంట్ సిటిజెన్‌లా పెంచమంటారా?''

– జీవితంపైనా.. ప్రభుత్వంపైనా సంపూర్ణంగా ఆశలు పోయిన సందర్భం ఇది

ఇదీ ప్రయారిటీ..

132వ స్థానంలో ఉన్న మనం ఇలా ఉంటే.. కొద్ది సంవత్సరాలుగా 'సామాజికాభివృద్ధి సూచీ'లో అందరి కన్నా ముందు ఉంటున్న నార్వే ఎలా ఉందో చూద్దాం..

- చమురు, సహజ వాయువు నిక్షేపాలు నార్వేకు ప్రధాన ఆదాయ వనరు. అయితే ఇలా వచ్చిన డబ్బును ఆ దేశం ప్రజాపనులు, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తుంటుంది. నార్వే అద్భుతమైన ఆరోగ్య రంగాన్ని రూపొందించుకుంది. ఎంతలా అంటే.. ఆ దేశంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే ఆరోగ్య బీమా కల్పిస్తుంది. అన్నిరకాల వైద్యం ఉచితంగా అందిస్తుంది.
- ప్రపంచంలో అత్యంత పరిశుభ్రమైన గాలి, నీరు లభించే ప్రాంతాల్లో ఒకటిగా నార్వే పేరు పొందింది. ప్రపంచంలో అతి ఎక్కువగా ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుపోయేది ఆ దేశంలోనే.. కాలుష్య రహిత వాతావరణం, మంచి వైద్య సదుపాయాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మంచి ఆదాయం అన్నీ ఉన్న నార్వే ప్రజల ఆయుష్షు కూడా ఎక్కువే. అక్కడివారి సగటు జీవితకాలం 82.3 ఏళ్లు.
- అక్కడి ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదువు పూర్తిగా ఉచితం. విదేశీ విద్యార్థులకు కూడా ఫీజులు తీసుకోరు. నార్వే ప్రభుత్వం ఆ దేశ జీడీపీలో 6.6శాతం విద్యా రంగంపైనే ఖర్చుపెడుతుంది .
- విద్య, వైద్యం కోసం తమ సంపాదన అంతా ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి లేకపోవడంతో ఆ దేశంలో ధనిక, పేద అంతరం మరీ ఎక్కువగా ఉండదు. ప్రతి కుటుంబం మెల్లగా ధనిక స్థాయికి ఎదిగే వాతావరణం ఉంటుంది. ఖర్చు విషయంలో వెనుకబాటు కారణంగా.. ఇప్పటితరం తమ తాతలు, తండ్రుల కంటే ఎక్కువగా విహార యాత్రలు చేయడం, ఎంజాయ్ చేయడం పెరిగింది
- నార్వేలో ఉద్యోగిత రేటు 74.4 శాతం. మిగతావారు స్వయం ఉపాధి రంగాల్లో ఉంటారు. అంటే నిరుద్యోగం అతి తక్కువ. అక్కడ టెలి కమ్యూనికేషన్స్, టెక్నాలజీ రంగాల్లో చాలా ఉద్యోగాలు ఖాళీగా ఉంటుంటాయి. డెన్మార్క్, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు కూడా నార్వే తరహాలో ఉద్యోగ, ఉపాధి కల్పనలో మెరుగ్గా ఉన్నాయి.
- శాంతి భద్రతల విషయంలో నార్వే ప్రజలు ఎంతో సంతృప్తితో ఉన్నామని చెప్తుంటారు. రాత్రిపూట ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లడానికి ఏమాత్రం భయం అనిపించదని 88 శాతం మంది చెప్పడం గమనార్హం. ఆ దేశంలో సంభవించే మొత్తం మరణాల్లో హత్యలు అరశాతం (0.5%) లోపే కావడం గమనార్హం. ఆ దేశంలోని జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సుమారు నాలుగు వేల మంది మాత్రమే.
- అక్కడి మహిళా ఉద్యోగులు గర్భం దాల్చితే.. పూర్తి జీతంతో కూడిన 8 నెలల (35 వారాలు) సెలవు (మెటర్నిటీ లీవ్) ఇస్తారు. లేదా 80 శాతం జీతంతో పది నెలలు (45 వారాలు) సెలవు తీసుకోవచ్చు. అవసరమైతే తండ్రులు కూడా పెటర్నిటీ లీవ్ తీసుకునే అవకాశం ఉంటుంది. పిల్లలు పుట్టిన మూడేళ్లలోపు 12 వారాల పాటు వేతనంతో కూడిన సెలవు ఇస్తారు.

ఇదీ రియాలిటీ



ఇదేం చారిటీ ..!

ఈ మధ్య ఓ రేషన్‌షాప్ ముందు స్టాండప్ కామెడీ సీన్ ఒకటి జరిగింది. సాక్షాత్తూ దేశ ఆర్థిక మంత్రి పేదవారికి ఇచ్చే కిలో బియ్యంలో కేంద్రం, రాష్ట్రవాటాల లెక్కలేశారు. పేదవారికి పెడుతున్న తిండిలో తమ వాటా 28 రూపాయలనీ, రాష్ట్రం వాటా 4 రూపాయలనీ, ప్రజల వాటా ఒక్క రూపాయనీ తేల్చారు. తమ వాటా ఇంత ఉండగా ప్రధాని మోదీ ఫొటో ఏదని నిలదీశారు...

"..ఓ దేశం పేదరికాన్ని దాటడమనేది 'చారిటీ' కాదు. సహజ న్యాయంగా జరగాలి" అన్న నెల్సన్ మండేలా మాట ఆ సమయంలో గుర్తుకొచ్చి ఉంటే బాగుండేది.

సహజన్యాయం జరిగితే...

నేతలు తమ ఫొటోలను రేషన్ షాపుల్లో వెతుక్కోనక్కర్లేదు. అందరి ఇళ్లలో, గుండెల్లో అవి కనిపిస్తాయి.

సామాజికాభివృద్ధి సూచీ దానికదే పరుగులు పెడుతుంది.

జీవహింస

'**జీ**వో జీవస్య జీవనమ్' అనగా ఒక జీవి మరొక జీవిని చంపడం జంతు ప్రవృత్తియని భాగవతం చెప్పింది. ఒక జీవిని వధించడం, బాధపెట్టడం అంటే జీవహింస చెయ్యడమే. అన్ని ప్రాణుల్నీ సమానంగా చూడడమే అహింస. నిత్యజీవితంలో ఎన్నో రకాలైన హింస చేస్తారు మానవులు. మానసిక (పరహాని తలపెట్టడం, పాపభీతి లోపించడం), వాచిక (అసత్య భాషణం, కఠిన వాక్కులు), కాయిక (జీవ వధ, పరపీడనం)లను హింసగానే గుర్తించాలి.

జ్యోతిర్మయం

వినోదం కోసం వేటాడటం రాజుల వ్యసనం. ప్రజల ప్రాణాలను హరించే మృగాలను వేటాడి ప్రజారక్షణకు నిలువడం రాజుల కర్తవ్యం. అంతవరకు ఫరవాలేదు. సరదాల కోసం మూగజీవులను చంపడం ఘోర పాపమే. అలాంటి పాపానికి ఒడిగట్టిన వారికి తగిన శిక్షలు పడిన ఘట్టాలను రామాయణ, భారతాల్లో చదువుతాము. నీరు తాగుతున్న ఏనుగుగా భ్రమించి మునిపుత్రుడైన శ్రావణుడిని శబ్దభేది విద్యతో హతమార్చాడు దశరథుడు. అది తెలుసుకున్న శ్రావణుడి తల్లిదండ్రులు దశరథుడికి పుత్రశోకంతో మరణించేలా శాపమిచ్చారు. ఆ శాపం అనుభవించాడు దశరథుడు. దాంపత్య సుఖం అనుభవిస్తున్న జింక రూపంలోని ముని దంపతులను బాణంతో కొట్టాడు పాండురాజు. వారి శాపం కారణంగానే పాండురాజు మరణించాడు. దయా గుణంతో ప్రవర్తించడం వల్లనే జీవహింసకు దూరంగా బతకవచ్చు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

క్లుప్తంగా

'మొగిలిగుండాల'కు బూచేపల్లి సుబ్బారెడ్డి పేరు



మొగలిగుండాల మినీ రిజర్వాయర్

సాక్షి, అమరావతి/చీమకుర్తి: ప్రకాశం జిల్లాలోని మొగిలిగుండాల మినీ రిజర్వాయర్ పేరును బూచేపల్లి సుబ్బారెడ్డి మొగిలిగుండాల మినీ రిజర్వాయర్‌గా ప్రభుత్వం నామకరణం చేసింది. ఈ మినీ రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి పేరు పెడతామని సీఎం వైఎస్ జగన్ ఇటీవల హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తూ ఆ రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి మొగిలిగుండాల రిజర్వాయర్‌గా నామకరణం చేస్తూ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

గత ప్రభుత్వ తప్పుడు ఏసీబీ కేసుల పరిశీలనకు కమిటీ

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం 2014–19 కాలంలో ప్రభుత్వ ఉద్యోగులను వేధించేందుకు ఏసీబీ కేసులు పెట్టిందన్న ఉద్యోగసంఘాల ఫిర్యాదుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గత ప్రభుత్వ కాలంలో ఉద్దేశపూర్వకంగా నమోదుచేసిన కేసులను (ట్రాప్ మినహా) గుర్తించి వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, జీఏడీ (సేవలు) ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, సంబంధితశాఖ కార్యదర్శితో కమిటీ ఏర్పాటు చేశారు. జీఏడీ ముఖ్యకార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. విజయవాడకు చెందిన ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ 2014–19 మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఏసీబీ కేసులు బనాయించిందని, దీనిపై న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై శాసనమండలిలో సభ్యుల ప్రశ్నకు ప్రభుత్వం సమాధానమిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఏసీబీ కేసులను పరిశీలించి ఆయా విభాగాలు ఒక నిర్ణయానికి రావాలని ఆ ఉత్తర్వుల్లో కోరింది.

రోడ్డు ప్రమాదంలో సీనియర్ జర్నలిస్ట్ గోపాల్‌రెడ్డి దుర్మరణం



సాక్షి,అమరావతి/ తిరుమల: రాయల సీమాంధ్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్, తిరుపతి పట్టణానికి చెందిన మబ్బు గోపాల్‌రెడ్డి(75) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను కవర్ చేసేందుకు తిరుమల వచ్చిన గోపాల్‌రెడ్డి బుధవారం రాత్రి బైక్‌పై తిరిగి తిరుపతికి వెళుతుండగా మొదటి ఘాట్ రోడ్డులోని 12వ మలుపు వద్ద కిందపడి రక్షణ గోడను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయనను తిరుపతిలోని ప్రభుత్వ రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. పలు ప్రముఖ దిన పత్రికల్లో పనిచేసిన గోపాల్‌రెడ్డి.. ప్రస్తుతం యూట్యూబ్ చానల్ నడుపుతున్నారు.ఆయన మృతి పట్ల టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

సంతాపం తెలిపిన సజ్జల

సీనియర్ జర్నలిస్ట్ మబ్బు గోపాలరెడ్డి మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గోపాలరెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

రైల్వే ప్లాట్‌ఫాం టికెట్ ధర రూ.30కి పెంపు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దసరా సీజన్‌లో విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో పాటు ఇతరుల రద్దీ పెరగటంతో దాన్ని తగ్గించేందుకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ స్టేషన్‌లో తాత్కాలికంగా ప్లాట్‌ఫాం టికెట్ ధరను రైల్వే శాఖ పెంచింది. ఇప్పటి వరకు రూ.10 ఉండే ప్లాట్‌ఫాం టికెట్ ధర రూ.30కి పెంచింది. పెరిగిన ధర ఈ నెల 30న అర్ధ రాత్రి 12 గంటల నుంచి అక్టోబర్ 9 వరకు అమల్లో ఉంటుంది.

ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ముంబై ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఐసీయూ నుంచి సాధారణ వైద్యానికి స్పెషల్ రూమ్‌కు గురువారం సాయంత్రం మార్చారు. ఈ విషయాన్ని ముంబై నుంచి మంత్రి కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు.

ప్రతిభకు ప్రతి'రూప'ం

వైఎస్సార్ జిల్లా యువతికి అరుదైన అవకాశం

- అక్టోబర్ 2న పార్లమెంట్‌లో ప్రసంగించే చాన్స్
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొనే ఏకైక యువతి మిద్దె రూప



కళాశాలలో మెరిట్ సర్టిఫికెట్ అందుకుంటున్న మిద్దె రూప

వైవీయూ :ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది కడపకు చెందిన యువతి మిద్దె రూప. ఆర్థిక ఇబ్బందులు వెక్కిరిస్తున్నా.. అధ్యాపకుల తోడ్పాటుతో అన్ని రంగాల్లో రాణిస్తూ సత్తా చాటుతున్న ఆమెకు అరుదైన అవకాశం దక్కింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని అక్టోబర్ రెండో తేదీన పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన చాన్స్ పొందింది. దేశవ్యాప్తంగా 15 మంది యువతీ యువకులను పార్లమెంట్‌లో ప్రసంగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగా, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కడప జిల్లాకు చెందిన మిద్దె రూప ఒక్కరే ఉండటం విశేషం. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురానికి చెందిన మిద్దె సత్యనారాయణ (లారీ డ్రైవర్), రమాదేవి (గృహిణి) దంపతుల కుమార్తె మిద్దె రూప కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ టూరిజం కోర్సును ఇటీవల పూర్తి చేసింది. అధ్యాపకులు, ప్రిన్సిపాల్ తోడ్పాటుతో రూప చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ పోటీ ఏదైనా విజేతగా నిలుస్తూ వచ్చింది. ప్రస్తుతం ఆమె దాతల సహకారంతో హైదరాబాద్‌లోని ఓ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు సన్నద్ధం అవుతోంది.



మిద్దె రూప

ప్రభుత్వ కళాశాల నుంచి పార్లమెంట్ వరకు...

అక్టోబర్ రెండో తేదీన పార్లమెంట్‌లో ప్రసంగించే విద్యార్థులు, యువతీ యువకులను ఎంపిక చేసేందుకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న తొలుత జిల్లాస్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 30 మందిని ఎంపిక చేయగా, వీరిలో రూప అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన నలుగురిలో ఒకరిగా నిలిచింది. అనంతరం జాతీయ స్థాయిలో 35 మంది పోటీపడ్డారు. చివరగా టాప్–15 అభ్యర్థులను పార్లమెంట్‌లో ప్రసంగించేందుకు ఎంపిక చేశారు. ఈ 15 మంది జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని మిద్దె రూప కావడం విశేషం. రూప పార్లమెంట్‌లో అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ గురించి ఇంగ్లిష్‌లో ప్రసంగించనుంది. కడప విద్యార్థినికి పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం లభించడంపై నెహ్రూ యువకేంద్రం జిల్లా సమన్వయకర్త మణికంఠ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుబ్బలక్షుమ్మ, చరిత్ర అధ్యాపకుడు బాలగొండ గంగాధర్ తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

ఆ ముట్టడిలో మేం పాల్గొనం

ఏపీ స్టేట్ వర్క్ ఆర్ట్ పీఈటీ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

సాక్షి అమరావతి : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పార్ట్ టైం ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ పేరుతో శుక్రవారం తలపెట్టిన సమగ్ర శిక్ష ఎస్పీడీ ఆఫీస్ ముట్టడితో.. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఆర్ట్ క్రాఫ్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని ఏపీ స్టేట్ వర్క్ ఆర్ట్ పీఈటీ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు ఈ ముట్టడిలో పాల్గొనొద్దని రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.శంకరరావు పిలుపునిచ్చారు.

ఎస్ఎస్ఏ ముట్టడితో మాకు సంబంధం లేదు : కేజీబీవీ టీచర్స్ యూనియన్

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) శుక్రవారం తలపెట్టిన చలో ఎస్పీడీ ఆఫీస్ ముట్టడిలో తాము పాల్గొనడం లేదని కేజీబీవీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బీటీఎస్ దేవి, ప్రధాన కార్యదర్శి మాలినీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ కాంట్రాక్టు టీచర్స్‌కు ఇచ్చిన ఎంటీఎస్ జీవో అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి కేజీబీవీ టీచర్స్‌కు ఎంటీఎస్ ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపడుతున్న ధర్నాకు కేజీబీవీ టీచర్స్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.

ఇండో పసిఫిక్ భద్రతపై ఆస్ట్రేలియాతో కలిసి అడుగులు

చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ హరికుమార్

సాక్షి, విశాఖపట్నం : ఇండో పసిఫిక్ సముద్ర భద్రత, సవాళ్లపై ఆస్ట్రేలియాతో కలిసి అడుగులు వేస్తున్నామని తూర్పు నౌకాదళ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ హరికుమార్ వెల్లడించారు. సీఎన్ఎస్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆస్ట్రేలియాలో మూడు రోజులు అధికారికంగా పర్యటించారు. రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ మార్క్ హమ్మండ్, ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్సెస్ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ డేవిడ్ జాన్సన్‌తోపాటు రక్షణ శాఖకు చెందిన పలువురు ముఖ్య అధికారులతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక ఒప్పందాలు, పరస్పర సహకారానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. సాగర జలాల్లో ఉన్న కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన చర్యలపై ఆస్ట్రేలియా అధికారులతో సమీక్షించారు. ఆస్ట్రేలియా పర్యటన ముగించుకుని గురువారం విశాఖపట్నం చేరుకున్న రియర్ అడ్మిరల్ హరికుమార్ సముద్ర పర్యావరణం, హిందూ మహాసముద్రం, ఇండో పసిఫిక్ తీరంలో ఆధిపత్యం, ఇతర అంశాలపై కేంద్రీకృత ప్రయత్నాలను పెంచాల్సిన అవసరాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయని తూర్పు నౌకాదళ వర్గాలు పేర్కొన్నాయి.



రియర్ అడ్మిరల్ హరికుమార్‌కు జ్ఞాపికను ఇస్తున్న ఆస్ట్రేలియన్ నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ హమ్మండ్

దసరాకు 1,072 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలే వర్తింపు
- ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): దసరా సెలవుల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ ఆర్టీసీ ఎన్టీఆర్ జిల్లా నుంచి వివిధ దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఏసుదానం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, విద్యార్థుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రాంతాలకు 1,072 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు చెప్పారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 10 వరకు ఈ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, సాధారణ చార్జీలే అమలవుతాయని తెలిపారు. అక్టోబర్ ఒకటి, రెండు తేదీల్లో 40 బస్సులను పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి రాయలసీమ ప్రాంతాలైన రాయదుర్గం, కదిరి, అనంతపురం, పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు, కడప, జమ్మలమడుగు, కర్నూలు, నంద్యాల గుంతకల్ ప్రాంతాలకు, విజయవాడ నుంచి విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, తిరుపతి, భద్రాచలానికి ఈ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి విజయవాడకు వచ్చే బస్సులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకూ ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్టు ఏసుదానం వెల్లడించారు.

మొగల్తూరులో కృష్ణంరాజు స్మృతివనం

- ప్రభాస్, కుటుంబ సభ్యులకు రాష్ట్ర మంత్రుల పరామర్శ
- మొగల్తూరులో కృష్ణంరాజు సంస్మరణ కార్యక్రమం

మొగల్తూరు: కేంద్ర మాజీ మంత్రి, 'రెబల్ స్టార్' కృష్ణంరాజు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర మంత్రులు ఆర్‌కే రోజా, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో గురువారం నిర్వహించిన కృష్ణంరాజు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న వీరు... కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి, వారి కుమార్తెలు, హీరో ప్రభాస్‌ను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కృష్ణంరాజు స్మారకార్థం ప్రభుత్వం స్మృతివనం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని వివరించారు. అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మొగల్తూరు తీరంలో రెండు ఎకరాల్లో కృష్ణంరాజు స్మృతివనం, కాంస్య విగ్రహం, మ్యూజియం, పార్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. కృష్ణంరాజు సంస్మరణ కార్యక్రమం సందర్భంగా హీరో ప్రభాస్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు.



ప్రభాస్, కృష్ణంరాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రోజా, వేణుగోపాలకృష్ణ, కారుమూరి, ముదునూరి, శ్రీనివాస్

పురాతన కట్టడాలను దత్తత తీసుకోవాలి

హోటల్ యజమానుల సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని ప్రఖ్యాత హోటళ్లు, ఆతిథ్యరంగంలోని ప్రముఖులు ఒక్కో చారిత్రక, ప్రాచీన కట్టడాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశీయ పర్యాటకాభివృద్ధికి విస్తృతమైన అవకాశాలున్నాయని పేర్కొన్నారు. భారత పురాతత్వ విభాగం పరిధిలోని 3,600పైగా ప్రాచీన వారసత్వ కట్టడాలున్నాయని తెలిపారు. పర్యాటక కేంద్రాలను దత్తత తీసుకోవడం ద్వారా ఆయా హోటళ్లకు ప్రచారం కూడా లభిస్తుందన్నారు. గురువారం ఢిల్లీలో 5వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ హోటలియర్స్ కాంక్లేవ్‌లో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం అన్నిరకాలుగా ప్రయత్నిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు, పర్యాటక, ఆతిథ్య రంగంతో అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేటుసంస్థలు కలిసి వచ్చినప్పుడే ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు.



అన్ని ఫ్యాక్టరీలకూ చంద్రబాబు హయాంలోనే శంకుస్థాపనలా?

- అలా రాసుకోవడం వల్ల ఎల్లో మీడియాకేంటి ప్రయోజనం?
- వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: నవ్యాంధ్రప్రదేశ్‌లో అన్ని పరిశ్రమల శంకుస్థాపనలు, అంతకు ముందు వాటికి భూసేకరణలు, కేటాయింపులు, అన్ని రకాల అనుమతులు వంటి పనులన్నీ చంద్రబాబు హయాంలోనే జరిగాయని టీడీపీ అనుకూల పత్రికలు రాసుకోవడం వల్ల ఏం ప్రయోజనమంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి నిలదీశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బాబు చివరి పాలనా కాలం 2014 – 2019 లోనే అన్ని జరిగిపోయాయి అని రాశారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత మూడున్నరేళ్లుగా ఏపీలో ఏ మూలన ఏ ఫ్యాక్టరీ లేదా పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభ కార్యక్రమానికి హాజరైనా వెంటనే తప్పుడు కథనాలను సంధిస్తాయని, బాబు ఆధ్వర్యంలో అప్పుడు జరిగిన 'నిర్మాణాత్మక' శంకుస్థాపన కార్యక్రమాలను పాఠకులకు గుర్తుచేస్తాయని తెలిపారు. ఈ తంతు ఎల్లో మీడియాకు ఒక ఆనవాయితీగా మారిపోయిందని తెలిపారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వటాలలో ఏర్పాటైన రామ్ కో సిమెంట్స్ కర్మాగారాన్ని బుధవారం బజర్ నొక్కి సీఎం జగన్ ప్రారంభించారని, ఈ వార్తతో పాటే చంద్రబాబు కీర్తి కిరీటాన్ని చంద్ర మండలం దాకా తీసుకెళ్లే ప్రయత్నం చేసేలా.. ఓ కథనాన్ని ఆ పత్రికలు ప్రచురించాయని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ కర్మాగారం శంకుస్థాపన టీడీపీ హయాంలోనే జరిగిందని పెద్ద పరిశోధన చేసి వెలుగులోకి తెచ్చామనే రీతిలో రెచ్చిపోయి రాశాయని ఎద్దేవా చేశారు. ఒక రాష్ట్రంలో ఐదేళ్ల పదవీ కాలానికి ఎన్నికైన రాజకీయ పక్షం పాలనా కాలంలో అనేక కంపెనీలు ప్లాంట్లు పెట్టేందుకు శ్రీకారం చుట్టడం సర్వసాధారణమని, ఈ లోగా ఎన్నికలొచ్చి పాలకపక్షం మారితే.. కొత్త పాలక పార్టీ హయాంలో ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడం కూడా మామూలు వ్యవహారమేనని తెలిపారు. 2019 మే 30 నుంచి వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా అనేక కంపెనీల్లో ఉత్పత్తి మొదలైందని, ప్రారంభ కార్యక్రమాలు సీఎం చేతుల మీదుగా జరిగాయని తెలిపారు. ఈ సాధారణ పారిశ్రామిక ప్రక్రియను ఈ పత్రికలు రెండు దశలుగా విభజించి, చంద్రబాబు హయాంలో శంకుస్థాపన, సీఎం జగన్ హయాంలో ప్రారంభం అంటూ పాఠకులకు కొత్త పాఠాలు చెబుతూ.. నవ్వుల పాలవుతున్నాయని ఎద్దేవా చేశారు.

చంద్రబాబుకి కుప్పంలోనే దిక్కులేదు

- భవిష్యత్తులో టీడీపీ అడ్రస్ ఉండదు
- మత్స్యకారుల ఆత్మీయసదస్సులో మంత్రి దాడిశెట్టి రాజా



మత్స్యకారుల ఆత్మీయసభలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: దీర్ఘకాలంగా ఓట్లేసి గెలిపించి రాష్ట్రస్థాయి పదవులను అనుభవించేందుకు అవకాశం ఇచ్చిన కుప్పం నియోజకవర్గాన్ని పట్టించుకోని చంద్రబాబుకు అక్కడే దిక్కులేదని, రాబోయే రోజుల్లో టీడీపీకి అడ్రస్ కూడా ఉండదని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చెప్పారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమాళ్లపురం పంచాయతీలోని కొత్తపోడిపల్లిపేటలో గురువారం జరిగిన మత్స్యకారుల ఆత్మీయసదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కుప్పం ప్రజల్ని వాడుకుని వదిలేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలను సమానంగా చూస్తూనే కుప్పం నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేయడంతో అక్కడ ఇప్పుడు చంద్రబాబుకే దిక్కులేదని చెప్పారు. రాష్ట్రంలో 87 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మత్స్యకారులకు మత్స్యకార భరోసా ద్వారా రూ.పదివేలు, స్మార్ట్‌కార్డుల ద్వారా డీజిల్ లీటరుకు రూ.9 తక్షణ రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కోన ప్రాంత మత్స్యకారులకు ఎటువంటి కష్టం రాకుండా తాను అండగా ఉంటానన్నారు. మినీ పోర్టు, బల్క్‌డ్రగ్ పార్క్‌లతో కోన ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధి కారణంగా హేచరీలకు, మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది కలగనీయబోమని సీఎం ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది మత్స్యకారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువా కప్పారు. ఈ సదస్సులో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలతాహరి, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొయ్యా మురళి, మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యు.కొత్తపల్లి మండలం ఎంపీపీ కారే శ్రీనివాసరావు, ఏలేరు రిజర్వాయర్ చైర్మన్ తోలాడ శైలాపార్వతి, పార్టీ నాయకులు గాబు రాజు, గంగిరి అడివియ్య, బద్ది నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా పరిశ్రమకు కొత్త ఊపు

రూ.146.97 కోట్లతో 23 ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లు

- రూ.400 కోట్లతో 10 ప్రాసెసింగ్ యూనిట్లు
- గిట్టుబాటు ధర కల్పన, సాగు విస్తీర్ణం రెట్టింపు లక్ష్యం
- ఆక్వా రైతుసంఘాలస్థానే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం
- నిబంధనలు సడలించిన ప్రభుత్వం.. మార్చి కల్లా గ్రౌండింగ్



సాక్షి, అమరావతి: రానున్న ఐదేళ్లలో ఆక్వా సాగు విస్తీర్ణంతో పాటు ఉత్పత్తిని రెట్టింపుచేసే లక్ష్యంతో ఏర్పాటు చేయతలపెట్టిన ప్రాసెసింగ్, ప్రీ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ప్రభుత్వం నిబంధనలను సడలించింది. సొసైటీల స్థానంలో లిమిటెడ్ లయబులిటీ పార్టనర్‌షిప్ (ఎల్ఎల్‌పీ) గ్రూపులకు ఇవ్వాలని సంకల్పించింది. ఆక్వారంగం బలోపేతం కోసం విస్తృతస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రాసెసింగ్, ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 4,813 టన్నుల సామర్థ్యంతో 92 ప్రాసెసింగ్, 300 టన్నుల సామర్థ్యంతో 30 ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఏటా విస్తరిస్తున్న ఆక్వా సాగుతో పాటు పెరుగుతున్న ఆక్వా ఉత్పత్తులను పూర్తిస్థాయిలో ప్రాసెస్ చేసే సామర్థ్యం వీటికి లేకపోవడంతో మూడోవంతు ఉత్పత్తులను పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఫలితంగా రైతులు, వ్యాపారులు 10–20 శాతం మేర ఉత్పత్తి నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. దీనికితోడు సీజన్ మొదలుకాగానే అంతర్జాతీయ మార్కెట్‌ను బూచిగా చూపి ధరలను తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు మరింత నష్టపోతున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ఆక్వాసాగు ఎక్కువగా ఉన్న తీర ప్రాంత జిల్లాల్లో ఒక్కొక్కటి రూ.40 కోట్లతో 10 ప్రాసెసింగ్, ఒక్కొక్కటి రూ.6.39 కోట్లతో 23 ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తంలో 20 శాతాన్ని ప్రభుత్వం సబ్సిడీగా భరించనుంది. రెండువేల టన్నుల సామర్థ్యంతో రూ.546.97 కోట్లతో ఏర్పాటుచేస్తున్న వీటి ద్వారా సుమారు 10 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. వీటి నిర్వహణ బాధ్యతలను తొలుత మత్స్యకార, ఆక్వా ఫార్మర్స్ సొసైటీలకు అప్పగించాలని నిర్ణయించింది. నిబంధనలు కఠినతరంగా ఉండడంతో సొసైటీల నుంచి ఆశించినస్థాయిలో స్పందన రాలేదు. దీంతో నిబంధనలు సడలించాలని ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అత్యున్నతస్థాయి సమీక్షలో నిర్ణయించారు. సొసైటీల స్థానంలో లిమిటెడ్ లయబులిటీ పార్టనర్‌షిప్ (ఎల్ఎల్‌పీ) కింద ఇద్దరు ముగ్గురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కలిసి ముందుకొస్తే చాలు వారితో ఈ యూనిట్లు నెలకొల్పే విధంగా వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే నరసాపురం, బాపట్లలో ఒక్కొక్కటి చొప్పున ప్రాసెసింగ్, ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లు కార్యరూపం దాల్చగా, మిగిలిన వాటి కోసం వచ్చే నెలాఖరులోగా అర్హులను ఎంపికచేసి 2023 మార్చి కల్లా యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేసింది.

52.53 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీరప్రాంతముంది. 93,859 మంది రైతులు 56 వేల హెక్టార్లలో ఉప్పునీటి, 1.55 లక్షల హెక్టార్లలో మంచినీటి చెరువుల్లో ఆక్వా సాగుచేస్తున్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో 70 శాతం, చేపల్లో 30 శాతం మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. ఆక్వారంగ సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సాగువిస్తీర్ణాన్ని పెంచడంతోపాటు ఉత్పత్తిని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. ఆక్వాసాగును దశలవారీగా మరో 48,775 హెక్టార్లకు విస్తరించేదిశగా అడుగులు వేస్తున్నారు. గత మూడేళ్లలో వరుసగా.. 2019–20లో 41.75 లక్షల టన్నులు, 2020–21లో 46.23 లక్షల టన్నులు, 2021–22లో 48.13 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించారు. 2022–23లో 52.53 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 25 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదైంది.

నిబంధనలు సడలించాం

ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటుధర, రైతులకు అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ఆక్వా సాగవుతున్న జిల్లాల్లో ప్రాసెసింగ్, ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సొసైటీల స్థానంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అప్పగించేలా మార్గదర్శకాలు రూపొందించాం. మార్చికల్లా వీటిని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

– కె.కన్నబాబు, కమిషనర్, మత్స్యశాఖ

ఏఐతో సైబర్ సెక్యూరిటీకీ లాభాలు

సాక్షి, హైదరాబాద్: దేశాలకు కీలకమైన వ్యవస్థలను సైబర్ ప్రపంచంలో.. భౌతికంగానూ పరిరక్షించే విషయంలో కృత్రిమమేధ (ఏఐ) కీలకపాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యుత్ పంపిణీ మొదలుకొని కీలక వ్యవస్థలపై సైబర్ దాడులు జరిగే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని నైబల్ అనే సెక్యూరిటీ సంస్థ సీఈవో నూర్ అల్‌హసన్ వ్యాఖ్యానించారు. కామ్‌టెల్ నెట్‌వర్క్స్ ఏర్పాటు చేసిన ఒక వెబినార్‌లో ఆయన మాట్లాడుతూ చాలా సందర్భాల్లో సైబర్ దాడుల కంటే ముందు ఈ వ్యవస్థలపై భౌతికంగా దాడులు జరుగుతాయన్నారు. సైబర్, భౌతిక దాడులను ముందే గుర్తించేందుకు, ఎప్పటికప్పుడు నివారించేందుకు ఏఐ ఉపయోగపడుతుందని, ఈ క్రమంలో వందల కోట్ల డాలర్ల ధనాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా ఈ వ్యవస్థలు హ్యాకింగ్‌కు గురైతే వచ్చే ప్రమాదాలను కూడా నివారించవచ్చన్నారు. గతేడాది సైబర్ దాడుల వల్ల ఒక్కో కంపెనీ దాదాపు 40 లక్షల డాలర్ల విలువను కోల్పోయినట్లు ఐబీఎం లాంటి దిగ్గజ సంస్థలు తేల్చాయని క్రిటికల్ ఫ్యూచర్ సంస్థకు చెందిన ఆడమ్స్ రికోబోని పేర్కొన్నారు. రవాణా, స్టోరేజ్, కమ్యూనికేషన్ వ్యవస్థల్లో సైబర్ భద్రత ఒక శాతం మెరుగుపడినా అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 3600 కోట్ల డాలర్లు చేరుతుందన్నారు. కామ్‌టెల్ నెట్‌వర్క్స్ సీఎండీ శ్రీప్రకాశ్ పాండే మాట్లాడుతూ ఇంధన రంగంలో ఒక్కో సైబర్ దాడి విలువ దాదాపు 60 లక్షల డాలర్లని.. సెక్యూరిటీని పటిష్టం చేస్తే భారీ మొత్తాలను ఆదా చేయొచ్చని క్రిటికల్ ఫ్యూచర్ సిద్ధం చేసిన శ్వేతపత్రం చెబుతోందన్నారు.

క్లుప్తంగా...

పీటీఐ డైరెక్టర్‌గా ఆదిమూలం

వైస్ చైర్మన్‌గా కె.ఎస్.శాంత్‌కుమార్



ఆదిమూలం

న్యూఢిల్లీ: దినమలర్ పత్రిక పబ్లిషర్ ఎల్.ఆదిమూలం పీటీఐ వార్తా సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గురువారం జరిగిన పీటీఐ బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పీటీఐ వైస్ చైర్మన్ కె.ఎస్.శాంత్‌కుమార్ మరోసారి ఆ పదవికి ఎన్నికైనట్టు ప్రకటించింది. ఆదిమూలం ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ అధ్యక్షునిగా, ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) ప్రత్యేక ఆహ్వానితునిగా కూడా చేశారు. శాంత్‌కుమార్ గతంలో ఏబీసీ చైర్మన్‌గా పనిచేశారు.

ఐరాస భద్రతా మండలిని సంస్కరించాలి: జై శంకర్

వాషింగ్టన్: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించక తప్పదని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. అమెరికాలో ఇండియా మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. సంస్కరణలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మద్దతిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. వాటికి అడ్డుపడుతున్నదెవరో అందరికీ తెలుసని చైనాను ఉద్దేశించి అన్నారు.

డ్రగ్స్ ముఠాలపై సీబీఐ దాడులు, 175 మంది అరెస్ట్

న్యూఢిల్లీ: దేశంలోని పలు రాష్ట్రాల్లో సీబీఐ మాదకద్రవ్యాల ముఠాలపై దాడులు చేసింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), ఇంటర్‌పోల్, రాష్ట్రాల పోలీసు యంత్రాంగం సహకారంతో గురువారం పకడ్బందీగా దాడులు నిర్వహించింది. డ్రగ్స్ విక్రేతలుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 175 మందిని అరెస్ట్ చేసింది. అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్న వారి పని పట్టడానికి ఆపరేషన్ గరుడ పేరుతో సీబీఐ ఈ దాడులు నిర్వహిస్తోంది. పంజాబ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మహారాష్ట్రాలలో మాదకద్రవ్యాల అక్రమ సరఫరా చేస్తున్న 6,600 అనుమానితుల్ని సీబీఐ గుర్తించింది. వారిలో 175 మందిని అరెస్ట్ చేసి, 127 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు సీబీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది.

పీఎస్‌యూల్లో ఎస్సీ పోస్టుల భర్తీకి 2 నుంచి ప్రత్యేక డ్రైవ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌యూ)ల్లో షెడ్యూల్డ్ కులాలకు రిజర్వయిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి అక్టోబర్ 2 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ విజయ్ సంప్లా తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ: గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఎలక్టోరల్ బాండ్లను విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. అక్టోబర్ 1–10 తేదీల మధ్య 22వ విడత బాండ్లను దేశవ్యాప్తంగా 29 అధీకృత కేంద్రాల్లో విక్రయించేందుకు ఆర్‌బీఐకి అనుమతి ఇచ్చినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. జారీ అయిన నాటి నుంచి 15 రోజులపాటు ఇవి చెల్లుబాటు అవుతాయి. పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకతను సాధించేందుకు నగదుకు ప్రత్యామ్నాయంగా కేంద్రం 2018 నుంచి ఆర్‌బీఐ ద్వారా బాండ్ల విక్రయాన్ని ప్రారంభించడం తెలిసిందే.

పిల్లలకు అన్నం, ఉప్పు

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలోని ఒక పాఠశాలలో పిల్లలకి మధ్యాహ్నం భోజనం కింద అన్నంలోకి కేవలం ఉప్పు వడ్డించారు! విద్యార్థులు అన్నంలో ఉప్పు వేసుకొని తింటున్న వీడియో వైరల్‌గా మారింది. అయోధ్యలో కోట్ల రూపాయల ఖర్చుతో రామ మందిరం నిర్మిస్తున్న పాలకులు పిల్లలకు కడుపునిండా తిండి పెట్టలేరా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్కూలు ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు విచారణకు ఆదేశించారు.

ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలు రష్యాలో విలీనం

కీవ్: ఇటీవల రెఫరెండం చేపట్టిన ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను తాము కలిపేసుకుంటామని రష్యా గురువారం ప్రకటించింది. ఈ రెఫరెండంలో దక్షిణ, తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలైన జపొరిఝియాలో 93%, ఖేర్సన్‌లో 87%, లుహాన్స్క్‌లో 98%, డొనెట్స్క్‌లో 99% మంది రష్యాకు అనుకూలంగా ఓటేశారని క్రెమ్లిన్ అనుకూల పరిపాలనాధికారులు మంగళవారం ప్రకటించారు. శుక్రవారం క్రెమ్లిన్ కోటలోని సెయింట్ జార్జి హాల్‌లో జరిగే కార్యక్రమంలో విలీనం విషయాన్ని అధ్యక్షుడు పుతిన్ స్వయంగా ప్రకటిస్తారని అధికార ప్రతినిధి పెష్కోవ్ చెప్పారు. విలీనానికి సంబంధించిన పత్రంపై ఈ నాలుగు ప్రాంతాల అధికారులు సంతకాలు చేస్తారన్నారు. రష్యా చర్యను ఉక్రెయిన్, అమెరికా, జర్మనీ ఇతర పశ్చిమ దేశాలు ఖండించాయి. రష్యా చేపట్టిన రెఫరెండంను, విలీనం చేసుకోవడాన్ని గుర్తించబోమన్నాయి. ఈ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఉక్రెయిన్ ప్రతిజ్ఞ చేసింది. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లో డ్నీప్రో ప్రాంతంపై రష్యా జరిపిన రాకెట్ దాడిలో చిన్నారి సహా 8 మంది చనిపోయినట్లు అధికారులు చెప్పారు. ఈశాన్య ప్రాంత లెమాన్ నగరంపై పట్టు కోసం ఉక్రెయిన్, రష్యా బలగాల మధ్య భీకర పోరు సాగుతోందని బ్రిటిష్ నిఘా వర్గాలు వెల్లడించాయి.

అమెరికాలో హరికేన్ బీభత్సం

- ఫ్లోరిడాలో కుండపోత వానలు
- కరెంటు లేక 25 లక్షలమందికి ఇక్కట్లు



తుపాను ధాటికి ఫ్లోరిడా రాష్ట్రంలోని ఫోర్ట్ మేయర్స్ సిటీ తీరంలో ధ్వంసమైన పడవలు

సెయింట్ పీటర్స్‌బర్గ్: అమెరికాలో ఇయన్ హరికేన్ ప్రతాపానికి ఫ్లోరిడా విలవిలలాడుతోంది. నైరుతి ఫ్లోరిడాలో హరికేన్ విధ్వంసం సృష్టిస్తోంది. గంటకి 241 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు నీట మునిగిపోయాయి. వీధుల్లోకి షార్క్‌లు కొట్టుకొస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోతున్నాయి. వంతెనలు కొట్టుకుపోతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వానలతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 25 లక్షల మంది కరెంట్ లేక తీవ్రమైన కష్టాలు పడుతున్నారు. అమెరికా చరిత్రలో అత్యంత ప్రమాదకరమైన హరికేన్ ఇదేనని నేషనల్ హరికేన్ సెంటర్ వెల్లడించింది. టాంపా, ఒర్లాండో విమానాశ్రయాల్లో విమానాల రాకపోకల్ని నిలిపివేశారు. వందల సంఖ్యలో మృతులు ఫ్లోరిడా కౌంటీ అధికారి ఒకరు అనుమానం వ్యక్తం చేశారు. సహాయం కోసం తమకు ఆగకుండా ఫోన్ కాల్స్ వస్తున్నాయని చెప్పారు. అయితే కొన్ని కౌంటీలలోకి వెళ్లడానికి వీల్లేని పరిస్థితులున్నాయని తెలిపారు. ఇళ్లల్లోకి అయిదు అడుగుల మేరకు నీరు వచ్చి చేరినట్టుగా సమాచారం అందుతోందని చెబుతున్నారు. ఎటు చూసినా విధ్వంసమే కనిపిస్తోంది. హరికేన్ వార్తల్ని కవర్ చేస్తున్న విలేకరులు పెనుగాలల ధాటికి నిలువలేక ఒరిగిపోతున్న దృశ్యాలు కలవరపెడుతున్నాయి. విద్యుత్ లేకపోవడం, సెల్ టవర్లు పనిచెయ్యకపోతూ ఉండడంతో సహాయ చర్యలు అందించడం కత్తి మీద సాములా మారింది. జాతీయ రక్షణ సిబ్బంది దాదాపుగా 5 వేల మందిని సహాయం కోసం ఫ్లోరిడా పంపినట్టుగా రక్షణ శాఖ వెల్లడించింది. హరికేన్ విధ్వంసం సృష్టించే ప్రాంతాల్ని తిరిగి పునర్నిర్మిస్తామని అధ్యక్షుడు జో బైడెన్ హామీ ఇచ్చారు.

ఏడేళ్లు నివాసముంటే గ్రీన్‌కార్డు!

- అమెరికా సెనేట్లో డెమోక్రాట్ల బిల్లు
- 80 లక్షల మందికి ప్రయోజనం



వాషింగ్టన్: అమెరికాలో ఉంటూ ఏళ్ల తరబడి గ్రీన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న 80 లక్షల మందికి శుభవార్త ఇది. వీరికి శాశ్వత నివాస హోదా కల్పించే కార్డును మంజూరు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును డెమోక్రాటిక్ పార్టీకి చెందిన నలుగురు సభ్యుల బృందం సెనేట్‌లో ప్రవేశపెట్టింది. ఇమిగ్రేషన్ చట్టంలోని కొన్ని నిబంధనలను సవరిస్తూ సెనేటర్లు అలెక్స్ పడిల్లా, ఎలిజబెత్ వారెన్, బెన్ రే లుజాన్, సెనేట్ మెజారిటీ విప్ డిక్ డర్బన్ బుధవారం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీని ప్రకారం.. అమెరికాలో వరుసగా కనీసం ఏడేళ్లపాటు నివాసం ఉన్న వలసదారు చట్టబద్ధమైన శాశ్వత నివాస అర్హత పొందవచ్చు. 'గతంలో సవరించిన ఇమిగ్రేషన్ విధానం ఎందరికో ఇబ్బందికరంగా మారింది. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది. మా బిల్లులో గత 35 ఏళ్లలోనే మొదటిసారిగా రిజిస్ట్రీ కటాఫ్ తేదీని సవరించాం. దీనితో మరింతమంది వలసదారులు చట్టబద్ధ శాశ్వత నివాస హోదా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు'అని సెనేటర్ పడిల్లా చెప్పారు. 'దశాబ్దాలుగా ఇక్కడే నివాసం ఉండి పనులు చేసుకుంటూ అభివృద్ధిలో తమ వంతు తోడ్పాటునందిస్తున్న లక్షలాది మంది వలసదారులు అనిశ్చితితో భయపడాల్సిన అవసరం లేకుండా ఇకపై స్వేచ్ఛగా జీవించవచ్చు'అని ఆయన అన్నారు. ''ఈ బిల్లు కార్యరూపం దాలిస్తే డ్రీమర్లు, లాంగ్ టర్మ్ వీసాదారుల సంతానం, అత్యవసర సిబ్బంది, హెచ్–1బీ వీసాలు కలిగిన అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగులు తదితర 80 లక్షల మందికి ప్రయోజనం ఉంటుంది'' అని వలసదారుల తరఫున పనిచేసే ఎఫ్‌డబ్ల్యూడీ డాట్ యుఎస్ అంచనావేసింది. 'చట్టపరమైన అడ్డంకి వల్ల వలసదారులు గ్రీన్‌కార్డుకు నోచుకోలేకపోతున్నారని హౌస్ సబ్ కమిటీ సారథి లోఫ్‌గ్రెన్ అన్నారు. ఈ పరిణామాన్ని ఆశావహులు స్వాగతించారు.

ఏ దేశంలో ఎలా ?

అబార్షన్‌పై యూరప్ దేశాల్లో ఆమెకే హక్కు • ఆఫ్రికాలో కఠినమైన ఆంక్షలు



సరిగ్గా మూడు నెలలు క్రితం అగ్రరాజ్యమైన అమెరికా సుప్రీం కోర్టు అబార్షన్లపై రాజ్యాంగబద్ధంగా మహిళలకు వచ్చిన హక్కుల్ని తోసిపుచ్చుతూ తీర్పు చెప్పడం సంచలనం సృష్టించింది. 1973లో రియో వర్సెస్ వేడ్ కేసు ద్వారా రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కుని 50 ఏళ్ల తర్వాత కొట్టేసింది. ఫలితంగా కొన్ని పరిమితుల మధ్య అబార్షన్ చేయించుకునే దేశాల జాబితాలో చేరిపోయింది. అయితే అమెరికాలో రాష్ట్రాలే శక్తిమంతం కావడంతో ఆయా రాష్ట్రాల నిబంధనల ఆధారంగా మహిళలకు అబార్షన్‌పై హక్కులు వస్తాయి. యూరప్ దేశాల్లో అబార్షన్ చేయించుకోవడం అత్యంత సులభమైతే, ఆఫ్రికా దేశాల్లో నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. చైనాలో 1953 నుంచి అబార్షన్ చట్టబద్ధం. జనాభా విపరీతంగా పెరిగిపోతూ ఉండడంతో 1970 తర్వాత బలవంతపు అబార్షన్లని కూడా ప్రోత్సహించింది. ఇప్పుడు వృద్ధులు పెరిగిపోతూ ఉండడంతో అనవసరంగా అబార్షన్ చేయించుకోవడానికి వీల్లేదంటూ గత ఏడాది ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

యూరప్ దేశాల్లో...

యూరప్‌లోని అత్యధిక దేశాల్లో మహిళలకు గర్భవిచ్ఛిత్తిపై హక్కులున్నాయి. 12–14 వారాల్లోపు అబార్షన్ చేయించుకోవడం పూర్తిగా మహిళల ఇష్టమే. ఇంగ్లండ్, స్కాట్‌లాండ్, వేల్స్‌లో 1967లో చట్టం చేశారు. 24 వారాలవరకు అబార్షన్ చేయించుకోవచ్చు. యూకేలో గర్భంలో శిశువు సరిగా ఎదగలేదని తేలితే ఎన్నో నెలలో అయినా గర్భాన్ని తీయించుకునే హక్కు మహిళలకి ఉంది. కెనడాలో గర్భవిచ్ఛిన్నానికి ప్రత్యేకంగా చట్టం లేకపోయినప్పటికీ ఏ దశలోనైనా అబార్షన్ చేయించుకోవచ్చు. యూరప్, లాటిన్ అమెరికా సంప్రదాయ కేథలిక్ దేశాల్లో కూడా మహిళా కార్యకర్తల ఉద్యమాలతో అబార్షన్‌పై హక్కులు కల్పించారు. గత ఏడాది కొలంబియాలో 24 వారాల్లోపు అబార్షన్ చేయించుకోవడం చట్టబద్ధం చేశారు. ఐర్లాండ్‌లో అబార్షన్ చట్టాలకు పరిమితులు విధించడంపై 2018లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మహిళలు తిరస్కరించారు. 12 వారాల్లో ఎప్పుడైనా అబార్షన్ చేయించుకునే హక్కు వారికి ఉంది. న్యూజిలాండ్‌లో 2020లోనే మహిళలకు అబార్షన్లపై హక్కులు వచ్చాయి.

24 దేశాల్లో అబార్షన్ చట్టవిరుద్ధం

ప్రపంచంలోని 24 దేశాల్లో అబార్షన్ చేయించుకోవడం చట్టవిరుద్ధం. వీటిలో అత్యధికంగా ఆఫ్రికా దేశాలుంటే ఆసియా, సెంట్రల్ అమెరికా, యూరప్‌కు చెందిన దేశాలు వీటిలో ఉన్నాయి. సెనగల్, మార్టినియా, ఈజిప్ట, లావోస్, ఫిలిప్పైన్స్, ఎల్ సాల్వోడర్, హోండరస్, పోలాండ్, మాల్టాలో మహిళలు చట్టబద్ధంగా అబార్షన్ చేయించుకోలేరు. కొన్ని దేశాల్లో అబార్షన్ చేయించుకుంటే కఠినమైన శిక్షలు కూడా ఉంటాయి. ఎల్ సాల్వేడర్‌లో మహిళలు అబార్షన్ చేయించుకుంటే దోషిగా నిర్ధారించి జైలు శిక్ష కూడా విధిస్తారు. పోలాండ్ గత ఏడాదే అబార్షన్లపై సంపూర్ణ నిషేధాన్ని విధించింది.పునరుత్పత్తి సామర్థ్యం కలిగిన వయసులో ఉండే ప్రపంచ మహిళా జనాభాలో 5% మంది ఈ 24 దేశాల్లోనే ఉన్నారు. అంటే దాదాపుగా 9 కోట్ల మందికి మహిళలకి అబార్షన్ చేయించుకునే హక్కు లేదని సెంటర్ ఫర్ రీప్రొడక్టివ్ రైట్స్ సంస్థ నివేదికలో వెల్లడైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

50 దేశాల్లో పరిమితులతో హక్కులు

దాదాపుగా 50 దేశాల్లో అబార్షన్ చేయించుకునే హక్కు ఉన్నప్పటికీ కొన్ని పరిమితులున్నాయి. లిబియా, ఇండోనేసియా, నైజీరియా, ఇరాన్, వెనిజులాలో తల్లి ప్రాణాలు ప్రమాదం ఉంటే మాత్రమే అబార్షన్ చేయించుకోచ్చు. మిగిలిన దేశాల్లో అత్యాచారం, అవాంఛిత గర్భధారణ, గర్భంలో శిశువు ఎదుగుదలలో లోపాలుంటే అబార్షన్ చేయించుకోవడానికి అనుమతినిస్తారు. బ్రెజిల్‌లో అత్యాచారం వల్ల గర్భం వచ్చినా, గర్భస్థ పిండం ఎదగకపోయినా గర్భస్రావానికి అనుమతిస్తారు కానీ వైద్యులు, వైద్య రంగంలో కనీసం ముగ్గురు అనుమతి తప్పనిసరి.

అబార్షన్ ఆమె ఇష్టం

▶ మొదటి పేజీ తరువాయి

వెలువరించింది. అంతర్జాతీయ సురక్షిత అబార్షన్ దినోత్సవం (సెప్టెంబర్ 28) మర్నాడే ఈ తీర్పు రావడం విశేషం.

కాలంతో పాటు చట్టాలూ మారాలి

ఎంటీపీ చట్టం సెక్షన్ 3(2)(బీ)ప్రకారం వివాహితలతో పాటు అత్యాచార బాధితులు, మైనర్లు, మానసిక సమస్యలున్న వారు, పిండం సరిగా అభివృద్ధి చెందని వాళ్లు 24 వారాల్లోపు గర్భస్రావం చేయించుకోవచ్చు. అవివాహితలు, వితంతువులు తమ ఇష్టం మేరకు గర్భం దాలిస్తే 20 వారాల వరకు మాత్రమే అబార్షన్‌కు అవకాశముంది. ఈ తేడాలు వివక్షేనని ధర్మాసనం పేర్కొంది. చట్టాలు స్థిరంగా ఉండరాదని అభిప్రాయపడింది. వాటిని కాలానుగుణంగా మార్చుకోవాల్సిన అవసరముందని 75 పేజీల తీర్పులో పేర్కొంది. ''పిల్లల్ని కనాలా, వద్దా అన్నది మహిళ హక్కు. ఆర్టికల్ 21 ప్రకారం ఆమెకున్న వ్యక్తిగత స్వేచ్ఛ. దీనికి వైవాహిక స్థితితో నిమిత్తం లేదు. సహజీవనాలను కూడా సుప్రీంకోర్టు ఇప్పటికే గుర్తించింది. కనుక 24 వారాల్లోపు సురక్షిత అబార్షన్ హక్కును వివాహితలకే పరిమితం చేసి అవివాహితలకు, ఒంటరి మహిళలకు నిరాకరించడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమే. చట్టానికి సంకుచిత భాష్యం చెప్పడమే. ఇందులో ఎలాంటి హేతుబద్ధతా లేదు''అని స్పష్టం చేసింది. అంతర్జాతీయ సురక్షిత గర్భస్రావ దినం మర్నాడే తీర్పు వెలువడిందని ఒక లాయర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా ఇది యాదృచ్ఛికమని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.

కుటుంబీకుల అనుమతీ అక్కర్లేదు

చట్టపరమైన అబార్షన్ చేయించుకోవడానికి మహిళలకు కుటుంబ సభ్యుల సమ్మతి అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది. కుటుంబ సభ్యుల సమ్మతి, డాక్యుమెంటరీ రుజువులు, న్యాయపరమైన అనుమతి అంటూ వైద్యులు చట్టానికి మించిన షరతులు పెడుతున్నారు. అవి లేవంటూ అబార్షన్‌కు నిరాకరిస్తున్నారు''అంటూ ఆవేదన వెలిబుచ్చింది. ''ఇది నిజంగా విచారకరం. ఆ కారణాలతో వైద్యులు అబార్షన్ నిరాకరించడానికి వీల్లేదు. గర్భాన్ని తొలగించుకోవాలనుకునే మహిళ ఎంటీపీ చట్ట నిబంధనలను పాటించేలా చూసుకుంటే చాలు''అని పేర్కొంది. ''సదరు గర్భానికి భర్త/భాగస్వామి అంగీకారం ఉందా? పుట్టబోయే బిడ్డ బాధ్యతను వారు కూడా సమానంగా స్వీకరిస్తారా? గర్భధారణ, కాన్పు ఖర్చులను కుటుంబం భరిస్తుందా? ఇలాంటివన్నీ చాలా సంక్లిష్టమైన అంశాలు. సదరు మహిళకు మాత్రమే తెలిసే విషయాలు. కాబట్టి గర్భాన్ని ఉంచుకోవాలా, లేదా అన్నది నిర్ణయించుకోవాల్సింది కేవలం ఆమె మాత్రమే. అంతే తప్ప సంకుచిత పితృస్వామిక సూత్రాల ఆధారంగా చట్టం నిర్ణయించే పరిస్థితి ఉండకూడదు''అని స్పష్టం చేసింది.



జస్టిస్ చంద్రచూడ్ జస్టిస్ పార్దీవాలా జస్టిస్ బొపన్న

ఇప్పటిదాకా వీరు అర్హులు...

2021లో చేసిన సవరణ నేపథ్యంలో ఎంటీపీ చట్టం సెక్షన్ 3(బి) ప్రకారం 24 వారాల దాకా అబార్షన్ చేయించుకోవడానికి ఇప్పటిదాకా ఈ కింది కేటగిరీల మహిళలకు అర్హత ఉంది...

- లైంగిక దాడి, అత్యాచార బాధితులు
- మైనర్లు
- గర్భధారణ తర్వాత భర్తను కోల్పోయిన, విడాకులు తీసుకున్నవాళ్లు
- కాన్పును కష్టతరం చేసే తరహా శారీరక వైకల్యమున్న వాళ్లు
- మానసిక సమస్యలున్నవాళ్లు
- పిండం సరిగా ఎదగనివాళ్లు
- ప్రకటిత అత్యవసర పరిస్థితులు, విపత్తుల వేళల్లో గర్భం ధరించిన వాళ్లు

తాజా తీర్పుతో అవివాహితలు/సహజీవనం చేస్తున్న వారికీ 24 వారాల దాకా అబార్షన్ చేయించుకునే హక్కు దఖలుపడింది.

కేసు నేపథ్యం ఇదీ...

ఈశాన్య ప్రాంతానికి చెందిన ఓ 25 ఏళ్ల అవివాహిత 23 వారాల 5 రోజుల గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతివ్వాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. భాగస్వామి పెళ్లికి నిరాకరించి తనను వదిలేశాడని పేర్కొంది. కానీ, ''ఆమె ఇష్టపూర్వకంగా గర్భం దాల్చింది. 20 వారాలు దాటినందున ఎంటీపీ చట్టం ప్రకారం అబార్షన్‌కు అనుమతివ్వలేం'' అని హైకోర్టు పేర్కొంది. దీన్ని ఆమె సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అబార్షన్‌కు అనుమతిస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఎంటీపీ చట్టానికి 2021లో చేసిన సవరణ ద్వారా 'భర్త' అనే పదాన్ని 'భాగస్వామి'గా మార్చిన విషయాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని అభిప్రాయపడింది. ఆగస్టు 23న వాదనలు ముగించి తాజాగా తీర్పు వెలువరించింది.

వైవాహిక అత్యాచారానికి గురైనా...

వైవాహిక అత్యాచారాన్ని కూడా ఎంటీపీ చట్టానికి సంబంధించినంత వరకు అత్యాచారం పరిధిలోకి తేవాల్సి ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ''అత్యాచారమంటే మహిళ తన సమ్మతి లేకుండా లైంగిక సంపర్కంలో పాల్గొనాల్సి రావడం. అపరిచితులు మాత్రమే రేప్‌లకు, లైంగిక వేధింపులకు పాల్పడతారన్న అపోహ ఉంది. భర్త/జీవిత భాగస్వామి చేతిలో లైంగిక వేధింపులు చిరకాలంగా మహిళలు ఎదుర్కొంటున్న చేదు అనుభవాలే. కాబట్టి వీటినీ అత్యాచారంగానే పరిగణిస్తూ, తద్వారా దాల్చే బలవంతపు గర్భం బారినుంచి మహిళలను కాపాడాల్సి ఉంది. వారికీ 24 వారాల్లోపు అబార్షన్ చేయించుకునే హక్కుంటుంది'' అని పేర్కొంది. అయితే ''వైవాహిక అత్యాచారాన్ని ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం రేప్‌గా పరిగణించాలా, లేదా అన్నది మరో ధర్మాసనం విచారణలో ఉంది. దీనిపై వారిదే తుది నిర్ణయం'' అని పేర్కొంది.

మైనర్ల పేరు వెల్లడించాల్సిన పని లేదు

మైనర్‌కు అబార్షన్ సందర్భంగా పోలీసు రిపోర్టు తప్పనిసరే అయినా బాధితురాలి పేరు, వ్యక్తిగత వివరాలను వైద్యులు తెలపాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. పోక్సో చట్టాన్ని సామరస్యపూర్వకంగా వర్తింపజేయాలని సూచించింది. ''వివాహితలు మాత్రమే లైంగిక కార్యకలాపాల్లో పాల్గొంటారన్నది సరికాదు. అవివాహితలు, మైనర్లు కూడా లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనడం, లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు గురవడం, గర్భం దాల్చడం జరుగుతోంది. సరైన లైంగిక ఆరోగ్య విద్య లేక కౌమారదశలో పునరుత్పత్తి వ్యవస్థ, సురక్షిత లైంగిక పద్ధతులు, గర్భనిరోధక పరికరాల గురించి తెలియడం లేదు. ఈ సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచాలి. ప్రతి జిల్లాలో వైద్య సదుపాయాలు, గుర్తింపు పొందిన వైద్యులు తప్పనిసరిగా ఉండాలి''అని ఆదేశించింది.

జడ్జీలు, పోలీసులపై పీఎఫ్‌'ఐ'!



న్యూఢిల్లీ/ముంబై: హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ పోలీసు అధికారులు, ముస్లింలలోని అహ్మదీయ వర్గంపై దాడులకు ఇస్లామిక అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కుట్ర పన్నిందని దర్యాప్తు సంస్థల అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఈ సంస్థ నాయకులు, సభ్యుల నివాసాల్లో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2047 దాకా అమలు చేయాల్సిన పీఎఫ్ఐ రోడ్‌మ్యాప్‌నకు సంబంధించిన పత్రాలు కూడా ఇందులో ఉన్నాయి. ప్రముఖ వ్యక్తులపై దాడులు చేసి, దేశంలో అలజడి సృష్టించేందుకు పీఎఫ్ఐ పథక రచన సాగిస్తున్నట్లు ఈ పత్రాల ద్వారా బహిర్గతమైందని చెప్పారు. దేశ వ్యతిరేక కార్యకలాపాల కోసం యువతను నియమించుకోవడానికి సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకుందని తెలిపారు. ద గేట్, బాబ్ అల్ నూర్, ప్లే గ్రౌండ్ తదితర పేర్లతో టెలిగ్రామ్ గ్రూప్‌లు సృష్టించారని వివరించారు. విదేశీ పర్యాటకులపైనా పాపులర్ ఫ్రంట్ సంస్థ గురిపెట్టిందని, ప్రధానంగా తమిళనాడులోని వట్టక్కనల్‌ను సందర్శించేందుకు వచ్చే యూదు మతస్తులను లక్ష్యంగా చేసుకుందని అన్నారు. దేశంలో ప్రముఖ వ్యక్తులను హత్య చేసేందుకు పీఎఫ్ఐ కుట్ర పన్నినట్లు తేలిందని మహారాష్ట్ర అదనపు డీజీపీ, ఏటీఎస్ చీఫ్ వినీత్ అగర్వాల్ కూడా తెలిపారు. పీఎఫ్ఐ సభ్యుల వద్ద పత్రాలతో పాటు కొన్ని ఎల్రక్టానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నామని, అందులోని డేటాను తిరిగి రాబట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

పీఎఫ్ఐ ట్విట్టర్ ఖాతా నిలిపివేత

పీఎఫ్ఐ ట్విట్టర్ ఖాతాను నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలపై నిషేధాన్ని అమలు చేయాలంటూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లకు అధికారాలు కట్టబెట్టాయి.

పీఎఫ్ఐ నుంచి బెదిరింపు లేఖ!

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు సమీపంలోని పొల్లాచ్చి పట్టణంలో 16 పెట్రోల్ బాంబులు పేలుస్తామంటూ తమకు పోస్టు ద్వారా బెదిరింపు లేఖ వచ్చిందని పోలీసులు తాజాగా తెలియజేశారు. వెంటనే అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఈ లేఖను పీఎఫ్ఐ, దాని రాజకీయ విభాగమైన సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) పంపినట్లు భావిస్తున్నామని చెప్పారు.

బీజేపీయేతర ప్రభుత్వాలపై గవర్నర్లను ప్రయోగిస్తోంది

కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు



మలప్పురం/గుడలూర్: ''బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను గద్దెదించేందుకు కేంద్రం గవర్నర్లను వాడుకుంటోంది. గవర్నర్లను ప్రజలెన్నుకున్నారా? వారి పెత్తనమేమిటి?''అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆయన భారత్ జోడో యాత్ర గురువారం మళ్లీ తమిళనాడులోని నీలగిరి జిల్లా అడుగుపెట్టింది. బీజేపీ ఒకే జాతి, ఒకటే భాష ఎజెండాను అమలు చేస్తోందని ఆరోపించారు. భాషలు, సంస్కృతులు, మతాలను గౌరవించుకోవాలన్నారు. మోకాలి నొప్పి కొద్దిగా ఇబ్బంది పెడుతోందని రాహుల్ చెప్పారు. అయినా ప్రజలతో మాట్లాడుతూ ముందుకు సాగుతుంటే ఆ బాధ తెలియడం లేదని అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వీడియోను విడుదల చేసింది. శుక్రవారం ఆయన యాత్ర చామరాజనగర్ జిల్లా గుండ్లుపేట్ వద్ద కర్ణాటకలో అడుగుపెట్టనుంది.

దిగ్విజయ్ వర్సెస్ థరూర్!

నేడే వారిద్దరి నామినేషన్లు

అధ్యక్ష రేసు నుంచి గెహ్లాట్ ఔట్...



నామినేషన్ పత్రాలతో దిగ్విజయ్ సింగ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధమయ్యింది. గురువారం నామినేషన్ పత్రాలు తీసుకున్నాక ఆయన మీడియాతో మాట్లాడారు. కచ్చితంగా పోటీలో ఉంటారా అని ప్రశ్నించగా, నామినేషన్ల ఉపసంహరణ తేదీ దాకా వేచి చూడండని సమాధానమిచ్చారు. 'మీరు డమ్మీ అధ్యక్షుడే అవుతారా?' అని అడగ్గా 'మీరు నన్నెందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు' అని ఎదురు ప్రశ్నించారు. బరిలోకి దిగాలన్నది తన సొంత నిర్ణయమేనని, ఎవరి ప్రోద్బలమూ లేదని చెప్పారు. జార్ఖండ్ మాజీ మంత్రి కె.ఎస్.త్రిపాఠి కూడా నామినేషన్ పత్రాలు తీసుకోవడం గమనార్హం. మల్లికార్జున ఖర్గే, ముకుల్ వాస్నిక్, కుమారి సెల్జా పేర్లు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి.

దిగ్విజయ్‌తో స్నేహపూర్వక పోటీ

కాంగ్రెస్ అధ్యక్ష బరిలో దిగుతున్న పార్టీ ఎంపీ శశీ థరూర్ కూడా శుక్రవారమే నామినేషన్ దాఖలు చేయనుండటం తెలిసిందే. ఆయనతో దిగ్విజయ్ సమావేశమయ్యారు. ఇద్దరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమది స్నేహపూర్వక పోటీ అంటూ తర్వాత థరూర్ ట్వీట్ చేశారు. ఎవరు గెలిచినా చివరకు పార్టీ గెలిచినట్టేనన్నారు.

అధ్యక్ష బరిలో లేను: గెహ్లాట్



కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో పోటీ చేయడం లేదని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. రాజస్తాన్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తానే నైతిక బాధ్యత వహిస్తానన్నారు. సీఎంగా తాను కొనసాగాలో లేదో అధినేత్రి సోనియా గాంధీ నిర్ణయిస్తారన్నారు. ఆయన గురువారం సోనియాతో సమావేశమయ్యారు. తన వర్గం ఎమ్మెల్యేల ధిక్కారంపై వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజస్తాన్ పరిణామాలపై క్షమాపణ చెప్పానన్నారు. ''50 ఏళ్లుగా కాంగ్రెస్‌కు విధేయుడిగా ఉంటున్నా. పార్టీ నాకెన్నో పదవులిచ్చిన విషయాన్ని ఎప్పుడూ మర్చిపోలేదు'' అన్నారు. రాజస్తాన్ సీఎంపై సోనియా నిర్ణయం తీసుకుంటారని కేసీ వేణుగోపాల్ చెప్పారు.

సోనియాతో పైలట్ సమావేశం

రాజస్తాన్ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ సోనియాతో సమావేశమయ్యారు. మరోవైపు కాంగ్రెస్ అసంతృప్త వర్గం జి–23 నేతలు పృథ్వీరాజ్ చవాన్, భూపీందర్ హుడా, మనీశ్ తివారీ, ఆనంద్ శర్మ కూడా సమావేశమై అధ్యక్ష ఎన్నిక తదితరాలపై చర్చించుకున్నారు.

బీజేపీతోనే గుజరాత్ వికాసం: మోదీ



భావ్‌నగర్: దేశంలోనే అతిపొడవైన తీర ప్రాంతమున్న గుజరాత్ అభివృద్ధి కోసం దశాబ్దాల పాటు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదని ప్రధాని మోదీ అన్నారు. ఫలితంగా ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం గత 20 ఏళ్లుగా నిజాయతీతో ప్రయత్నాలు చేసి రాష్ట్రం అభివృద్ధికి బాటలు పరిచిందని పేర్కొన్నారు. ప్రచార ఆర్భాటాలకు డబ్బు వృథా చేయకుండా తీర ప్రాంతం వెంబడి పలు భారీ ప్రాజెక్టులు చేపట్టిందని ఆయన అన్నారు. ఫలితంగా లక్షలాది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. ప్రజాసేవే పరమావధిగా భావిస్తున్న బీజేపీ ఇచ్చిన వాగ్దానాలను ఎప్పుడూ నెరవేరుస్తుందని ఆయన పేర్కొన్నారు. భావ్‌నగర్, బొటాడ్, అమ్రేలీ జిల్లాల్లో గురువారం రూ.6 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపిన సందర్భంగా భావ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సీఎన్‌జీ టెర్మినల్, బ్రౌన్‌ఫీల్డ్ పోర్ట్ అభివృద్ధి, కార్గో కంటెయినర్ ఉత్పత్తి విభాగం తదితరాలు ఈ ప్రాజెక్టుల్లో ఉన్నాయి. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటన సమయంలో ప్రధాని మోదీ రూ.29 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

సింహ వాహనంపై శ్రీమన్నారాయణుడు


స్వామికి హారతిస్తున్న అర్చకుడు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం ఉదయం అనంత తేజోమూర్తి శ్రీ మలయప్పస్వామి యోగ నరసింహుని అలంకారంలో సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్వామి వారు నాలుగు మాడ వీధుల్లో విహరించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయంగార్లు స్వామి వారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి వాహన సేవ ఆద్యంతం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి శ్రీవారిని దర్శించి తరించారు. కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు మూరంశెట్టి రాములు, పోకల అశోక్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముత్యపు పందిరి వాహనంపై వేణుగోపాలుడిగా..

గురువారం రాత్రి మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై వేణుగోపాలస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ ప్రాంతాలకు చెందిన 17 కళాబృందాలు ప్రదర్శనలిచ్చాయి.

సర్వ దర్శనానికి 6 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 22 కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. సర్వ దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది.బుధవారం అర్ధరాత్రి వరకు 64,823 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 22,890 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.03 కోట్లు వేశారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనం


అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి హారతులిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దసరా ఉత్సవాల్లో నాలుగో రోజైన గురువారం దుర్గమ్మ శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ద్వారకా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. గురువారం సుమారు 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. అన్నపూర్ణాదేవి విశేష అలంకారం కావడంతో భక్తులు ప్రసాద స్వీకరణకు బారులు తీరారు. సాయంత్రం శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ కోరుముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు.



నేడు శ్రీలలితా త్రిపుర సుందరిగా..

దసరా ఉత్సవాల్లో 5వ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. శుక్రవారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉంది.

కైలాస వాహనంపై ఆది దంపతులు

శ్రీశైలం టెంపుల్: దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీశైల మల్లికార్జునుడు దేవేరి భ్రామరితో కలిసి కైలాస వాహనంపై కొలువుదీరారు. అమ్మవారు కూష్మాండ దుర్గ రూపంలో దర్శనమిచ్చారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు, వేద పండితులు వాహన, అలంకార ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కైలాస వాహనంపై అధిష్ఠింపజేసిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను, అమ్మవారి అలంకార రూపాన్ని ఆలయ ప్రదక్షిణ చేయించారు.


కైలాసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లు

పరిపాలన రాజధానిగా విశాఖ కావడం తథ్యం

ఈ ప్రాంత వాసులు అడ్డుకుంటే చరిత్రహీనులే: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- విశాఖ అభివృద్ధిలో వైఎస్సార్ మార్క్
- ప్రభుత్వస్థలంలో ప్రభుత్వ భవనమే కడుతున్నాం
- అచ్చెన్నాయుడు మనిషి పెరిగాడేగానీ.. బుద్ధి పెరగలేదు
- ఇది ప్రజాస్వామ్యం.. ఎవరి జాగీరు కాదు.. పార్టీ సమీక్ష సమావేశంపై ఏమిటారాతలు?
- వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలుస్తాం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ పరిపాలన రాజధాని కావడం తథ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతవాసులెవరైనా అడ్డుకుంటే చరిత్రహీనులుగా నిలిచిపోతారన్నారు. ఆయన గురువారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 26 జిల్లాలు అభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చేస్తుంటే.. అది వద్దంటూ రైతుల ముసుగులో టీడీపీ అమరావతి–అరసవల్లి యాత్ర చేస్తోందని చెప్పారు. రాజకీయ పార్టీలు సమీక్ష నిర్వహించుకోవడం ఆనవాయితీ అని, తమ పార్టీ అధ్యక్షుడు కూడా ఆ విధంగానే సమీక్షించారని చెప్పారు. దీనిపై పచ్చపత్రికలు ఏదేదో రాశాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98.44 శాతం అమలు చేశామని, సీపీఎస్ వంటి వాటిపై చర్చలు జరుగుతున్నాయని వివరించారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 గెలిచి తీరతామని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అపర జ్ఞానిలా, అంతా ఆయనకే తెలుసన్నట్లుగా, తాము దద్దమ్మలన్నట్లు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. మనిషిగా పెరిగాడేగానీ బుర్ర ఎదగలేదన్నారు. 'నువ్వు మంత్రిగా పనిచేశావు కదా? మరి ఈ మూడు జిల్లాల్లో ఏంచేశావో.. నీ మార్క్ ఏమిటో చెప్పండి. అలాగే మున్సిపల్ మంత్రిగా టీడీపీ హయాంలో బండారు సత్యనారాయణమూర్తి పనిచేశారు. ఆయనైనా తన మార్క్ ఏమిటన్నది చెబుతారా?' అని నిలదీశారు.

ప్రభుత్వ కార్యాలయం నిర్మిస్తే తప్పేంటి?

'రుషికొండలో హరిత రిసార్టు ఉండేది. అది పాతబడిపోతే దానిస్థానంలో కొత్త గెస్ట్‌హౌస్ నిర్మిద్దామని ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని చేపడితే... దాని మీద కూడా రాజకీయం చేస్తున్నారు. ప్రభుత్వం అక్కడ మరో గెస్ట్‌హౌస్ కడితే తప్పేమిటి? అక్కడ ప్రభుత్వ కార్యాలయం, సీఎం అధికార నివాసం కడితే తప్పేమిటి? గతంలో హైదరాబాద్‌లో నాటి సీఎం వైఎస్సార్ అధికార నివాసం నిర్మించారు. ఆ తర్వాత కేసీఆర్ వచ్చాక మరో భవనం కట్టారు. ఎవరు సీఎంగా ఉన్నా అవి అధికార నివాసంగా ఉంటాయి. రుషికొండ మీద ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ ప్రభుత్వ కార్యాలయం, గెస్ట్‌హౌస్ కడితే తప్పేమిటి?..' అని పేర్కొన్నారు. 'ఏదైనా పర్యావరణ సమస్య ఉంటే సంబంధిత అధికారులు చూసుకుంటారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఈ భవనంలో ఉంటారు. పాలనందిస్తారు. ప్రైవేట్ వాళ్లకి అప్పగించలేదు కదా రాద్ధాంతం చేయడానికి..' అని చెప్పారు. కొన్ని దుష్టశక్తులు ప్రతి మంచిపనిని అడ్డుకుంటున్నాయని, అదే గోప్యంగా ఉంచడానికి కారణమన్నారు. అఖిలపక్షాలను రుషికొండ మీదకి తీసుకెళతామని, దాపరికమేమీ ఉండదన్నారు.

మీది రియల్ ఎస్టేట్ వ్యాపారం

'టీడీపీ నేతలు గొప్పలు చెప్పుకొంటున్నారు. ల్యాండ్ పూలింగ్ అనేది కొత్త కార్యక్రమం కాదు. గతంలో మహానేత వైఎస్సార్ కూడా చేశారు. ఇటీవలే మా ప్రభుత్వం ఇక్కడ పేదల ఇళ్లకోసం దాదాపు ఆరువేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ చేసి, డెవలప్ చేసి ఇచ్చింది. అదేమీ కొత్త స్కీం కాదే. మీరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి ప్రభుత్వ ధనాన్ని దోచుకోవడం కోసం తప్ప చేసిందేముందు. అది వాస్తవం కాదా.. అందుకే మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే.. ఇక్కడ కూడా ఎవరో ఒకరు మాట్లాడతారు. వీటివల్ల రాజకీయాలు పలచన అవుతాయి. రాజకీయ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. భాష మీద అదుపు, విషయం మీద పట్టు ఉండాలి. హుద్‌హుద్ సమయంలో విపత్తు పేరు చెప్పి రికార్డులు తారుమారు చేసి మరీ భూములు దోచుకుతిన్నది మీరు కాదా?..' అని టీడీపీ నేతలపై విరుచుకుపడ్డారు. ఏపీలో కన్నా తెలంగాణాలోనే టీచర్లకు అన్ని బెనిఫిట్లు కల్పిస్తున్నామని తెలంగాణ మంత్రి హరీష్‌రావు అన్న మాటను విలేకరులు ప్రస్తావించగా, బొత్స మాట్లాడుతూ ఏపీ, తెలంగాణల్లో టీచర్లకు పీఆర్సీ, ఎంప్లాయి బెనిఫిట్, ఫిట్‌మెంట్‌లలో ఎవరికి ఎక్కువ వస్తున్నాయో పరిశీలించమనండని సూచించారు.

ట్రిపుల్ ఐటీ ఎంట్రన్స్‌లో.. సర్కారు స్కూళ్ల సత్తా

- రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ –2022–23 ఫలితాల వెల్లడి
- సీట్లు సాధించిన వారిలో 76.97% ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే
- ఈ ఏడాది నుంచి నాలుగు క్యాంపస్‌ల్లోనూ కౌన్సెలింగ్
- మంత్రి బొత్స వెల్లడి


ఐఐఐటీ అడ్మిషన్ల ఫలితాలు విడుదల చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రొఫెసర్ కేసీ రెడ్డి, ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ–ట్రిపుల్ ఐటీలు)లో ప్రవేశాలకు ఈసారి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఎక్కువమంది ఎంపికయ్యారు. సీట్లు సాధించిన వారిలో 76.97 శాతం మంది వీరే. ఇందులో బాలికల శాతం 66.04. టాప్–3 ర్యాంకులు సాధించిన వారు కూడా ప్రభుత్వ విద్యార్థులే కావడం విశేషం. రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఎంట్రన్స్ ఫలితాలను గురువారం విజయవాడలోని ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డితో కలిసి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు.

టాప్–3 జెడ్పీ విద్యార్థులే..

ప్రకాశం జిల్లా సింగరాయకొండ జెడ్పీ పాఠశాలకు చెందిన జల్లెల నందిని మయూరి ఓపెన్ కేటగిరీలో ప్రథమ ర్యాంకు, శ్రీకాకుళం జిల్లా టెక్కలి జెడ్పీ పాఠశాలకు చెందిన చక్రపాణి బెహర రెండో ర్యాంకు, గుంటూరు జిల్లా మున్నంగి జెడ్పీ పాఠశాలకు చెందిన సోమిశెట్టి ఫణీంద్ర రామకృష్ణ మూడో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు రాష్ట్రంలోని నాలుగు ఐఐఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని, 600 మార్కులకు గాను అన్ని క్యాంపస్‌లలో 93 నుంచి 95 శాతం మార్కులను కేటగిరీల వారీగా కటాఫ్‌గా నిర్ణయించామని వెల్లడించారు. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని నాలుగు క్యాంపస్‌ల్లోను కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు బొత్స వెల్లడించారు.

విద్యా రంగానికి ఎంతైనా ఖర్చుచేస్తాం

మన విద్యార్థులను ప్రపంచస్థాయి నిపుణులుగా తీర్చిదిద్దాలని సీఎం వైఎస్ జగన్ సంకల్పించారని మంత్రి తెలిపారు. అందుకనుగుణంగా ఐఐఐటీల అభివృద్ధికి, వాటిల్లో వసతులు, ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం తరఫున ఎంతైనా ఖర్చుపెట్టేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. ఏటా ఎస్టీ కేటగిరీలో సీట్లు మిగులుతుండడంతో వాటిని ఎస్సీ కేటగిరీకి మార్చేవారమని, అయితే.. ఈసారి ఎస్టీ కేటగిరీలో అభ్యర్థుల సంఖ్య పెరగడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. న్యాయస్థానం సూచనల మేరకు ప్రస్తుతం రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంకల్పంతో 2008లో ట్రిపుల్ ఐటీని నెలకొల్పారని, దీనిని ఆయన తన మానసపుత్రికగా భావించారన్నారు. ప్రస్తుతం ఒక్కో క్యాంపస్‌లో 1,100 సీట్ల చొప్పున మొత్తం 4,400 సీట్లు ఉన్నాయన్నారు. వీటిలో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద 400 సీట్లు ఉన్నాయని, తద్వారా ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు కూడా వీటిల్లో చదువుకునే అవకాశం దక్కిందని మంత్రి బొత్స వివరించారు. విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయని ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి తెలిపారు. ఇప్పటిదాకా తమ విద్యార్థులకు 93 శాతం ప్లేస్‌మెంట్స్ కల్పించామని, వీటిని మరింత పెంచేందుకు ప్రమాణాలను మెరుగుపరుస్తున్నట్లు ఆయన చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారిని తీర్చిదిద్దేందుకు ల్యాప్‌టాప్, యూనిఫారతో సహా అన్ని వసతులను ఉచితంగా కల్పిస్తున్నట్లు కేసీ రెడ్డి చెప్పారు.

కౌన్సెలింగ్ తేదీలివే..

అక్టోబర్ 12, 13 తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లలో, 14, 15 తేదీల్లో ఒంగోలు క్యాంపస్‌వి ఇడుపులపాయలో, 15, 16 తేదీల్లో ఎచ్చెర్ల క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి తెలిపారు. అభ్యర్థుల మెరిట్ లిస్టును www.rgukt.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ఐఐఐటీ క్యాంపస్‌ల డైరెక్టర్లు ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ బి. జయరామిరెడ్డి, ప్రొఫెసర్ పి. జగదీశ్వర్‌రావు, అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ గోపాలరాజు పాల్గొన్నారు.

ట్రిబ్యునల్ అవార్డు ప్రకారమే పోలవరం నిర్మాణం

గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించలేదని కేంద్రం స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: గోదావరి ట్రిబ్యునల్ అవార్డు (జీడబ్ల్యూడీటీ) ప్రకారమే పోలవరం ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం నిర్మిస్తోందని కేంద్రం స్పష్టం చేసింది. జీడబ్ల్యూడీటీ అవార్డుకు విరుద్ధంగా పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారన్న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల వాదనలను తోసిపుచ్చింది. పోలవరం ప్రాజెక్టు కట్టక ముందు వెనుక భాగంలో వరద నీటి మట్టం ఎంత ఉంటుందో, ప్రాజెక్టు పూర్తయ్యాక కూడా అంతే ఉంటుందని తేల్చి చెప్పింది. బ్యాక్ వాటర్‌పై అధ్యయనం చేశాకే ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చినట్లు గుర్తు చేసింది. ముంపు ప్రభావంపై సాంకేతికంగా వాస్తవాలను వివరించి, ప్రభావిత రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయడానికి అక్టోబర్ 7న ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఈఎన్సీలతో సమావేశం నిర్వహించాలని సీడబ్ల్యూసీని ఆదేశించింది. ఈ సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా ఇచ్చిన నివేదికను సుప్రీం కోర్టుకు నివేదిస్తామని వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల సమస్యపై ప్రభావిత రాష్ట్రాలతో నెలాఖరులోగా చర్చించి నివేదిక ఇవ్వాలని ఈనెల 6న కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. దాంతో గురువారం ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు (సీఎస్‌లు), పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారులు, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శి రామేశ్వర్ గుప్తా వర్చువల్‌గా సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ అధికారి శ్యామలరావు, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల అధికారులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ అధ్యయనమే ప్రామాణికం

పోలవరం ప్రాజెక్టు డిజైన్ మారిన నేపథ్యంలో పర్యావరణ అనుమతిని పునఃసమీక్షించే వరకు పనులు నిలిపివేయాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ కోరడంపై సీడబ్ల్యూసీ సభ్యుడు కుశ్వీందర్ వోహ్రా, పీపీఏ సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. డిజైన్ ఏమాత్రం మారలేదని స్పష్టం చేశారు. బ్యాక్ వాటర్ ప్రభావంపై హైదరాబాద్ ఐఐటీ చేసిన అధ్యయనంలో భద్రాచలం, మణుగూరు భారజల కర్మాగారం, భద్రాద్రి విద్యుత్ కేంద్రం, గ్రామాలు ముంపునకు గురవుతాయని తెలంగాణ నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ చెప్పారు. దీనిపై ఏపీ అధికారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. జాతీయ స్థాయిలో సీడబ్ల్యూసీ అత్యున్నత సంస్థ అని, అది చేసిన బ్యాక్ వాటర్ సర్వేనే ప్రామాణికమని స్పష్టంచేశారు. బ్యాక్ వాటర్‌తో ముంపు ఉండదని సీడబ్ల్యూసీ అధ్యయనంలో తేల్చిందని చెప్పారు. గోదావరికి గరిష్ఠంగా 58 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని, దాన్ని పరిగణలోకి తీసుకుని బ్యాక్ వాటర్ ప్రభావంపై థర్డ్ పార్టీతో అధ్యయనం చేయించాలని తెలంగాణ కోరగా, ఆ స్థాయిలో గోదావరికి వరద వచ్చే అవకాశమే లేదని ఏపీ అధికారులు తేల్చిచెప్పారు. పోలవరం ప్రాజెక్టులో ఈ ఏడాది నీటిని నిల్వ చేయడం వల్ల శబరి, సీలేరు ద్వారా వరద ఎగదన్ని తమ ప్రాంతం ముంపునకు గురైందన్న ఒడిశా వాదనను పీపీఏ సీఈవో కొట్టిపారేశారు. ఈ ఏడాది ప్రాజెక్టులో నీటినే నిల్వ చేయలేదని, అందువల్ల వరద ఎగదన్నిందని చెప్పడం సబబు కాదని అన్నారు. ఈ ఏడాది వరదలకు తమ రాష్ట్రంలోనూ గిరిజన ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని ఛత్తీస్‌గఢ్ అధికారులు చెప్పగా.. ఇంద్రావతి వరదల వల్లే ఆ ప్రాంతం ముంపునకు గురైందని సీడబ్ల్యూసీ అధికారులు తేల్చిచెప్పారు.

3 రాష్ట్రాల ఒప్పందం మేరకే..

పోలవరం నిర్మాణానికి అంగీకరిస్తూ 1978 ఆగస్టు 7న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి మధ్యప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరిందని, దీనిని జీడబ్ల్యూడీటీ ఆమోదించిందని ఏపీ అధికారులు గుర్తు చేశారు. దాని ప్రకారమే ప్రాజెక్టు నిర్మిస్తున్నామన్నారు. గోదావరికి వందేళ్లలో గరిష్ఠంగా 28.5 లక్షల క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చిందని, అదే స్థాయిలో పోలవరం స్పిల్ వే నిర్మిస్తే సరిపోతుందన్నారు. గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు వదిలేసేలా స్పిల్ వే డిజైన్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించిందన్నారు. ఆ డిజైన్ ప్రకారమే కేంద్రం అటవీ, పర్యావరణ సహా అన్ని అనుమతులను 2009 నాటికే ఇచ్చిందని.. ఆ మేరకే ప్రాజెక్టు నిర్మిస్తున్నామని స్పష్టంచేశారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ముంపు నివారణకు సీలేరు, శబరి నదులకు కరకట్టల నిర్మాణానికి ఆ ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని వందల సార్లు ఆ రాష్ట్రాలకు లేఖలు రాసినా స్పందన లేదని చెప్పారు. ఈ కరకట్టల నిర్మాణానికి మార్గం సుగమం చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు.

అన్నపూర్ణాదేవిగా శారదా స్వరూప రాజశ్యామల



పెందుర్తి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశాఖ శ్రీశారదాపీఠంలో నాలుగోరోజు గురువారం అన్నపూర్ణాదేవిగా శారదాస్వరూప రాజశ్యామల అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పూజలు చేశారు. గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం చేశారు. శ్రీచక్రానికి నవావరణార్చన విశేషంగా జరిపారు. సాయంత్రం అమ్మవారికి స్వామీజీలు ఏకదశ హారతులిచ్చారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు పీఠం ప్రతినిధులు ప్రసాద వితరణ చేశారు.

గరుడ వాహన సేవకు హారతుల స్థానంలో భక్తులకు అనుమతి

తిరుమల: ఈ ఏడాది తిరుమలలో సౌత్ వెస్ట్, నార్త్ వెస్ట్, నార్త్ ఈస్ట్ గేట్ల వద్ద ఉన్న హారతి పాయింట్లలో హారతులకు బదులు భక్తులను స్వామి వారి వాహన సేవకు అనుమతించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఒకరు హారతి ఇచ్చే సమయంలో దాదాపు ఐదుగురికి దర్శనం కల్పించవచ్చన్నారు. ప్రతి హారతి పాయింట్‌లో 10,000 మందికి గరుడ సేవ దర్శనం కల్పించే అవకాశం ఉందన్నారు. దాదాపు 3 లక్షల మంది భక్తులకు శ్రీవారి గరుడ వాహన దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో అతి ప్రధానమైన గరుడ సేవ అక్టోబర్ 1న జరగనున్న నేపథ్యంలో గురువారం ఆయన మాడ వీధుల్లో హారతి పాయింట్లు, గ్యాలరీలను డీఐజీ రవి ప్రకాష్, జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ.. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, రాంభగీచ వద్ద ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.


తిరుమల మాడ వీధుల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ ధర్మారెడ్డి

సంగీత దర్శకుడు కోటికి పురస్కారం

విజయనగరం టౌన్: ప్రముఖ సినీ, సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు సాలూరు కోటేశ్వరరావుకు జ్ఞాన సరస్వతి విశిష్ట పురస్కారాన్ని ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రదానం చేశారు. కోలగట్ల మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శారదా సేవా సంఘం ఆధ్వర్యంలో సంగీత దర్శకుడు కోటిని గౌరవించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. పురస్కార గ్రహీత కోటి మాట్లాడుతూ విజయనగరంలో జ్ఞాన సరస్వతి విశిష్ట పురస్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గాయకుడు మధుబాబు, శారదా సేవా సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్, చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


కోటికి పురస్కారం ప్రదానం చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, శారదా సేవా సంఘం సభ్యులు

తొలిదశలో 66 స్కిల్ హబ్స్ ప్రారంభం

- ఇంటర్, అంతకంటే తక్కువ చదువు ఉన్న వారికి నైపుణ్యశిక్షణ
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175, అదనంగా రెండు హబ్స్
- తొలి హబ్‌ను కర్నూలు జిల్లా డోన్‌లో ప్రారంభించిన మంత్రి బుగ్గన
- విజయవాడలో మరో హబ్‌ను ప్రారంభించిన చల్లా మధుసూదన్, అజయ్‌రెడ్డి


డోన్‌లో స్కిల్ హబ్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంలో భాగంగా కీలక అడుగు ముందుకు పడింది. ఇంటర్మీడియట్, అంతకంటే తక్కువ చదువు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒకటి వంతున ఏర్పాటు చేస్తున్న 175 స్కిల్ హబ్స్, అదనంగా మరో రెండు హబ్స్ (మొత్తం 177)లో తొలిదశ కింద 66 స్కిల్ హబ్స్ గురువారం ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా డోన్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను రాష్ట్ర ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)ఎండీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ స్థానికులకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి రెండు స్కిల్ యూనివర్సిటీలు, ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక స్కిల్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా 66 స్కిల్ హబ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, త్వరలోనే మిగిలిన 111 హబ్స్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎండీ సత్యనారాయణ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించే విధంగా కోర్సులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఆయా సంస్థలే ఉపాధి కల్పిస్తాయన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (స్కిల్ డెవలప్‌మెంట్) చల్లా మధుసూదన్‌రెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోని ప్రభుత్వ కాలేజీలో ఈ స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వచ్చే నెలాఖరుకు శ్రీశైల దేవస్థానం సరిహద్దులు

- మంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: శ్రీశైలం దేవస్థానం భూముల సరిహద్దులను అక్టోబరు నెలాఖరుకల్లా ఖరారు చేయనున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు భూ సరిహద్దులు సక్రమంగా లేకపోవడం ఆటంకంగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావుతో కలిసి సమీక్ష నిర్వహించామన్నారు. అటవీ, రెవెన్యూ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్, దేవదాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో భూ సర్వే చేపడతామన్నారు. 1879లో దాదాపు 4,130 ఎకరాలుండగా.. 1967లో మరో 145 ఎకరాలను ప్రభుత్వం శ్రీశైల దేవస్థానానికి కేటాయించిందన్నారు. నాగార్జున సాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఈ భూములు ఉండటంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే సరిహద్దుల ఖరారు తప్పనిసరైందన్నారు. రిజర్వ్ ఫారెస్టు నిబంధనలను అతిక్రమించకుండా దేవస్థానానికి చెందిన భూముల్లో పర్యావరణ, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా, బెజవాడ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప ఆయన చెప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ పాల్గొన్నారు.

● తెలంగాణ

సాఫీగా వీసాలకు మరో ఏడాది!

అమెరికా రాయబార కార్యాలయం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అమెరికా వీసాల జారీలో జరుగుతున్న జాప్యం తొలగిపోయేందుకు మరో ఏడాది సమయం పట్టవచ్చునని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయ మినిస్టర్ కౌన్సెలర్ ఫర్ కాన్సులర్ అఫైర్స్ డాన్ హెఫ్లిన్ తెలిపారు. కరోనా కారణంగా ప్రపంచవ్యాప్తంగా వీసాల జారీ ప్రక్రియ మందగించిందని.. బిజినెస్, వర్క్ వీసాల విషయంలో అన్ని దేశాల్లోనూ నిరీక్షణ కాలం ఎక్కువగానే ఉందని ఆయన గురువారం 'ఫేస్‌బుక్'లో నిర్వహించిన లైవ్ కార్యక్రమంలో స్పష్టం చేశారు. అయితే ఇప్పుడిప్పుడే పరిస్థితి చక్కబడుతోందని, కరోనా కాలంలో సిబ్బంది సగం మంది మాత్రమే ఉంటే ఇప్పుడు అది 70 శాతానికి పెరిగిందని వివరించారు. కరోనా ముందు నాటి స్థితికి చేరుకునేందుకు ఇంకో ఏడాది అవసరమన్నారు. బిజినెస్, వర్క్ వీసాల జారీకి సమయం పడుతున్నా... ఈ ఏడాది విద్యార్థి వీసాల జారీలో రికార్డు సృష్టించామని చెప్పారు. ఈ ఏడాది మొత్తం 82 వేల వీసాలు భారతీయ విద్యార్థులకు జారీ చేశామన్నారు.

మహానది టు కావేరి వయా గోదావరి

సాక్షి, అమరావతి: మహానది–గోదావరి–కృష్ణా–పెన్నా–కావేరి నదుల అనుసంధానం ద్వారా 477 టీఎంసీలను వినియోగించుకోవచ్చని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) కేంద్రానికి ప్రతిపాదించింది. మహానది నుంచి 230 టీఎంసీలు, గోదావరి నుంచి 247 టీఎంసీలను తరలించడం ద్వారా ఏపీ, తెలంగాణ, తమిళనాడుల్లో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో సాగు, తాగునీరు సరఫరా చేయవచ్చని పేర్కొంది. అనుసంధానంపై ఏకాభిప్రాయానికి ఆ నదుల పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ త్వరలోనే రాష్ట్రాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు.

మహానది – గోదావరి అనుసంధానం ఇలా..

ఒడిశాలో బర్మూర్ నుంచి 408 టీఎంసీల మహానది జలాలను గోదావరికి మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఇందులో 178 టీఎంసీలను ఒడిశా చేపట్టిన 5 ప్రాజెక్టులకు కేటాయించింది. మిగతా నీటిని ధవళేశ్వరం బ్యారేజీకి ఎగువన గోదావరిలోకి తరలిస్తారు.

అనుసంధానం ఇలా..

జూన్–అక్టోబర్ మధ్య ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా(నాగార్జునసాగర్), పెన్నా (సోమశిల), కావేరి (గ్రాండ్ ఆనకట్ట)కి తరలించడం ద్వారా గోదావరి–కావేరిలను అనుసంధానించేలా ఎన్‌డబ్ల్యూడీఏ గతేడాది ఏప్రిల్‌లో డీపీఆర్‌ను సిద్ధం చేసింది. దీనిపై ఆ నదుల పరిధిలోని రాష్ట్రాలతో కేంద్రం సంప్రదిస్తోంది. ఈ 247 టీఎంసీల గోదావరి జలాలకు మహానది నుంచి గోదావరిలోకి వచ్చిన 230 టీఎంసీలను జతచేసి 477 టీఎంసీలను మహానది–గోదావరి–కృష్ణా–పెన్నా–కావేరి అనుసంధానం ద్వారా తరలించాలని ప్రతిపాదించింది.

నేడు యాదాద్రికి తెలంగాణ సీఎం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీఎం కేసీఆర్ శుక్రవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఉ.10.30 గంటలకు ప్రగతిభవన్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు యాదాద్రి ఆలయానికి చేరుకోనున్నారు. ఆలయంలో కుటుంబసమేతంగా పూజలు నిర్వహించడంతోపాటు కిలో బంగారాన్ని కానుకగా సమర్పించి మొక్కు తీర్చుకోనున్నారు.

బ్లాక్‌స్పాట్లకు చెక్



రాష్ట్రంలో 300 బ్లాక్ స్పాట్ల గుర్తింపు
- అక్కడే మూడేళ్లలో 5,708 మంది మృతి
- ఆ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు కార్యాచరణ
- ఏటా రూ.400 కోట్లతో రహదారి భద్రత కమిటీ ప్రణాళిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారి భద్రత దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న ప్రమాదకర మలుపుల వద్ద రహదారి భద్రత చర్యలను చేపట్టాలని నిర్ణయించింది. అందు కోసం రాష్ట్ర రహదారి భద్రత కమిటీ సర్వే నిర్వహించింది. అత్యధికంగా ప్రమాదాలు జరుగుతుండటంతోపాటు ఎక్కువమంది దుర్మరణం చెందుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించింది. అటువంటి బ్లాక్‌స్పాట్లు రాష్ట్రంలో 300 ఉన్నాయని ఆ సర్వేలో వెల్లడైంది. గత మూడేళ్లలో ఆ బ్లాక్ స్పాట్లలో ఏకంగా 5,708 మంది దుర్మరణం చెందారని గుర్తించింది. దీంతో ఆ బ్లాక్‌స్పాట్ల వద్ద ఏటా రూ.400 కోట్లతో భద్రతాపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించింది.

గుంటూరు జిల్లాలో ఎక్కువ బ్లాక్‌స్పాట్‌లు

రాష్ట్రంలో రహదారి భద్రత కోసం ప్రభుత్వం పోలీసు, రవాణా, వైద్య–ఆరోగ్య శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై ఈ కమిటీ సర్వే చేసింది. రాష్ట్రంలో 26 జిల్లాలకుగాను 23 జిల్లాల పరిధిలో ఉన్న ఈ 300 బ్లాక్‌స్పాట్లలో మూడేళ్లలో 5,708 మంది ప్రాణాలు కోల్పోయారు. వీటిలో అత్యధికంగా గుంటూరు జిల్లాలోని 15 బ్లాక్‌స్పాట్ల వద్ద రోడ్డు ప్రమాదాల్లో ఏకంగా 1,383 మంది దుర్మరణం చెందారు. ఆ జాబితాలో రెండు, మూడు స్థానాల్లో బాపట్ల, తిరుపతి జిల్లాలు ఉన్నాయి. బాపట్లలో 15 బ్లాక్‌స్పాట్ల వద్ద 328 మంది మృతిచెందగా, తిరుపతి జిల్లాలో 15 బ్లాక్‌స్పాట్లలో 282 మంది మృత్యువాత పడ్డారు.

బ్లాక్‌స్పాట్ల వివరాలు డీఆర్‌సీలకు..

బ్లాక్‌స్పాట్ల వద్ద రూ.400 కోట్లతో అమలు చేయనున్న రహదారి భద్రత చర్యల్లో భాగంగా ఆ ప్రాంతాల్లో సైన్ బోర్డులు, స్పీడ్‌గన్లు ఏర్పాటు చేయడం, ప్రత్యేక అధికారులు బృందాలతో వాహనాల తనిఖీ చేపట్టడం, అంబులెన్స్‌ల ఏర్పాటు, ఆ సమీపంలోని ఆస్పత్రుల్లో వసతులను మెరుగుపరచడం వంటివి చేపడతారు. రహదారి భద్రత కమిటీ బ్లాక్ స్పాట్ల వివరాలను ఆయా జిల్లా అభివృద్ధి మండళ్లకు(డీఆర్‌సీలకు) సమర్పించింది. ఈ ప్రదేశాల్లో చేపట్టాల్సిన పనులను జిల్లా భద్రత కమిటీల ఆధ్వర్యంలో చేపడతారు. బ్లాక్‌స్పాట్ల వద్ద భద్రత చర్యలను మెరుగుపరిచిన ఏడాది తరువాత పరిస్థితి సమీక్షిస్తారు. రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గిందీ లేనిదీ పరిశీలిస్తారు. తదనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తారు. ఈ విధంగా ఐదేళ్లపాటు బ్లాక్‌స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సంబరంలా వైఎస్సార్ చేయూత

- చేయూత సభలకు వెల్లువెత్తిన మహిళలు
- చెక్కులు అందజేసిన మంత్రులు
- సోదరునిలా మహిళలకు సీఎం జగన్ మేలు: డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు
- అభివృద్ధి అంటే చంద్రబాబు, రామోజీ బాగుపడటం కాదు: మంత్రి రాజా
- రాష్ట్రమంతా సమానాభివృద్ధిని కాంక్షిస్తున్న సీఎం: మంత్రి రమేష్
- జగనన్న రియల్ హీరో: మంత్రి రోజా


అమలాపురంలో వైఎస్సార్ చేయూత సభను ప్రారంభిస్తున్న మంత్రి రమేష్



కె.కోటపాడు సభకు హాజరైన లబ్ధిదారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


ఎస్.అన్నవరంలో చెక్కు అందజేస్తున్న మంత్రి దాడిశెట్టి, ఎంపీ గీత


పశ్చిమగోదావరి జిల్లాలో చెక్కు అందజేస్తున్న మంత్రులు రోజా, చెల్లుబోయిన

సాక్షి నెట్‌వర్క్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకం కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా సంబరంగా జరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంత్రులు ఈ పథకం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలకు మహిళలు వెల్లువలా తరలి వచ్చారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడులో జరిగిన సభలో డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి 4,885 మందికి రూ.9.15 కోట్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మహిళలకు సొంత సోదరునిలా మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

కాకినాడ జిల్లా ఎస్.అన్నవరం వద్ద జరిగిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీతతో కలిసి మంత్రి దాడిశెట్టి రాజా రూ.9.89 కోట్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల గుండెల్లో సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ సుస్థిరంగా ఉండిపోతారని మంత్రి రాజా చెప్పారు. అభివృద్ధి అంటే చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ, ఎల్లో మీడియా బాగు పడడం కాదని, రాష్ట్రంలో ప్రజలందరూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడమని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన వైఎస్సార్ చేయూత సంబరాల సభలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ 13,989 మంది లబ్ధిదారులకు రూ.25.28 కోట్లు అందజేశారు. సీఎం జగన్ మూడు రాజధానులతో రాష్ట్రమంతా సమాంతర అభివృద్ధిని కాంక్షిస్తుంటే.. చంద్రబాబు మాత్రం అమరావతే రాజధాని అంటూ తన కులం, కుటుంబీకులు, బంధువుల లబ్ధి కోసం ఆరాటపడుతున్నారని మంత్రి రమేష్ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం మేడపాడులో జరిగిన సభలో మంత్రి ఆర్కే రోజా పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన 11,530 మందికి రూ.21.69 కోట్లు పంపిణీ చేశారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు గెలిచేది లేదని, జగనన్న తగ్గేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను ఘనంగా సత్కరించారు.

యూనిఫాం పోస్టుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వయో పరిమితి పెంపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా నేరుగా రిక్రూట్ చేసే యూనిఫాం పోస్టుల గరిష్ట వయో పరిమితిని రెండేళ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో రెండేళ్లపాటు వయోపరిమితి పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వుల గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో రెండేళ్లు గరిష్ట వయో పరిమితిని ఏడాది పాటు పెంచుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ గురువారం ఉత్తర్వులిచ్చారు. అంటే వచ్చే ఏడాది సెప్టెంబర్ నెలాఖరు వరకు వయోపరిమితి రెండేళ్ల పెంపు వర్తిస్తుంది. అటవీ, ఎక్సైజ్, అగ్నిమాపక, జైళ్లు, రవాణా శాఖల్లో యూనిఫాం పోస్టుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు ఈ వయోపరిమితి పెంపు వర్తించనుంది. ప్రస్తుతం యూనిఫాం పోస్టుల భర్తీకి ఓసీలకు గరిష్ట వయోపరిమితి 24 ఏళ్లుండగా, ఇప్పుడు 26కు పెరుగుతుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 26 ఏళ్లుండగా, అదనంగా మరో ఐదేళ్లు పెరుగుతుంది.. అంటే వీరికి గరిష్ట వయోపరిమితి 31 ఏళ్ల వరకూ ఉంటుంది.

ఒడిశాతో చర్చించండి

సరిహద్దు గ్రామాల సమస్యపై సీఎం జగన్‌కు సీపీఎం నేత మధు లేఖ

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా మందస మండల పరిధిలోని గ్రామాల ప్రజలకు సరిహద్దు సమస్యను పరిష్కరించేలా ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరపాలని సీఎం జగన్‌కు సీపీఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ పెనుమల్లి మధు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను మధు గురువారం మీడియాకు విడుదల చేశారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని కొన్ని గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఒడిశాతో సరిహద్దు సమస్యల వల్ల వారు పడుతున్న ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో మాణిక్యపట్నం, చీపి, సాబకోట, బుడార్సింగి తదితర గ్రామ పంచాయతీల్లోని అనేక గ్రామాల ప్రజలను ఒడిశా అధికారులు వేధిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సరిహద్దుల పేరిట ఒడిశా అధికారులు అభివృద్ధి పనులనూ అడ్డుకొన్నారని మధు వివరించారు. వీరి ఇబ్బందులకు పరిష్కారం చూపాలని కోరారు.

మోదీ ఫొటోను చెప్పలతో కొట్టించింది మర్చిపోం

చంద్రబాబుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము మండిపాటు


మాట్లాడుతున్న బీజేపీ నేత సోము వీర్రాజు

విజయనగరం గంటస్తంభం: టీడీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసినా.. చంద్రబాబు ప్రధాని మోదీ ఫొటోను గాడిదకు తగిలించి ఎమ్మెల్యేలతో చెప్పులతో కొట్టించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు గుర్తు చేశారు. వాటన్నింటినీ బీజేపీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా విజయనగరంలో గురువారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ వల్లే విశాఖ రైల్వేజోన్ సాకారమవుతోందన్నారు. ప్రధానులను మార్చానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. రైల్వే జోన్ ఎందుకు తేలేకపోయారని ప్రశ్నించారు. చంద్రబాబు తీరుతోనే రాష్ట్రం అనుకున్నంత అభివృద్ధి చెందలేదని విమర్శించారు. రాజధానికి ఇచ్చిన దాదాపు రూ.7 వేల కోట్లను సింగపూర్, చైనా ప్లాన్లు అంటూ మాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అమలవుతున్న అనేక పథకాలకు కేంద్రమే నిధులిస్తోందని చెప్పారు. ప్రధాని మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని.. ఆయన్ని చూసి ప్రపంచ దేశాలు కూడా భయపడుతున్నాయన్నారు. సభలో బీజేపీ నాయకులు తీగల హరినాథ్, పావని తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ ఎండీగా భరత్ గుప్తా బాధ్యతలు స్వీకరణ


జవ్వాది సుబ్రమణ్యం నుంచి బాధ్యతలు తీసుకుంటున్న డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలికవసతుల సంస్థ (ఏపీఐఐసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఇప్పటివరకు వీసీ ఎండీగా ఉన్న జవ్వాది సుబ్రమణ్యం నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అసోం ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన సుబ్రమణ్యంకు డిప్యుటేషన్ పూర్తి కావడంతో ఆయనను మాతృ సంస్థకు బదిలీ చేసి ఆ పోస్టులో ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న భరత్ గుప్తాను నియమిస్తూ సీఎస్ సమీర్ శర్మ ఉత్తర్వులిచ్చారు.

ఏపీ ఈడీబీ సీఈవోగా కరికాల వలవన్

ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సీఈవోగా పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా ఏపీఐఐసీ వీసీ, ఎండీ, ఏపీ ఈడీబీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన సుబ్రమణ్యం జవ్వాదిని కరికాల ప్రశంసించారు.

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

- అయినా ఎల్లో మీడియా విషపు రాతలు
- వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం అధ్యక్షుడు హనుమంత్‌నాయక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ తెలిపారు. తాడేపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎల్లో మీడియా విషపు రాతలు రాస్తోందంటూ మండిపడ్డారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. రోజూ ప్రత్యేక మెనూ అమలు చేయడంతో పాటు టీవీ, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. గురుకులాల విద్య(అకడమిక్) వ్యవహారాల పర్యవేక్షణను పాఠశాల విద్య (స్కూల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి తేవాలని నిర్ణయించడంతో పాటు జీవోలు జారీ చేసిన అంశం ఎల్లో మీడియాకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో పటిష్ట పర్యవేక్షణ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ), ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని, గురుకుల పాఠశాలలు, వెల్ఫేర్ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, భోజనం నాణ్యత, నిర్వహణ తదితర అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రత్యేకంగా రెండో ఎంఈవోను నియమించి గురుకుల పాఠశాలల పట్ల, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హాస్టల్ విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని హనుమంత్‌నాయక్ వివరించారు.

'డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్'కు

ఏపీ నుంచి మూడు జిల్లాల ఎంపిక

- ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 75 జిల్లాల ఎంపిక
- రాష్ట్రంలో విశాఖ, తూర్పు, గుంటూరు జిల్లాలకు స్థానం
- ప్రతి జిల్లాలో రూ.40 కోట్లతో ఎక్స్‌పోర్ట్ హబ్ ఏర్పాటు
- ఒక్కో జిల్లా నుంచి మూడు ఉత్పత్తులు ఎంపిక చేసి పంపిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఎగుమతులను పెంచడం ద్వారా తయారీ రంగాన్ని ప్రోత్సహించి, ఉద్యోగ కల్పనను మెరుగుపరచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్ పథకం కింద రాష్ట్రం నుంచి మూడు జిల్లాలు ఎంపికయ్యాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 75 జిల్లాలను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖపట్నం, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాలు ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ (వాణిజ్యం, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్) జీఎస్ రావు తెలిపారు. ఇప్పటికే ఈ జిల్లాలకు చెందిన ఎగుమతుల ప్రోత్సాహక కార్యాచరణ ప్రణాళికను పంపగా, దానిని పరిశీలించి కేంద్రం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ పథకానికి ఎంపికైన తర్వాత మళ్లీ జిల్లాకు మూడు ఉత్పత్తులు చొప్పున మొత్తం తొమ్మిది ఉత్పత్తులను ఎంపిక చేసి పంపామని, వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేయాల్సి ఉందన్నారు. విశాఖ జిల్లా నుంచి ఎగుమతులను పెంచడానికి అవకాశం ఉన్న ఆరోగ్య ఉపకరణాలు, సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ ఉత్పత్తులను, తూర్పుగోదావరి నుంచి కొబ్బరి పీచు ఆధారిత ఉత్పత్తులు, జీడిపప్పు, నర్సరీ ఉత్పత్తులు, గుంటూరు జిల్లా నుంచి పత్తి, మిరప, ఎండుమిర్చిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపిక చేసిన ఉత్పత్తుల ఎగుమతులను ఏటా 10 శాతం పెంచాలన్నది డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్స్ లక్ష్యం. ఇందుకోసం ప్రతి జిల్లాలో ఎగుమతులను ప్రోత్సహించేలా రూ.40 కోట్లతో ఎక్స్‌పోర్ట్ హబ్స్‌ను అభివృద్ధి చేస్తారు. ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇస్తుంది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఈ మూడు జిల్లాలే కాకుండా రాష్ట్రంలోని మిగిలిన 23 జిల్లాలకు సంబంధించి ఉత్పత్తులను ఎంపిక చేసి ఎగుమతులను ప్రోత్సహించే విధంగా జిల్లా ఎక్స్‌పోర్ట్ పాలసీలను రూపొందిస్తున్నట్లు జీఎస్ రావు తెలిపారు.

స్మార్ట్ మీటర్లతో నాణ్యమైన విద్యుత్

- రైతులకు ఎలాంటి నష్టం లేదు
- శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- విపక్షాలు శ్రీకాకుళంలో పర్యటించి.. ఆ తర్వాత మాట్లాడాలి
- వచ్చే మార్చికి నూరు శాతం వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను ఎలాంటి అంతరాయాలు లేకుండా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. స్మార్ట్ మీటర్లతో రైతులకు ఎలాంటి నష్టం కలగదన్నారు. ఇంధన శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లలో 41 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేశామన్నారు. త్వరలో మరో 77 వేల కొత్త కనెక్షన్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించిన భారాన్ని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత కూడా ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి.. పరిశీలించినట్లు తెలిపారు. ఈ జిల్లాలో సాధారణంగా ఉచిత విద్యుత్ వినియోగానికి ప్రభుత్వం చెల్లిస్తున్న మొత్తం కన్నా.. 30 శాతం తక్కువగానే రైతులు వినియోగిస్తున్నట్లు తేలిందన్నారు. 2023 మార్చి నాటికి రాష్ట్రంలోని 18 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు డీబీటీ ఖాతాలు తెరిచేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 70 శాతానికి పైగా రైతులు బ్యాంకు ఖాతాలను తెరిచారని.. అక్టోబర్ 15 నాటికి నూరు శాతం పూర్తవుతుందన్నారు. పోస్టాఫీస్‌లలో కూడా రైతులు ఖాతాలు తెరవచ్చన్నారు.

రైతుల్లో అపోహలు సృష్టిస్తున్నారు..

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై విపక్షాలు రైతుల్లో అపోహలు సృష్టిస్తున్నాయని మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఆయన తోక పార్టీలైన జనసేన, వామపక్షాలు రాజకీయ స్వార్థంతో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి చేతులు, వేళ్లు నరకాలని పిలుపునిస్తున్న విపక్ష నేతలు.. తమ చేతులనే నరుక్కుంటున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టం జరుగుతుందంటున్న విపక్ష నేతలు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించి.. అక్కడి రైతులతో మాట్లాడాలని హితవు పలికారు. స్మార్ట్‌మీటర్ల వల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. రైతులు తమ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసే సబ్సిడీ మొత్తాన్ని వారే స్వయంగా డిస్కంలకు చెల్లించడం ద్వారా నాణ్యమైన విద్యుత్‌పై ప్రశ్నించే హక్కును పొందుతారన్నారు.

సీఎంఏ ఫలితాల్లో 'మాస్టర్‌మైండ్స్' ప్రతిభ


ర్యాంకర్లతో మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మంగళవారం ప్రకటించిన సీఎంఏ ఇంటర్, ఫైనల్ పరీక్ష ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో ప్రభంజనం సృష్టించారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎంఏ ఇంటర్‌లో ప్రకటించిన మొదటి 50 ర్యాంకుల్లో అఖిల భారతస్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 86 మంది ఉన్నారని చెప్పారు. సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో ప్రకటించిన మొదటి 50 ర్యాంకుల్లో అఖిల భారతస్థాయిలో 2వ ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 31 మంది ఉన్నారని వివరించారు. సీఎంఏ ఫలితాల్లో సమానమైన మార్కులు వచ్చిన విద్యార్థులు ఉన్న పక్షంలో ఒకే ర్యాంకును ఇద్దరు, ముగ్గురు విద్యార్థులకు సైతం ప్రకటిస్తారని వివరించారు. సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో మొదటి 10 ర్యాంకుల్లో ఎనిమిది ర్యాంకులు కైవసం చేసుకున్న ఏకైక విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ అని తెలిపారు.

పరమపవిత్రం.. మలయప్ప ప్రసాదం

తిరుమల: కలియుగ వైకుంఠనాథుడైన శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదాల్లో ఎవరికైనా ముందు గుర్తొచ్చేది లడ్డూ మాత్రమే. అయితే స్వామికి లడ్డూతో పాటు వివిధరకాల నైవేద్యాలు సమర్పిస్తుంటారు. పూటకొకటి చొప్పున స్వామికి నివేదించే ప్రసాదాలున్నాయి. కనీస సౌకర్యాల్లేని రోజుల్లో ఈ అన్నప్రసాదాలే భక్తులు, స్థానికుల ఆకలి తీర్చాయి. తొలుత బూందీ, 82 ఏళ్లుగా లడ్డూ మాధుర్యం భక్తులకు అందుతున్నాయి.

- పల్లవుల కాలం నుంచే ప్రసాదాల పరంపర కొనసాగుతోంది. తిరుమల ఆలయంలో క్రీ.శ.830 నుంచే ప్రసాదాలు మొదలయ్యాయి.
- రెండో దేవరాయలు కాలం నుంచి ప్రసాదాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అప్పట్లో మంత్రిగా పనిచేసిన శేఖర మల్లన్న ఆలయ ప్రసాదాల కోసమే అనేక దానాలు చేశారు.
- అప్పట్లోనే శ్రీవారికి 'సంధి నివేదనలు' ఖరారయ్యాయి. ఈ సమయాల్లోనే భక్తులకు ప్రసాదాలు పంచేవారు. భక్తులకు అందజేసే ప్రసాదాన్ని 'తిరుప్పొంగం' అనేవారు. తర్వాత క్రీ.శ.1445లో సుఖీయం, 1455లో అప్పం, 1460లో వడ, 1468లో అత్తిరసం, 1547లో మనోహరపడి ప్రసాదాలను ప్రవేశపెట్టారు.



మీకో విషయం తెలుసా!

పుస్తకాలు కొనడం మంచి విషయం. అలా కొన్న పుస్తకాలను చదవడం మరీ మంచి విషయం. అదేమిటీ చదవడానికే కదా పుస్తకాలు కొనేది... అనుకుంటున్నారా! కొందరికి విపరీతంగా పుస్తకాలు కొనే అలవాటు ఉంటుంది. కాని పొరపాటున కూడా వాటిని చదవరు. చదవకూడదని కాదు. ఏవో కారణాల వల్ల ఇంట్లో అన్నీ చదవని పుస్తకాలే ఉంటాయి. ఈ ధోరణిని జపనీస్‌లో 'సండోకు' అని పిలుస్తారు. ఇది జపాన్‌లోని మైజీ శకానికి చెందిన పదం. మీరు సండోక్ బ్యాచ్‌లోకి రాకుండా ఉండాలంటే ఎప్పటి పుస్తకాలు అప్పుడే చదివేయండి.

● ఆర్ట్ అండ్ కల్చర్

ఎలుక అనుకొని మౌస్ మింగేసింది

రష్యన్ కార్టూనిస్ట్ ఆంద్రూ కిల్‌మోవ్ గీసిన కార్టూన్ ఇది. వేడి వేడి రాజకీయ కార్టూన్‌లు గీయడంలో ప్రసిద్ధుడైన కిల్‌మోవ్ అప్పుడప్పుడూ ఇలాంటి రాజకీయేతర కార్టూన్‌లు కూడా గీసి నవ్విస్తుంటాడు. 'అజర్‌కాంట్' పేరుతో సైన్స్-ఫిక్షన్ షార్ట్ యానిమెటెడ్ ఫిల్మ్ తీసి శభాష్ అనిపించుకున్నాడు. 'మీకు ఐడియాలు ఎలా వస్తుంటాయి?' అని కుర్రకారు కిల్‌మోవ్‌ను అడుగుతుంటారు. 'ఐడియా కోసం ఎక్కడికో వెళ్లనక్కర్లేదు. టైమ్ వస్తే అదే మనల్ని వెదుక్కుంటూ వస్తుంది' అని హాయిగా నవ్వుతాడు మోవ్. అంతేకదా మరి!



నైట్ ఇన్ షైనింగ్ ఆర్మర్

ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిని ముఖ్యంగా అమ్మాయిని రక్షించే సందర్భంలో ఉపయోగించే ఇడియమ్ ఇది.

ఉదా: ఐ వాజ్ ఫేసింగ్ ఏ రియల్లీ బ్యాడ్ టైమ్ బిఫోర్ ఐ మెట్ వెంకీ. హీ కేమ్ ఎలాంగ్ అండ్ మేడ్ ఎవ్రీ థింగ్ బెటర్. హీ వాజ్ మై నైట్ ఇన్ షైనింగ్ ఆర్మర్.

ENGLISH ఇడియమ్స్



ఆపదలో ఉన్న అమ్మాయిని రక్షించడానికి తన కవచం మెరుస్తుండగా ఒక యోధుడు గుర్రం మీద ప్రత్యక్షమయ్యే దృశ్యాలు జానపద కథల్లో ఉంటాయి. దీని నుంచి పుట్టిన ఇడియమ్ ఇది. అచ్చులో తొలిసారిగా 1790లో బ్రిటీష్ జర్నల్ 'మంత్లీ రివ్యూ'లోని ఒక కవితలో కనిపించింది. ఈ ఇడియమ్ ఫాంటసీకి సంబంధించిందే అయినప్పటికీ ఆధునిక కాలంలో 'నా కష్టాలు తీర్చిన యోధుడు' అనే అర్థంలో వాడుతున్నారు. knight అనేది బ్రిటీష్ రాజు లేదా రాణి ఒకరి ధైర్యసాహసాలకు మెచ్చి ఇచ్చే గౌరవప్రదమైన ర్యాంక్.

గ్రీన్ ప్లానెట్

మరో ప్రపంచం వెలుగులో...



సిద్ధార్థ జయరామ్, అనిరుధ్ గుప్తా



'కర్బన తటస్థత' 'కర్బనరహితం' గురించి మాట్లాడటానికి 'కాప్26' మాత్రమే వేదిక కానక్కర్లేదు. మన ఇల్లు కూడా అందుకు వేదిక కావచ్చు. పర్యావరణ అనుకూల జీవనశైలికి వ్యవస్థాగత ప్రయత్నాలే కాదు, వ్యక్తిగత స్థాయిలో జరిగే ప్రయత్నాలు కూడా ముఖ్యం అని నమ్ముతుంది క్లైమెస్...

'ఇచట ఉంది...అచట లేదు' అని కాకుండా ఎక్కడ చూసినా కర్బన ఉద్గారాలు కలవరపరుస్తూనే ఉన్నాయి. కర్బన ఉద్గారాలు అనే మాట వినబడగానే పెద్ద పెద్ద పరిశ్రమలు మాత్రమే మనకు గుర్తుకు వస్తాయి. అయితే మెయిల్, మెసేజ్‌లు పంపడం, ఫోటోలు డౌన్‌లోడ్ చేసుకోవడం, ఆన్‌లైన్ షాపింగ్ నుంచి విమాన ప్రయాణం వరకు వివిధ రూపాల్లో కర్బన ఉద్గారాలు వెలువడడానికి మనం ఏదో రకంగా కారణం అవుతున్నాం.

ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో 3.7 శాతం వాటా ఇంటర్నెట్, వివిధ రకాల గ్యాడ్జెట్‌లదే. విమానల నుంచి వెలుబడే ఉద్గారాలకు ఇది సమానం!

ఈ నేపథ్యంలో బెంగళూరు, ఢిల్లీ కేంద్రంగా సిద్ధార్థ జయరామ్, అనిరుధ్ గుప్తాలు క్లైమెట్ యాక్షన్ ఫైనాన్స్ అండ్ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్ క్లైమెస్ మొదలుపెట్టారు.

యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పొలిటికల్ ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసిన అనిరుధ్ గుప్తా ఒక స్వచ్ఛందసంస్థను మొదలుపెట్టాడు. ఆ తరువాత జయరామ్‌తో కలిసి 'క్లైమెస్'కు శ్రీకారం చుట్టాడు. జయరామ్ ఇండస్ట్రీయల్ ఇంజనీరింగ్ చేశాడు.

హోటల్లో కప్పు కాఫీ తాగడం నుంచి విమాన ప్రయాణం వరకు వివిధ కారణాల వల్ల వెలువడే కర్బన ఉద్గారాల గురించి అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తుంది క్లైమెస్. 'క్యాలిక్‌లెట్, ట్రాక్ అండ్ రెడ్యూస్' అనే నినాదంతో కర్బనరహిత విధానాల ఆచరణపై అవగాహన కలిగిస్తుంది.

రిలయన్స్‌తో సహా దేశంలోని పెద్ద పెద్ద సంస్థలు నిర్దిష్టమైన కాలవ్యవధితో శూన్య ఉద్గారాల స్థాయికి చేరాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేస్తున్నాయి.

2070 నాటికి జీరో ఉద్గారాల స్థాయికి చేరుకోవాలనేది మన దేశ లక్ష్యం. అది విజయవంతం కావాలంటే వ్యవస్థగతంగానే కాదు, వ్యక్తిగతంగా కూడా కార్యాచరణ కావాలి. దీనికి క్లైమెస్ నిర్మాణాత్మక రూపాన్ని ఇస్తుంది.

'తెల్లారి లేచింది మొదలు ఏదో ఒక సమయంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ప్రభావం గురించి ఆందోళన పడుతుంటాం. మనిషి మనుగడ, కర్బన ఉద్గారాలు అవిభాజ్యం అని కూడా అనిపిస్తుంటుంది. కాని ఇది నిజం కాదు. కర్బన తటస్థత, కర్బనరహిత వ్యవస్థ సాధ్యమే. అది జటిలమైన ప్రక్రియ కాదు. కాఫీ తాగినంత సులువు' అంటోంది క్లైమెస్.

ప్రస్తుతం ఎనిమిది బ్రాండ్లతో మాత్రమే కలిసి పనిచేస్తున్న 'క్లైమెస్' ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. అయితే దానికి బలమైన భవిష్యత్ ప్రణాళిక ఉంది.

'రాబోయే నెలల్లో కొన్ని బ్రాండ్ల నుంచి ఎన్నో బ్రాండ్లకు విస్తరిస్తాం' అనే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాడు జయరామ్.

'క్లైమెట్-పాజిటివ్ ఫీచర్స్‌తో సులభంగా యాక్సెస్ అయ్యే సౌకర్యం, పారదర్శకత,ఆర్థిక భారం లేకుండా ఉంటే ప్రజలు మనకు మద్దతు ఇస్తారు' అంటున్నాడు అనిరుధ్.

రాబోయే కాలంలో మనకు ఎదురయ్యే అతి పెద్ద సవాలు వాతావరణంలో చోటు చేసుకొనే మార్పులు.

'మన వంతుగా ఏ ప్రయత్నం చేయకపోతే భవిష్యత్ మనకు బారే ప్రమాదం ఉంది' అని హెచ్చరిస్తున్నారు ఇద్దరు మిత్రులు.

వ్యక్తిగత స్థాయిలో మనం ఏంచేయగలం అని తెలుసుకోవడానికి 'క్లైమెస్' సైట్‌లోకి వెళితే ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. కొత్త దారి దొరుకుతుంది.

> హోటల్లో కప్పు కాఫీ తాగడం నుంచి విమాన ప్రయాణం వరకు వివిధ కారణాల వల్ల వెలువడే కర్బన ఉద్గారాల గురించి అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తుంది క్లైమెస్.

● టెక్..టాక్

వాట్సాప్‌లో హ్యాపీ దుర్గాపూజ 2022 స్టిక్కర్స్ పంపడానికి...

● వాట్సాప్‌లో చాట్‌బాక్స్ ఓపెన్ చేయాలి ● స్మైలీ ఐకాన్ నొక్కాలి ● స్టిక్కర్ ఐకాన్‌ను ట్యాప్ చేయాలి ● స్టిక్కర్ ప్యానల్‌లో ప్లస్ సైన్ క్లిక్ చేయాలి ● బాటమ్‌లో ఉన్న 'గెట్ మోర్ స్టిక్కర్' ఆప్షన్ నొక్కాలి ● స్టిక్కర్ ప్యాక్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● మై స్టిక్కర్స్ ట్యాబ్‌లో అన్ని స్టిక్కర్స్ చూడవచ్చు. వీటిలో మీకు నచ్చిన స్టిక్కర్‌ను సెలెక్ట్ చేసుకొని షేర్ చేయవచ్చు.

ఆసుస్ వివో బుక్ 14

ఆసుస్ వివోబుక్ 14 టచ్ ల్యాప్‌టాప్ ఇండియాలో విడుదలైంది. కొన్ని వివరాలు...

● డిస్‌ప్లే: 14 అంగుళాలు ● బరువు: 1.4 కేజీలు ● 16జీబి ర్యామ్ ● 512 జీబి ఎస్‌ఎస్‌డీ స్టోరేజ్ ● 42 వాట్-హవర్ (డబ్ల్యూ హెచ్) బ్యాటరీ ● 65 డబ్ల్యూ క్విక్ ఛార్జింగ్ సపోర్ట్ ● ఫింగర్ ప్రింట్ స్కానర్ ● 3.5 ఆడియో జాక్ ● కలర్స్: బ్లూ, సిల్వర్ ● ప్రారంభ ధర: రూ.49.990

క్రోమ్‌లో ఇలా...

ఏదైనా వెబ్‌పేజీలో ఆసక్తికరమైన భాగం లేదా వాక్యాలను ఇతరులకు షేర్ చేయడానికి గూగుల్ క్రోమ్‌లో ఆప్షన్ ఉంది. షేర్ చేయాలనుకుంటున్న టెక్ట్స్‌ని సెలెక్ట్ చేసుకొని, కుడి వైపు నొక్కాలి. మెను నుంచి 'కాపీ లింక్ టు హైలెట్' సెలెక్ట్ చేసుకోవాలి. లింక్ క్లిప్‌బోర్డ్‌కి కాపీ అవుతుంది. ఇప్పుడు దీన్ని షేర్ చేసుకోవచ్చు.



● గేమింగ్

నా దారి... ఎడారి



బిగ్గెస్ట్ ఓపెన్-వరల్డ్ రేసింగ్ గేమ్స్‌లో ఒకటైన 'డాకర్ డిజర్ట్ ర్యాలీ' అక్టోబర్ 4న విడుదల కాబోతుంది. ఫోర్జ హరైజన్ సిరీస్‌కు ధీటుగా, డిఫరెంట్ కాన్సెప్ట్‌తో డెలపర్స్ దీన్ని రూపొందించారు. ట్రక్కులు, మోటర్ సైకిల్స్, కార్లు, క్వోడ్స్... మొదలైన వెహికిల్ ఆప్షన్స్ ఉన్నాయి. లైసెన్స్‌డ్ పైలట్ బృందాలు, తీర్చిదిద్దిన స్టీరింగ్ వీల్స్ ఈ ఆఫ్-రోడ్ ఆటలో కొత్త అనుభూతిని ఇస్తాయి. వర్షాలు, మంచు, ఇసుక తుఫాన్‌లు... రకరకాల వాతావరణ పరిస్థితులతో ఈ ఆట ప్లేయర్‌కు సవాలు విసురుతుంది. ట్రూ ర్యాలీ ఎక్స్‌పీరియన్స్ కోసం ప్రొఫెషనల్ అండ్ సిమ్యులేషన్ మోడ్ అందుబాటులో ఉంది. వరల్డ్ వార్ జెడ్, స్నో రన్నర్, ఎవిల్ డెడ్... మొదలైన గేమ్స్‌తో సుపరిచితమైన అమెరికన్ గేమింగ్ కంపెనీ 'సేబర్ ఇంటరాక్టివ్' డాకర్ డిజర్ట్ ర్యాలీ రూపకర్త.

ప్లాట్‌ఫామ్: పీఎస్3, పీఎస్5, ఎక్స్‌బాక్స్‌వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా

అందుకు వెనకాడను - విష్ణు మంచు

''సినిమాను ప్యాషన్‌తోనే తీస్తాం. కానీ వ్యాపార కోణంలో కూడా ఆలోచించాలి. పంతానికి, సిల్లీనెస్‌లకు వెళ్లకూడదు. కరెక్ట్ తేదీ ఏది, ఎప్పుడు థియేటర్స్ ఎక్కువగా దొరుకుతాయనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. నిర్మాతలకు డబ్బులు రావాలని కోరుకుంటాను'' అని హీరో-నిర్మాత విష్ణు మంచు అన్నారు. విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'జిన్నా'. ఇందులో పాయల్ రాజ్‌పుత్, సన్నీ లియోన్ హీరోయిన్లు. ఈషాన్ సూర్య దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీలపై రూపొందిన చిత్రం ఇది. జి. నాగేశ్వర రెడ్డి మూల కథ అందించిన ఈ సినిమాకు స్క్రిప్ట్ అందించి, క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు ప్రముఖ రచయిత కోన వెంకట్. ఈ సినిమా ట్రైలర్‌ను అక్టోబరు 5న, చిత్రాన్ని అక్టోబరు 21న విడుదల చేస్తున్నట్లు గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో విష్ణు మంచు మాట్లాడుతూ – ''జిన్నా' సినిమా బాగా వచ్చింది. మంచి హిట్టవుతుంది. నా సినిమా విడుదలకు థియేటర్స్ సమస్య లేదు. ఒకవేళ ఏదైనా అన్యాయం జరిగితే మీడియా ముందుకు వచ్చి మాట్లాడటానికి వెనకాడను. 'జిన్నా'ని దసరాకి రిలీజ్ చేద్దామనుకోలేదు. అయినా దీపావళికి కూడా లాంగ్ వీకెండ్ ఉంది. ప్రస్తుతం వీఎఫ్‌ఎక్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ వర్క్స్ జరుగుతున్నాయి'' అని అన్నారు. ''విష్ణుగారి కెరీర్‌లో ఈ సినిమా ఓ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిపోతుంది. ఈ సినిమాకు నేను దర్శకత్వం వహించలేకపోయానని ఇప్పుడు బాధపడుతున్నాను. దర్శకుడిగా సూర్య బాగా తీశాడు. మహిళ, మాస్ ప్రేక్షకులే మోహన్‌బాబుగారి బలం. 'జిన్నా' సినిమా మహిళా ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది'' అన్నారు జి. నాగేశ్వర రెడ్డి. ''మోహన్‌బాబుగారి వంటి పెద్ద సంస్థలో పని చేస్తానని నేను ఊహించలేదు. అవకాశం ఇచ్చిన మంచు విష్ణు, మోహన్‌బాబుగార్లకు ధన్యవాదాలు'' అన్నారు ఈషాన్ సూర్య.



● ఈషాన్ సూర్య, విష్ణు మంచు, జి. నాగేశ్వర్ రెడ్డి

మంచు కుటుంబంపై వస్తున్న ట్రోల్స్ గురించి విష్ణు మంచు మాట్లాడుతూ – ''మాపై ట్రోల్స్‌కు సంబంధించి హైదరాబాద్ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాం. రెండు ఐపీ అడ్రస్‌లు మాకు వచ్చాయి. ఒకటి.. జూబ్లీ హిల్స్‌లో ఉన్న ఒక ఆఫీస్ అడ్రస్, రెండోది... చెక్‌పోస్ట్ దగ్గర ఇంకో ఆఫీస్ అడ్రస్. ఆన్‌లైన్ మీడియాని జీవితాన్ని బాగు చేసుకోవడానికి కూడా వినియోగించుకోవచ్చు. కానీ ఈ ఆన్‌లైన్ మీడియాను ఆయుధంగా చేసుకుని మాపై ట్రోల్స్ చేస్తున్నారు. నాపై ట్రోలింగ్ జరిగేందుకు ఓ పెయిడ్ బ్యాచ్ ఉంది. నన్ను ట్రోల్ చేసేందుకు నాపై ఇంత డబ్బులు ఎందుకు ఖర్చుపెడుతున్నారు? అనేది నాకు కామెడీగా అనిపిస్తోంది. ఓ 18 యూ ట్యూబ్ చానెల్స్‌పై కేసులు పెట్టాం. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎలక్షన్స్ సమయం నుంచే మాపై ట్రోలింగ్ కనిపిస్తోంది. లేదా మా సినిమా రిలీజ్‌కు ముందు. ఆ సమయాల్లో తప్పితే.. ఇంతకుముందు ఇలాంటివి వినలేదు. ఇదొక పైసా వసూల్ బ్యాచ్. దీన్ని ఎవరూ పట్టించుకోవద్దు. కానీ ప్రజలు తప్పుగా అర్థం చేసుకుంటున్నారన్న ఉద్దేశ్యంతో కోర్టును ఆశ్రయిస్తున్నాం. లేకపోతే వీరిని లెక్క చేయాల్సిన అవసరం లేదు. పేర్లు బయటకు వస్తే వారి పరువు పోతుంది'' అన్నారు.

శాకుంతలం వాయిదా

సమంత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, గుణ టీమ్ వర్క్స్ పతాకాలపై నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమాని నవంబర్ 4న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ఆ మధ్య ప్రకటించింది. అయితే 'శాకుంతలం'ని 3డీలో అందించాలనే నిర్ణయంతో సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం గురువారం అధికారికంగా ప్రకటించింది. ''శకుంతల, దుష్యంత మహారాజు మధ్య ఉన్న అజరామరమైన ప్రణయగాథ ఇది. భారీ స్థాయిలో, అత్యద్భుతంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయాలన్నదే మా లక్ష్యం. అందుకే ఇంతకు ముందు ప్రకటించిన తేదీకి మిమ్మల్ని థియేటర్లలో కలుసుకోలేకపోతున్నాం.. సరికొత్త విడుదల తేదీతో త్వరలో మిమ్మల్ని కలుసుకుంటాం'' అని చిత్ర యూనిట్ తెలియజేసింది. ఈ చిత్రంలో శకుంతలగా సమంత, దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించారు. డా. ఎం. మోహన్ బాబు, ప్రకాష్‌రాజ్, సచిన్ ఖేడేకర్, కబీర్ బేడీ, మధుబాల, గౌతమి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.



● సమంత

ఎన్నికల అధికారి



● అల్లరి నరేశ్

ఎలక్షన్ డ్యూటీకి 'అల్లరి' నరేశ్ అపాయింట్ అయ్యారు. 'అల్లరి' నరేశ్ హీరోగా ఏఆర్ మోహన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'. ఈ చిత్రంలో ఆనంది హీరోయిన్. జీ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మించిన సినిమా ఇది. ఈ సినిమాను నవంబరు 11న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''ఈ చిత్రంలో గిరిజన ప్రాంతమైన మారేడుమిల్లిలో ఎన్నికల విధులకు వచ్చిన ప్రభుత్వాధికారి పాత్రలో నటించారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: రాం రెడ్డి, సహనిర్మాత: బాలాజీ గుత్తా.

తెలుగువారికి గర్వకారణం - నిర్మాత శ్రావణ్ గౌడ్



● పైడి జయరాజ్ జయంతి వేడుకల్లో జైహింద్ గౌడ్, కవిత..

''మూకీల సమయంలోనే తెలంగాణ ప్రాంతం నుండి బాలీవుడ్‌కి వెళ్లి, హీరోగా నిలదొక్కుకున్న పైడి జయరాజ్‌గారి జీవితం నేటి తరాలకు స్ఫూర్తి'' అని నిర్మాత శ్రావణ్ గౌడ్ అన్నారు. బాలీవుడ్‌లో మొదటి తరం హీరోల్లో ఒకరిగా స్టార్ ఇమేజ్ అందుకున్నారు దివంగత తెలుగు నటుడు పైడి జయరాజ్. సెప్టెంబర్ 28న ఆయన 113వ జయంతి. ఈ సందర్భంగా 'సర్దార్ పాపన్న' హీరో పంజాల జైహింద్ గౌడ్ ఆధ్వర్యంలో పైడి జయరాజ్ జయంతి వేడుకలు జరిగాయి. ''కరీంనగర్‌కు పైడి జయరాజ్‌గారి పేరు ప్రకటించాలి.. అలాగే పైడి జయరాజ్ పేరుతో అవార్డ్స్ ఇవ్వాలి'' అన్నారు జైహింద్ గౌడ్.



● అల్లు శిరీష్ ● అను

ప్రేమ.. స్నేహం.. తేడా ఉంది

అల్లు శిరీష్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'ఊర్వశివో రాక్షసివో'. 'విజేత' ఫేమ్ రాకేష్ శశి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ సినిమా నవంబరు 4న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ప్రేమకి, స్నేహానికి ఉన్న తేడాను అంతర్లీనంగా రాకేష్ శశి చక్కగా ఆవిష్కరించారు. టీజర్‌లోని డైలాగ్స్, సీన్స్ యూత్‌కి బాగా కనెక్ట్ అవుతాయి'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజమణి, సహనిర్మాత: విజయ్ ఎం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు, కెమెరా: తన్వీర్.

భీమదేవరపల్లిలో...

సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్, అద్దంకి దయాకర్ నటించిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచిలో'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''ఇటీవల జరిగిన ఒక ఘటన దేశవ్యాప్తంగా సంచలనం అయ్యింది. ఆ ఘటన ప్రేరణతో ఈ సినిమాను స్లైస్ ఆఫ్ లైఫ్' జానర్‌లో నిర్మించాం. కథలో సహజత్వం పోకూడదని పలువురు థియేటర్ ఆర్టిస్టులని నటింపజేశారు దర్శకుడు'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కె.చిట్టి బాబు, సంగీతం: చరణ్ అర్జున్.



● లక్ష్మీనారాయణ

ఐదు రకాల ప్రేమ!



● విశ్వానంద్ పటార్

విశ్వానంద్ పటార్ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'లాట్స్ ఆఫ్ లవ్'. రాజేష్, నిహంత్, కిరణ్ ఈ చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణం. అనిత, ప్రఖ్యాత్‌ల సమర్పణలో విశ్వానంద్ పటార్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశ్వానంద్ మాట్లాడుతూ – ''ఈ సినిమాకు దర్శకత్వంతో పాటు కథ, మాటలు, మ్యూజిక్ కూడా నేనే అందించాను. ప్రేమలో విభిన్న రకాలు ఉన్నాయని ఈ సినిమాతో చెప్పాలనుకుంటున్నాను. ప్రొఫెషనల్ లవ్ (ఉద్యోగాన్ని ప్రేమించడం), ఫ్యామిలీ లవ్ (కుటుంబాన్ని ప్రేమించడం), డివైన లవ్ (అందర్నీ ప్రేమించడం), సెల్ఫ్ లవ్ (మనల్ని మనం ప్రేమించుకోవడం) ఇలా ఐదు రకాల ప్రేమలకు సంబంధించిన కథలను మా సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు.

పవర్‌ఫుల్ రోల్‌లో...



● రేణూ దేశాయ్

'బద్రి, జానీ' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు రేణూ దేశాయ్. 2003లో విడుదలైన 'జానీ' తర్వాత ఆమె సినిమాలకు విరామం ఇచ్చారు. దాదాపు 19ఏళ్ల తర్వాత రేణూ దేశాయ్ చేస్తున్న సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. రవితేజ హీరోగా వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. నూపూర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రేణూ దేశాయ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఇందులో హేమలత లవణంగా శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారామె. భారతీయ సామాజిక కార్యకర్త, రచయిత అయిన హేమలత లవణం అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆమె పాత్రనే రేణు చేస్తున్నారు. 1970లలో స్టూవర్ట్ పురంలో పేరు మోసిన దొంగ టైగర్ నాగేశ్వరరావు బయోపిక్‌గా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి సహనిర్మాత: మయాంక్ సింఘానియా, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్. మది.

తండ్రీకొడుకుల కథ



● పూజిత, సురేంద్ర

సురేంద్రకుమార్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'లోకం ఎరుగని కథ'. పూజిత హీరోయిన్‌గా, విజయ్ విశ్వనాథ్ కీలక పాత్ర పోషించారు. సుజాత సమర్పణలో రవికాంత్ జమి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. సురేంద్ర కుమార్ మాట్లాడుతూ– ''పాతకాలపు ఆచారాలతో ఉన్న తండ్రి, ప్రజెంట్ ట్రెండ్‌ను ఫాలో అవుతున్న కొడుకుల మధ్య జరిగే కథే ఈ సినిమా'' అన్నారు.

అవకాశాలు కల్పించాలి



● దామోదర ప్రసాద్, తోరం రాజా...

''ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో సభ్యత్వం ఉన్న 24 క్రాఫ్ట్స్ వారికి అవకాశాలు కల్పించాలి. తాడేపల్లిలోని మా సంస్థ కార్యాలయంలో వారికి శిక్షణా తరగతులు నిర్వహించనున్నాం'' అని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు తోరం రాజా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కేయల్ దామోదర ప్రసాద్, నిర్మాతల మండలి కార్యదర్శి వడ్లపట్ల మోహన్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఈసీ సభ్యులు మాణిక్, హరనాథ్ రెడ్డిలకు వినతిపత్రాలు అందించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	188	56,410
నిఫ్టీ ▼	41	16,818

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	10,707	▼	345
డోజోన్స్	29,156	▼	527
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,882	▼	124
డాక్స్	11,976	▼	208
షాంఘై	3,041	▼	4
నికాయ్	26,422	▲	248

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

వర్ధమాన దేశాల్లో 'స్టార్' భారత్!

- 2022–23లో 7.3 శాతం వృద్ధి
- రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ



న్యూఢిల్లీ: ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ భారత్‌ను వర్ధమాన దేశాల్లోనే స్టార్ (ఆశాకిరణం)గా అభివర్ణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.3 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని అంచనా వేసింది. పెరుగుతున్న వడ్డీ రేట్లు, యూరోప్‌లో పెరిగిపోయిన ఇంధన అభద్రత ప్రభావం ప్రతి దేశాన్ని తాకుతోందని.. ఈ తరుణంలో 7.3 శాతం వృద్ధితో భారత్ స్టార్‌గా నిలవనుందని వివరించింది. ఈ మేరకు గురువారం ఒక నివేదికను విడుదల చేసింది. సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపుతో కఠిన ఆర్థిక పరిస్థితుల కారణంగా, వచ్చే కొన్ని త్రైమాసికాల్లో అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి నిదానిస్తుందని తెలిపింది. ''ద్రవ్యోల్బణం గృహ ఆదాయాన్ని తగ్గించేసింది. వ్యాపార విశ్వాసం సైతం క్షీణించింది. వెలుపలి వాతావరణం కూడా మరింత క్లిష్టంగా మారింది''అని ఎస్అండ్‌పీ పేర్కొంది. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి కేంద్ర బ్యాంకులు దూకుడుగా వడ్డీ రేట్లను పెంచుతున్నాయని, అమెరికాలో స్వల్ప మాంద్యాన్ని అంచనా వేస్తున్నట్టు పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	50,003	▲	498
బంగారం (99.5 స్వచ్ఛత)	49,803	▲	496
వెండి (కిలో)	55,658	▲	1134

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-9-2022	
విశాఖ	425–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	66.00
29-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

చిన్న డిపాజిటర్లకు గుడ్ న్యూస్

- చిన్న పొదుపు పథకాల రేట్లు పెంపు
- అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సవరణ

న్యూఢిల్లీ: వరుసగా రేట్ల తగ్గింపులతో చిన్నబోయిన చిన్న మొత్తాల పొదుపు పథకాలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. అంతర్జాతీయంగా సెంట్రల్ బ్యాంకులు ద్రవ్యోల్బణం కట్టడికి కీలకమైన వడ్డీ రేట్లను పెంచుతూ వెళుతున్నాయి. మన ఆర్‌బీఐ కూడా ఇదే బాటలో నడుస్తోంది. మే చివరి నుంచి ఇప్పటి వరకు 1.4 శాతం మేర రెపో రేటును పెంచింది. దీంతో మార్కెట్ తీరుకు అనుగుణంగా, తొమ్మిది వరుస త్రైమాసికాల యథాతథ స్థితి తర్వాత.. చిన్న మొత్తాల పొదుపు పథకాల రేట్లను సైతం కేంద్ర సర్కారు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 0.30 శాతం వరకు పలు పథకాల రేట్లను పెంచుతూ ప్రకటన విడుదల చేసింది. పన్ను పరిధిలోకి వచ్చే పథకాలపై ప్రధానంగా రేట్లను పెంచింది. అదే సమయంలో కొన్ని పథకాల రేట్లలో ఎటువంటి మార్పులు చేయలేదు. ప్రతి త్రైమాసికానికీ ఈ పథకాల రేట్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంటుంది. ఇందులో భాగంగా అక్టోబర్ 1 నుంచి మొదలయ్యే తదుపరి మూడు నెలల కాలానికి తాజా రేట్లపై కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడేళ్ల టైమ్ డిపాజిట్‌పై ప్రస్తుతం 5.5 శాతం రేటు ఉంటే, ఇక మీదట ఇది 5.8 శాతం కానుంది. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌పై రేటు 0.20 శాతం పెరిగి 7.6 శాతానికి చేరింది. ప్రస్తుతం ఈ పథకంలో రేటు 7.4 శాతంగా ఉంది. కిసాన్ వికాస్ పత్ర రేటును 6.9 శాతం నుంచి 7 శాతానికి (123 నెలలకు మెచ్యూరిటీ).. పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్‌లో రేటును 6.6 శాతం నుంచి 6.7 శాతానికి కేంద్రం సవరించింది.



వీటిల్లో మార్పు లేదు..: ఏడాది, ఐదేళ్ల ఎఫ్‌డీలు, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి యోజన, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) పథకాల రేట్లు ప్రస్తుతమున్న మాదిరే మరో మూడు నెలలు కొనసాగుతాయి. ఈ పథకాల రేట్లను కేంద్రం సవరించలేదు. సవరించిన రేట్లు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి.

పథకాల వడ్డీ రేట్లలో మార్పులు

పథకం	జూలై - సెప్టెంబర్	అక్టోబర్ - డిసెంబర్
సేవింగ్స్ డిపాజిట్	4%	4%
ఏడాది టైమ్ డిపాజిట్	5.5	5.5
రెండేళ్ల టైమ్ డిపాజిట్	5.5	5.7
మూడేళ్ల టైమ్ డిపాజిట్	5.5	5.8
ఐదేళ్ల టైమ్ డిపాజిట్	6.7	6.7
ఐదేళ్ల ఆర్‌డీ	5.8	5.8
సీనియర్ సిటిజన్ సేవింగ్స్	7.4	7.6
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్	6.6	6.7
ఎన్ఎస్‌సీ	6.8	6.8
పీపీఎఫ్	7.1	7.1
కిసాన్ వికాస్ పత్ర	6.9	7
సుకన్య సమృద్ధి	7.6	7.6

ఆరు ఎయిర్‌బ్యాగ్స్ నిబంధన వాయిదా

- 2023 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి...
- వాహన పరిశ్రమ సరఫరా సమస్యల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- వెల్లడించిన కేంద్ర మంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్స్ తప్పనిసరిగా ఉండాలన్న ప్రతిపాదిత నిబంధన అమలు.. ఏడాదిపాటు వాయిదా పడింది. 2023 అక్టోబర్ 1 నుంచి అమలవుతుంది. వాహన పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రపంచ సరఫరా పరిమితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. స్థూల ఆర్థిక పరిస్థితులపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ఖరీదు, వేరియంట్లతో సంబంధం లేకుండా వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులందరి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎనిమిది మంది కూర్చోవడానికి వీలుండే వాహనాల్లో కనీసం ఆరు ఎయిర్‌బ్యాగ్స్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధనను 2022 అక్టోబర్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది.



సమయం సరిపోదు..: ప్యాసింజర్ కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌ను తప్పనిసరి చేయాలన్న నిబంధన అమలును ఒక సంవత్సరంపాటు వాయిదా వేయడం ద్వారా ప్రభుత్వం వాహన పరిశ్రమ యొక్క నిజమైన ఆందోళనలను గుర్తించిందని మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్.సి.భార్గవ అన్నారు. 'నిబంధన అమలుకు కంపెనీలకు తగినంత సమయం లేకపోవడం, మార్కెట్ పడిపోయినందున పరిశ్రమ వాయిదా వేయాలని కోరింది. మేము చెబుతున్న సమస్య ప్రామాణికతను ప్రభుత్వం గుర్తించి మద్దతుగా వ్యవహరించడం గొప్ప విషయం. నిబంధన అమలు తేదీ కొన్ని కార్ల తయారీదార్లకు సరిపోతుంది. అయితే ఆరు ఎయిర్‌బ్యాగ్‌లకు అనుగుణంగా కారులో నిర్మాణాత్మక మార్పులు చేయాల్సిన సంస్థలకు సమయం సరిపోదు' ఆయన అన్నారు.

బిగ్ 'సి' దసరావళి డబుల్ ధమాకా ఆఫర్

హైదరాబాద్: మొబైల్ రిటైల్ విక్రయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న సంస్థ బిగ్ 'సి' దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా దసరావళి పేరుతో ఆకర్షణీయమైన డబుల్ ధమాకా ఆఫర్లను అందిస్తోంది. ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.3,000 వరకూ ఇన్‌స్టెంట్ డిస్కౌంట్, రూ.1999 విలువగల ఇన్‌బేస్ ఇయర్ బడ్స్ కేవలం రూ.199కే కస్టమర్లకు అందించడం లేదా జిగ్‌మోర్ కాలింగ్ స్మార్ట్ వాచ్ కేవలం రూ.899కే లభించడం, బ్రాండెడ్ యాక్సెసరీలపై 51% వరకూ డిస్కౌంట్, ఎస్‌బీఐ ద్వారా కొనుగోలుపై 7.5% వరకూ డిస్కౌంట్ వంటి పలు ఆఫర్లు వినియోగదారులకు లభించనున్నాయి. ఈ ఆఫర్ల ప్రకటన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, సీఎండీ బాలు చౌదరి పాల్గొన్నారు.



హిమాలయాల్లో అరుదైన మూలికలు

కనుగొన్న పతంజలి బృందం

హరిద్వార్: ఆచార్య బాలకృష్ణ నేతృత్వంలోని పతంజలి బృందం హిమాలయాల్లో అరుదైన మూలికలను కనుగొంది. హిమాలయాలలోని కొన్ని అధిరోహించలేని, చేరుకోలేని శిఖరాలను సైతం ఎక్కి ఈ మూలికలను గుర్తించినట్లు ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన తెలిపింది. హిమాలయాల నుండి తిరిగి వచ్చిన తర్వాత, పతంజలి విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఇందుకు సంబంధించి ఏర్పాటైన ఒక స్వాగత కార్యక్రమం చిత్రాన్ని పైన తిలకించవచ్చు. ఈ కార్యక్రమంలో బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ, నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ (ఎన్ఐఎం)ప్రిన్సిపాల్ కల్నల్ అమిత్ బిష్త్‌తో సహా పలువురు పాల్గొన్నారు. అరుదైన విజయాన్ని సాధించినందుకుగాను పతంజలి బృందాన్ని పలువురు ప్రశంసించారు. ఇది గర్వకారణ చరిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.



పతన బాట వీడని మార్కెట్లు

- 7వ రోజూ నష్టాల ముగింపు
- 188 పాయింట్లు డౌన్
- 56,410 వద్ద ముగిసిన సెన్సెక్స్

ముంబై: మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో మరోసారి దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 188 పాయింట్లు క్షీణించి 56,410 వద్ద ముగిసింది. నిఫ్టీ 41 పాయింట్ల నష్టంతో 16,818 వద్ద స్థిరపడింది. అయితే సెప్టెంబర్ ఎఫ్ అండ్‌వో సిరీస్ చివరి రోజు మార్కెట్లు తొలుత సానుకూలంగా ప్రారంభమయ్యాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ఉదయం సెషన్‌లో సెన్సెక్స్ 57,000, నిఫ్టీ 17,000 పాయింట్ల ఎగువకు చేరాయి. ఆపై ఒడిదొడుకుల మధ్య మధ్యాహ్నం నుంచీ నీరసించాయి. చివరికి వరుసగా ఏడో రోజూ నేలచూపులతో నిలిచాయి. వెరసి ఇంట్రాడే గరిష్టాల నుంచి సెన్సెక్స్ 756 పాయింట్లు, నిఫ్టీ 208 పాయింట్లు కోల్పోయాయి. ఆర్‌బీఐ సమావేశంపై వేచిచూసే ధోరణి, రూపాయి బలపడటం, ఎంపిక చేసిన రంగాలలో కొనుగోళ్లు సెంటిమెంటుకు కొంతమేర బలాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.



లాభపడ్డ రంగాలు..: ఎన్ఎస్ఈలో ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్స్, మీడియా, ఎఫ్ఎంసీజీ రంగాలు 1 శాతం స్థాయిలో పుంజుకోగా.. ఐటీ క్షీణించింది. నిఫ్టీ దిగ్గజాలలో ఏషియన్ పెయింట్స్ 5 శాతం పతనంకాగా.. హీరోమోటో, టెక్ మహీంద్రా, బజాజ్ ఆటో, టైటాన్, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఫిన్‌సర్వ్, విప్రో, ఎల్అండ్‌టీ 2–1 శాతం మధ్య నీరసించాయి. ఇతర బ్లూచిప్స్‌లో శ్రీసిమెంట్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, ఐటీసీ, అపోలో హాస్పిటల్స్, డాక్టర్ రెడ్డీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, టాటా స్టీల్, సన్ ఫార్మా 3.5–1.5 శాతం మధ్య ఎగశాయి. నేడు(శుక్రవారం) ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలను వెల్లడించనుంది. ఈ ఏడాది మే నుంచి వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 1.4 శాతం పెంచిన విషయం విదితమే. ధరల కట్టడి కోసం మరో 0.5 శాతం పెంచే వీలున్నట్లు ఆర్థికవేత్తల అంచనా. దీంతో రెపో మూడేళ్ల గరిష్టం 5.9%కి చేరే వీలుంది.

చిన్న షేర్లు ప్లస్

ఓవర్‌సోల్డ్ స్థితికి చేరిన మార్కెట్లలో ఇన్వెస్టర్లు చిన్న షేర్లలో కొనుగోళ్లవైపు మొగ్గు చూపారు. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.3-0.6 శాతం బలపడ్డాయి. ఎఫ్‌పీఐలు రూ. 3,599 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 3,162 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

యూఎస్ మార్కెట్లు డౌన్

అనూహ్యంగా పెరిగిన నిరుద్యోగ గణంకాలు, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ఆర్థిక మాంద్య భయాలను ఎగదోయడంతో అమెరికా స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. డోజోన్స్ 2%, ఎస్అండ్‌పీ 2 శాతం చొప్పున క్షీణించగా.. నాస్‌డాక్ మరింత అధికంగా 3.5 శాతం జారింది. కాగా.. యూరప్‌లో యూకే, జర్మనీ, ఫ్రాన్స్ సైతం 1.7 శాతం డీలా పడ్డాయి.

సెమీఫైనల్లో సాకేత్-యూకీ

కొరియా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఆటగాడు సాకేత్ మైనేని పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్-యూకీ బాంబ్రి జోడీ 6-3, 6-4తో రోడ్రిగ్వెజ్ (కొలంబియా)-డీగో హిడాల్గో (ఈక్వెడార్) జంటపై గెలుపొందింది. నేడు జరిగే సెమీఫైనల్లో రావెన్ క్లాసెన్ (దక్షిణాఫ్రికా)- నాథనిల్ లమన్స్ (అమెరికా) జోడీతో భారత ద్వయం పోటీపడుతుంది. మరో వైపు ఇజ్రాయెల్‌లో జరుగుతున్న టెల్ అవీవ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్స్‌లో బోపన్న-మిడిల్‌కూప్ జంట 4-6, 7-6(7/5), 10-5తో ఫ్రాంకో స్కుగోర్ (క్రొయేషియా)-డెనిస్ మొల్చనోవ్ (ఉక్రెయిన్) ద్వయంపై గెలిచింది. సెమీస్‌లో బోపన్న జోడీ... ఫ్రాన్స్‌కు చెందిన ఫాబియన్ రిబౌల్-సాడియో డంబియా జంటతో తలపడుతుంది.



అయ్యో బుమ్రా..!

- భారత స్టార్ పేసర్‌కు వెన్ను గాయం
- టి20 ప్రపంచకప్‌కు దూరం
- షమీ లేదా చహర్‌కు అవకాశం

టి20 ప్రపంచకప్‌కు బయల్దేరక ముందే భారత క్రికెట్ జట్టుకు పెద్ద షాక్! ఆసీస్ గడ్డపై జట్టుకు ఒంటి చేత్తో విజయాలు అందించగలడని భావించిన స్టార్ పేసర్ ఇప్పుడు టోర్నీకే దూరం కానున్నాడు. వెన్ను నొప్పి గాయం (బ్యాక్ స్ట్రెస్ ఫ్రాక్చర్)తో బాధపడుతున్న జస్‌ప్రీత్ బుమ్రా నొప్పి తిరగబెట్టడంతో తప్పనిసరిగా ఆటకు విరామం పలకాల్సి వచ్చింది. దాంతో అతను టి20 ప్రపంచ కప్ వెళ్లే అవకాశం లేదని తేలిపోయింది. ఇప్పటికే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మోకాలి గాయంతో మెగా టోర్నీనుంచి తప్పుకోగా, ఇప్పుడు బుమ్రా కూడా లేకపోవడం టీమిండియాను బలహీనంగా మార్చింది.

న్యూఢిల్లీ: గాయంనుంచి కోలుకొని విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టిన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆట రెండు మ్యాచ్‌లకే పరిమితమైంది. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో, మూడో టి20లో ఆడిన అతను బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20నుంచి చివరి నిమిషంలో తప్పుకున్నాడు. మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో బుమ్రాకు వెన్ను నొప్పి వచ్చిందని, అందుకే మ్యాచ్ ఆడటం లేదని బీసీసీఐ ప్రకటించింది. అయితే ఆ వెన్ను బాధ అంతటితో ఆగిపోలేదని బుధవారం సాయంత్రం తేలింది. తిరువనంతపురంనుంచి బుమ్రా నేరుగా బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి చేరుకున్నాడు. పరీక్షల అనంతరం గాయం తీవ్రమైందని తేలగా, కొన్ని నెలల పాటు ఆటకు దూరం కావాల్సి ఉందని అర్థమైంది. బీసీసీఐ అధికారికంగా బుమ్రా గాయంపై ప్రస్తుతానికి ఎలాంటి ప్రకటన చేయకపోయినా...బోర్డు ఉన్నతాధికారి ఒకరు ఈ విషయాన్ని నిర్ధారించారు. 'బుమ్రా ఎట్టి పరిస్థితుల్లోనూ టి20 ప్రపంచకప్ ఆడే అవకాశం లేదు. అతని వెన్ను గాయం చాలా తీవ్రమైంది. స్ట్రెస్ ఫ్రాక్చర్ కాబట్టి కోలుకునేందుకు కనీసం ఆరు నెలలు పడుతుంది' అని ఆయన వెల్లడించారు. వరల్డ్ కప్‌కు ప్రకటించిన జట్టులో స్టాండ్‌బైలుగా ఇద్దరు పేసర్లు అందుబాటులో ఉన్నారు. మొహమ్మద్ షమీ లేదా దీపక్ చహర్‌లలో ఒకరిని ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. బుమ్రా గాయాన్ని బీసీసీఐ వైద్యులు పర్యవేక్షిస్తారని, టీమ్‌లో మార్పులు చేసుకునే అవకాశం ఉన్న అక్టోబర్ 15 వరకు వేచి చూడవచ్చని చెబుతున్నా... పూర్తి ఫిట్‌గా లేని ఆటగాడిని ఆస్ట్రేలియాకు తీసుకెళ్లే సాహసం టీమ్ మేనేజ్‌మెంట్ చేయకపోవచ్చు.



బలమే బలహీనతై...

'బుమ్రా పూర్తి స్థాయిలో మళ్లీ బౌలింగ్ చేయడం సంతోషంగా అనిపిస్తోంది. నిజాయితీగా చెప్పాలంటే వెన్ను నొప్పితో రెండు నెలలు విశ్రాంతి తీసుకొని మళ్లీ బౌలింగ్ చేయడం అంత సులువు కాదు. అతని ప్రదర్శన ఎలా ఉందన్నది అనవసరం. మెల్లగా లయ అందుకుంటున్నాడు. అతను తిరిగి రావడమే విశేషం. '...ఆసీస్‌తో రెండో టి20 తర్వాత బుమ్రా గురించి రోహిత్ వ్యాఖ్య ఇది. అయితే మరో మ్యాచ్‌కే గాయం తిరగబెట్టి బుమ్రా మళ్లీ అందుబాటులో లేకుండా పోతాడని బహుశా రోహిత్ కూడా ఊహించి ఉండడు. విజయావకాశాలు ప్రభావితం చేయగల తన స్టార్ బౌలర్ లేకపోవడం ఏ కెప్టెన్‌కైనా లోటే. అయితే బుమ్రా గాయాన్ని బోర్డు వైద్యులు, ఎన్‌సీఏ పర్యవేక్షించిన తీరే సరిగా కనిపించడం లేదు. బుమ్రా విశ్రాంతి లేకుండా నిరంతరాయంగా ఏమీ ఆడటం లేదు. బోర్డు రొటేషన్ పాలసీ, వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అతను చాలా తక్కువ మ్యాచ్‌లే ఆడాడు. 2022లో అతను ఐపీఎల్‌తో పాటు 5 టెస్టులు, 5 వన్డేలు, 5 అంతర్జాతీయ టి20లు మాత్రమే ఆడాడు. నిజానికి బుమ్రాకు స్ట్రెస్ ఫ్రాక్చర్ కొత్త కాదు. 2019లోనే అతను ఇదే బాధతో మూడు నెలలు ఆటకు దూరమయ్యాడు. నిపుణులు చెప్పినదాని ప్రకారం అతని భిన్నమైన శైలే అందుకు ప్రధాన కారణం. వెన్నునొప్పితోనే అతను ఇటీవలే ఆసియా కప్‌లోనూ ఆడలేదు. అయితే సరిగ్గా ఇక్కడే టీమ్ మేనేజ్‌మెంట్ తొందరపాటు కనిపిస్తోంది. అతను పూర్తి స్థాయిలో కోలుకోకుండానే ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక చేసినట్లుగా అనిపిస్తోంది. లేదంటే ఎన్‌సీఏ బుమ్రా గాయాన్ని సరిగ్గా అంచనా వేయలేక తగినంత రీహాబిలిటేషన్ లేకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చినట్లుగా ఉంది. ఎందుకంటే పూర్తి ఫిట్‌గా ఉంటే రెండు మ్యాచ్‌లకే గాయం తిరగబెట్టడం ఊహించలేనిది. 'తక్కువ రనప్‌తో ఫాస్ట్ బౌలింగ్ చేసేందుకు బుమ్రా తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఎంత కాలం ఇలా అతని శరీరం సహకరిస్తుందనేదే నా సందేహం. అది మానవశరీరం. మెషీన్ కాదు' అని రెండేళ్ల క్రితం దిగ్గజ పేసర్ మైకేల్ హోల్డింగ్ చేసిన వ్యాఖ్య ఇప్పుడు వాస్తవంగా మారినట్లు అనిపిస్తోంది.

అట్టహాసంగా ఆరంభం

- జాతీయ క్రీడలు షురూ
- ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఆకట్టుకున్న వేడుకలు



ఐక్యతా జ్యోతిని ప్రధాని మోదీకి అందజేస్తున్న మాన పటేల్





వేడుకల దృశ్యాలు

అహ్మదాబాద్: గుజరాత్ ఆతిథ్యమిస్తున్న 36వ జాతీయ క్రీడలు గురువారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో సుమారు లక్షా 25 వేల మందితో కిక్కిరిసిన నరేంద్ర మోదీ స్టేడియంలో నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. స్థానికతకు పెద్దపీట వేయడం గమనార్హం. దీంతో 600 మంది గుజరాతీ కళాకారులు తమ సాంస్కృతిక ప్రదర్శనతో కట్టిపడేశారు. ప్రేక్షకుల జయజయధ్వానాల మధ్య భారత ప్రధాని మోదీ అంగరంగ వైభవంగా ఆటల పండగను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఈవెంట్లలో పతకాలతో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన క్రీడాకారులను ప్రధాని ఆకాశానికెత్తారు. 'ఆటగాళ్ల ప్రదర్శన, సాధించిన ఘనతలు దేశం ఇతర రంగాల్లోనూ ముందంజ వేసేలా చేస్తున్నాయి. క్రీడల్లో భారత్ చెప్పుకోదగ్గ పురోభివృద్ధి సాధిస్తోంది. ఇవన్నీ మునుపెన్నడో జరగాల్సిన సాఫల్యాలు. కానీ ఏళ్ల తరబడి తిష్టవేసుకున్న అవినీతి, పారదర్శకతలేని ప్రభుత్వాల వల్లే ప్రొఫెషనలిజం కొరవడింది. ఆశించిన ఫలితాలు దక్కలేదు' అని అన్నారు. స్టేడియంలో గుజరాత్‌కు చెందిన స్టార్ స్విమ్మర్ మాన పటేల్ ఐక్యతా జ్యోతిని ప్రధాని మోదీకి అందజేసింది. ఆ వెంటే స్టేడియమంతా కరతాళధ్వనులతో మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో చాంపియన్ అథ్లెట్ నీరజ్ చోప్రా, స్టార్ షట్లర్ పీవీ సింధు, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, రెజ్లర్ రవి దహియా, మాజీ షూటర్ గగన్ నారంగ్, హాకీ మాజీ కెప్టెన్ దిలీప్ టిర్కీ, మాజీ మహిళా అథ్లెట్ అంజూ జార్జ్ తదితరులు హాజరయ్యారు. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు సర్వీసెస్‌కు చెందిన సుమారు 7000 మందికి పైగా అథ్లెట్లు 36 క్రీడాంశాల్లో పాల్గొనేందుకు వచ్చారు. గుజరాత్‌లోని ఆరు ప్రముఖ నగరాల్లో పోటీలు నిర్వహిస్తారు.

క్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి జోడి

వియత్నాం ఓపెన్ బ్యాడ్మింటన్

హో చి మిన్ సిటీ: వియత్నాం ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగమ్మాయి సిక్కిరెడ్డి మిక్స్‌డ్ డబుల్స్‌లో దూసుకెళుతోంది. రోహన్ కపూర్‌తో జతకట్టిన ఆమె క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి-రోహన్ జోడీ 21-10, 19-21, 21-18తో ఎనిమిదో సీడ్ యుంగ్ షింగ్ చౌయ్-ఫాన్ క యాన్ (హాంకాంగ్) జంటను కంగు తినిపించింది. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో భారత ద్వయం మలేసియాకు చెందిన మూడో సీడ్ చాన్ పెంగ్ సున్-చి యి సి జోడీతో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో తెలంగాణ షట్లర్ మేకల కిరణ్ కుమార్ ప్రిక్వార్టర్స్‌లో పరాజయం చవిచూశాడు. వరుస విజయాలతో ప్రిక్వార్టర్స్ చేరిన కిరణ్ ఇక్కడ మాత్రం వరుస గేముల్లో 15-21, 10-21తో చిమ్ జున్ వి (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లోనూ భారత ప్లేయర్లకు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. హైదరాబాద్ షట్లర్ గద్దె రుత్విక శివాని 21-15, 18-21, 17-21తో స్థానిక ప్లేయర్ తి త్రంగ్ వు చేతిలో పోరాడి ఓడింది. మిగతా మ్యాచ్‌ల్లో రీతుపర్ణ దాస్ 15-21, 16-21తో తి ఫుంగ్‌తుయ్ ట్రాన్ (వియత్నాం) చేతిలో ఓడిపోగా... నీలూరి ప్రేరణ 3-21, 7-21తో టాప్‌సీడ్ అయ ఒహొరి (జపాన్) ధాటికి నిలువలేకపోయింది.



సహజ వెలుగులను ఇలా కొనండి

- పునరుత్పాదక ఇంధన కొనుగోలు నిబంధనలను ప్రకటించిన ఏపీఈఆర్‌సీ
- ఈ ఏడాది నుంచి 2026–27 వరకు విద్యుత్ శాతాల వారీగా నిర్ణయం



సాక్షి, అమరావతి: సౌర, పవన, జలవిద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడంలో భాగంగా పునరుత్పాదక ఇంధన కొనుగోలు బాధ్యత నిబంధనలు–2022ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం గెజిట్ విడుదల చేసింది. ఈ ఏడాది నుంచి 2026–27 వరకు విద్యుత్ సంస్థలు వినియోగించే విద్యుత్‌లో ఎంతమేర పునరుత్పాదక విద్యుత్ ఉండాలనేది ఈ నిబంధనల్లో సూచించింది. గెజిట్ విడుదలైన నాటినుంచే నిబంధనలు అమల్లోకి వస్తాయని తెలిపింది. దీనిప్రకారం సహజ విద్యుత్‌ను వినియోగించని డిస్కంలు ఎనర్జీ సర్టిఫికెట్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

సంవత్సరాల వారీగా పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు చేయాల్సిన శాతం

ఆర్థిక సంవత్సరం	పునరుత్పాదక విద్యుత్ శాతం
2022-23	18
2023-24	19
2024-25	20
2025-26	22
2026-27	24

లోన్ యాప్ నిందితులు అరెస్టు

- 17న నలుగురిని అరెస్ట్ చేసిన కృష్ణా జిల్లా పోలీసులు
- వారిచ్చిన సమాచారంతో యూపీ, ఢిల్లీ, హైదరాబాద్‌కు చెందిన మరో ఐదుగురు అరెస్టు
- చైనా, నేపాల్, పాక్, బంగ్లాదేశ్ కేంద్రంగా నేరాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జాషువా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరు సెంటర్: లోన్ యాప్‌లతో అమాయక ప్రజలను వేధిస్తున్న మరో ఐదుగురిని కృష్ణా జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఎస్పీ జాషువా గురువారం మచిలీపట్నంలో మీడియాకు వెల్లడించారు. పెనమలూరు, ఆత్కూరు, కంకిపాడు, మచిలీపట్నం ప్రాంతాలకు చెందిన పలువురు లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నారు. వాటిని సక్రమంగా చెల్లించినప్పటికీ.. యాప్ నిర్వాహకులు మరింత డబ్బు చెల్లించాలంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఇవ్వకపోతే మార్ఫింగ్ చేసిన నగ్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరించారు. దీంతో కొందరు డబ్బులు చెల్లించగా.. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ జాషువా.. సైబర్ క్రైం పోలీసులను రంగంలోకి దింపి ఈనెల 17న మహారాష్ట్రలో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌సింగ్, అతని సోదరుడు రోహిత్‌కుమార్, జయశంకర్ ఉపాధ్యాయలతో పాటు ఢిల్లీకి చెందిన అభిషేక్‌కుమార్‌సిన్హాను అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన హక్తర్ హుస్సేన్ అనే సైబర్ నేరగాడిని అరెస్టు చేశారు. వీరిలో కొందరు వాట్సాప్ కాల్స్, నకిలీ నంబర్లు, సోషల్ మీడియా ద్వారా రుణాలు తీసుకున్నవారిని బెదిరిస్తుండగా, మరికొందరు బ్యాంకు అకౌంట్లకు సంబంధించిన ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతుంటారు. వీరందరికీ పాక్, చైనా, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన నిర్వాహకులు కమీషన్లు ఇస్తూ ఉంటారు. వీరందరికీ ఒకరి గురించి ఇంకొకరికి తెలియదు. వీరు వందలాది సిమ్‌లతో.. నకిలీ బ్యాంకు ఖాతాలతో ఈ నేరాలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. నేరస్తులందరినీ అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ చెప్పారు. సమావేశంలో పోలీస్ అధికారులు వెంకటరామాంజనేయులు, భరత్ మాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

చలసాని శ్రీనివాస్‌కు పోలీస్ నోటీసు జారీ

కర్నూలు: ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, ప్రొఫెసర్ వినోద్‌కుమార్‌లను కర్నూలు రెండో పట్టణ పోలీసులు విచారణ జరిపి నోటీసులు జారీ చేశారు. ఓ చానల్ చర్చావేదికలో బీజేపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కర్నూలుకు చెందిన వీహెచ్‌పీ నాయకులు సోమిశెట్టి వెంకటరామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 22న యాంకర్ వెంకటకృష్ణపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చలసాని శ్రీనివాస్, ప్రొఫెసర్ వినోద్‌కుమార్‌లు కూడా బీజేపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదు నేపథ్యంలో గురువారం స్టేషన్‌లో విచారణ జరిపి నోటీసులు జారీ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యేలపై కేసులు కొట్టివేత

- ప్రత్యేకహోదా కోసం రైల్‌రోకో, ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు రాజీనామా కోరుతూ ఆందోళన చేసిన నేతలు
- ఆ కేసులను కొట్టేసిన ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు

కడప కార్పొరేషన్: ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, కడప మేయర్ కె.సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆ పార్టీ నేతలపై తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నమోదు చేసిన రెండు కేసులను విజయవాడలోని ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు కొట్టేసింది. ఈ మేరకు ప్రత్యేక కోర్టు జడ్జి సి.కె.గాయత్రీదేవి గురువారం తీర్పుచెప్పారు.

☛ తెలంగాణలో ఓటుకు కోట్లు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అప్పటి సీఎం చంద్రబాబు రాజీనామా చేయాలని కోరుతూ 2015 జూన్ 9న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీనిపై కానిస్టేబుల్ రామసుబ్బయ్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు ఐపీసీ 143, 341, 188 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద పులి సునీల్‌కుమార్, బి.నిత్యానందరెడ్డి, అఫ్జల్‌ఖాన్, షఫీ, ఎంపీ సురేష్, ఐస్‌క్రీం రవి, షేక్ అల్తాఫ్, బోలా పద్మావతిలపై కేసు నమోదు చేశారు. ఆ కేసు కడప నుంచి విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ అయింది.

☛ విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని కోరుతూ 2018 ఏప్రిల్ 11వ తేదీన అప్పుడు కడప ఎమ్మెల్యేగా ఉన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో కడపలో రైల్‌రోకో నిర్వహించారు. గుంతకల్ రైల్వేపోలీసులు వారు ముగ్గురితోపాటు మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, అఫ్జల్‌ఖాన్, పులి సునీల్, పాకా సురేష్‌కుమార్, ఖాజా రహంతుల్లా, చల్లా రాజశేఖర్, విజయ్‌కుమార్, నరసింహారెడ్డి, శ్యాంసన్, టి.పి.వెంకటసుబ్బమ్మ, బోలా పద్మావతి, రామలక్ష్మణ్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి కడప నుంచి విజయవాడ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. విచారణ సమయంలోనే బోలా పద్మావతి, ఖాజా రహంతుల్లా చనిపోయారు. ఈ రెండు కేసులను విచారించిన ప్రత్యేక కోర్టు తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వాటిని కొట్టేసింది. వైఎస్సార్‌సీపీ నేతల పక్షాన వి.ఆర్.రెడ్డి కొవ్వూరి, కె.ఉమామహేశ్వర్‌రెడ్డి వాదించారు.

వికేంద్రీకరణకు మద్దతుగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మశ్రీ, లక్ష్మీరమణమ్మ

రోలుగుంట: అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విశాఖ పరిపాలన రాజధానికి మద్దతుగా అనకాపల్లి జిల్లా రోలుగుంటలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

విజయవాడ మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 30 నుంచి అక్టోబర్ 11వ తేదీ వరకు విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి 12 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 30న సికింద్రాబాద్–సత్రగచ్చి (07645), అక్టోబర్ ఒకటో తేదీన సత్రగచ్చి–సికింద్రాబాద్(07646), 2న సికింద్రాబాద్–షాలీమార్ (07741), 3న షాలీమార్–సికింద్రాబాద్ (07742), 1, 8 తేదీల్లో నాందేడ్–బెరంపూర్ (07431), 2, 9 తేదీల్లో బెరంపూర్–నాందేడ్ (07432), 1, 8 తేదీల్లో త్రివేండ్రం–టాటానగర్ (06192), 4, 11 తేదీల్లో టాటానగర్–త్రివేండ్రం (06191) మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు వివరించారు.

ఎక్స్‌టెన్షన్ అధికారుల నియామకంపై స్టే

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: మహిళా, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ వర్కర్లను ఎక్స్‌టెన్షన్ అధికారులుగా పదోన్నతిపై నియమించేందుకు ఉద్దేశించిన ప్రక్రియను హైకోర్టు నిలుపుదల చేసింది. ఎక్స్‌టెన్షన్ అధికారులుగా నియమించే వారికి రాత పరీక్షతో పాటు ఇంగ్లీషు ప్రావీణ్య పరీక్షను నిర్వహించడం తప్పనిసరని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. నోటిఫికేషన్‌లో సైతం రెండు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారని గుర్తుచేసింది. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తదితరులను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. తమకు రాత పరీక్ష మాత్రమే నిర్వహించి, ఇంగ్లీషు ప్రావీణ్య పరీక్షను నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. రాత పరీక్ష నిర్వహించకుండానే తుది మెరిట్ లిస్ట్ ప్రకటించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని, ఇందులో జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ వ్యాజ్యాలపై గురువారం జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు



గుంటూరు జిల్లా మంగళగిరిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



వైఎస్సార్ జిల్లా దొడియంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి



కాకినాడ జిల్లా పాత వజ్రకూటంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటి వద్దా ప్రజలు ఆనందంతో స్వాగతం పలుకుతున్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తోందని చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.

నలుగురు బంగ్లాదేశీయులకు జైలు

విజయవాడ స్పోర్ట్స్: నకిలీ పాస్‌పోర్టుతో దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన నలుగురు బంగ్లాదేశీయులకు 14 నెలలు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి గురువారం తీర్పు ఇచ్చారు. బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ హస్సన్, హైదర్ ఆలీఖాన్, ఇందాయల్ ఖాన్, సైఫుల్లా షేక్‌లను అక్రమ చొరబాటుదారులుగా గుర్తించి 2021, జూలై రెండో తేదీన విజయవాడ సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు నకిలీ పాస్‌పోర్టుతో దేశంలోకి చొరబడి హౌరా నుంచి వాస్కోడిగామా వెళ్లే రైలులో ప్రయాణిస్తుండగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నలుగురు నిందితులకు 14 నెలలు జైలు శిక్ష విధించారు.

జెరూసలేం యాత్రకు కసరత్తు

రూ.2.50కోట్లు కేటాయించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: పవిత్ర జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవులకు ప్రభుత్వ సాయం అందించేందుకు కసరత్తు ప్రారంభమైంది. యాత్రికుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జెరూసలేం యాత్రికులకు సాయం అందించేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.2.50కోట్లు కేటాయించింది. నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి వారికి ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని అందిస్తారు. దరఖాస్తులను గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్(ఏపీఎస్‌సీఎంఎఫ్‌సీ) ప్రధాన కార్యాలయంలో అందజేయాలి. దరఖాస్తుతోపాటు బీసీ–సీ(క్రిస్టియన్) ధ్రువీకరణపత్రం, బాప్టిజం పొందిన సర్టిఫికెట్, పాస్‌పోర్టు, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోలు జతచేయాలి. రూ.3లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన వారికి రూ.60వేలు, రూ.3 లక్షలకు పైగా వార్షిక ఆదాయం ఉన్న వారికి రూ.30వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తుంది.

సంతా'నో'త్పత్తి!



తెలుగు రాష్ట్రాల్లో పదేళ్లలో పడిపోయిన జీఎఫ్ఆర్

- పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో తగ్గుదల ఎక్కువ
- ఎస్ఆర్ఎస్ 2020 గణాంకాల నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: మహిళల్లో అక్షరాస్యత పెరుగుదల, ఆధునిక గర్భ నిరోధక పద్ధతులతో దేశవ్యాప్తంగా పదేళ్లలో సాధారణ సంతానోత్పత్తి రేటు (జీఎఫ్ఆర్) గణనీయంగా తగ్గింది. ఉమ్మడి రాష్ట్రంలో 2008-2010లో సగటు జీఎఫ్ఆర్ 63.8 కాగా 2018-20 నాటికి 52.9కి పడిపోయింది. కేంద్రం ఇటీవల విడుదల చేసిన 'శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) గణాంకాల నివేదిక 2020'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ప్రతి వెయ్యి మంది మహిళలకు ఆ ఏడాదిలో జన్మించిన శిశువుల సంఖ్యను జీఎఫ్ఆర్‌గా వ్యవహరిస్తారు. 15-49 ఏళ్ల వయసు మహిళలను పరిగణలోకి తీసుకుని జీఎఫ్ఆర్ లెక్కిస్తారు.

- తెలుగు రాష్ట్రాల్లో నగర ప్రాంతాలతో పోలిస్తే గ్రామాల్లోనే జీఎఫ్ఆర్ తగ్గుదల ఎక్కువగా ఉంది. 2008-10లో గ్రామాల్లో జీఎఫ్ఆర్ 66.9 ఉండగా 2018-20 నాటికి 54.7కి పరిమితమైంది. పట్టణాల్లో ఇదే సమయంలో 56.8 నుంచి 49.6కి తగ్గింది. దేశ వ్యాప్తంగా పదేళ్లలో 20.2 శాతం జీఎఫ్ఆర్ తగ్గింది. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో 20.2 శాతం, పట్టణ ప్రాంతాల్లో 15.6 శాతం తగ్గుదల నమోదైంది. అత్యధికంగా పదేళ్లలో జమ్మూ కశ్మీర్‌లో జీఎఫ్ఆర్ 29.2 శాతం తగ్గింది.

దక్షిణాది రాష్ట్రాల్లో జీఎఫ్ఆర్ ఇలా

రాష్ట్రం	2008-10	2018-20
కర్ణాటక	70.4	57.9
కేరళ	53.5	46.9
తమిళనాడు	57.2	49.4

ఉత్తరాది రాష్ట్రాల్లో జీఎఫ్ఆర్

రాష్ట్రం	2008-10	2018-20
బిహార్	117.5	96.8
రాజస్తాన్	109.5	84.1
ఉత్తరప్రదేశ్	116.3	88.4

దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరాదిలో జీఎఫ్ఆర్ చాలా ఎక్కువగా ఉంది.

- ఏపీలో 20 - 29 ఏళ్ల వయసు మధ్య సంతానోత్పత్తి రేటు మెరుగ్గా నమోదైంది. 20-24 ఏళ్ల మధ్య 113.6, 25-29 ఏళ్ల మధ్య 109గా సంతానోత్పత్తి రేటు ఉంది. 30-34 ఏళ్ల వయస్సు వారిలో 44.4 ఉండగా, 35-39 ఏళ్ల వయస్సు వారిలో 13.4గా సంతానోత్పత్తి రేటు ఉంది. జాతీయ స్థాయిలో 30-34 ఏళ్ల మధ్య 84.4 ఉండగా 35-39 ఏళ్ల మధ్య సంతానోత్పత్తి రేటు 35.6గా నమోదైంది.

ఏటా భూగర్భ జలమట్టం వివరాల సేకరణ

అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖ

సాక్షి, అమరావతి: తాగు, సాగునీటి కోసం బోరు తవ్వాలంటే ఆ ప్రాంతంలో నీరు పడుతుందా.. పడితే ఎన్ని అడుగుల లోతున పడుతుంది?.. ఇలా ఎన్నో సందేహాలు. వీటికి చెక్ పెట్టడానికి దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో భూగర్భ జలమట్టాల వివరాలను సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది. ఇక నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో కనీసం రెండు చోట్ల భూగర్భ జల లభ్యత (భూగర్భ జలమట్టం) వివరాలు ప్రభుత్వం సేకరించనుంది. గ్రామాల్లోని ఇళ్ల మధ్య ఉండే బోరు లేదంటే బావిలో కనీసం ఒక చోట.. అలాగే పొలాల్లో కనీసం ఇంకో చోట ఇలా ఏటా రెండుసార్లు భూగర్భ జలలభ్యత వివరాలు సేకరిస్తారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు ఒకసారి, ముగిశాక రెండోసారి ఈ వివరాలు తెలుసుకుంటారు. దేశవ్యాప్తంగా 2,69,840 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే కేంద్రం పరిధిలో ఉండే సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు దేశవ్యాప్తంగా ముందుగా గుర్తించిన 23 వేల బావుల్లో మాత్రమే నీటిమట్టం అంచనాలను సేకరిస్తోంది. ఆ వివరాల ప్రకారం ప్రాంతాల వారీగా భూగర్భ జల లభ్యత అంచనాలను నిర్ధారిస్తోంది. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా అదనంగా మరో 11 వేల ప్రాంతాల్లో భూగర్భ మట్టాల వివరాలు సేకరించాలని గతేడాదే నిర్ణయించారు. అయితే దానికి బదులుగా మరింత ఖచ్చితత్వం కోసం తాజాగా ప్రతి గ్రామంలోనూ కనీసం రెండు చోట్ల ఈ వివరాలు సేకరించనున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా రెండు రోజుల క్రితం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో పాటు గ్రామీణాభివృద్ధి శాఖాధిపతులకు లేఖలు రాశారు. ఇప్పటివరకు భూగర్భ నీటి వనరుల శాఖ ఆధ్వర్యంలో మాత్రమే ఈ వివరాల సేకరణ కొనసాగింది. ఇక నుంచి ఈ ప్రక్రియలో ఎక్కడికక్కడ గ్రామ పంచాయతీలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు.

పిల్లల్లో అభ్యసన సామర్థ్యం

అధ్యయనానికి 'అసర్'



శిక్షణలో పాల్గొన్న మాస్టర్ ట్రైనర్లు

రణస్థలం: కరోనా కారణంగా పిల్లల అభ్యసన సామర్థ్యాల్లో వచ్చిన మార్పులపై అధ్యయనం చేసేందుకు దేశ వ్యాప్తంగా యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్)- 2022 సర్వే చేపడుతున్నట్లు తెలుగు రాష్ట్రాల అసర్ సీనియర్ అసోసియేట్ ఎస్.కె.నజ్మల్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో 30 మంది మాస్టర్ ట్రైనర్లకు 5 రోజుల పాటు జరగనున్న శిక్షణను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ సంస్థ ఆధ్వర్యంలో పనిచేసే డైట్‌కు చెందిన 800 వలంటీర్లకు శిక్షణ ఇస్తారని తెలిపారు. కరోనా కారణంగా రెండేళ్లుగా పాఠశాలల నిర్వహణ జరగలేదని, దాంతో బోధనాభ్యసన ప్రక్రియ దెబ్బతిందన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ పాత్రికేయుడు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ 2005 నుంచి క్రమం తప్పకుండా అసర్ సర్వే ద్వారా వార్షిక విద్యా స్థితిగతులు ఎప్పటికప్పుడు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. తెలుగు రాష్ట్రాల అసర్ సీనియర్ అసోసియేట్ ఆర్.సాంబమూర్తి ఏపీలోని 26 జిల్లాల్లో 390 గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. జిల్లా విద్యా శిక్షణా సంస్థల(డైట్)కు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు సర్వేలో పాల్గొంటారని వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.

అబార్షన్ హక్కు
సుప్రీంకోర్టు తీర్పు



ఈ దేహం నాది
ఈ గర్భసంచి నాది

ఒక శిశువు గర్భసంచిలో ఊపిరి పోసుకుంటుంది.
ఆ గర్భసంచి మీద హక్కు ఎవరిది?
ఒక శిశువు ప్రసవ వేదనను ఇచ్చి భూమ్మీదకు వస్తుంది.
ఆ ప్రసవవేదన కలిగించే నొప్పి ఎవరిది?
ఒక శిశువు కళ్లు విప్పిన వెంటనే
పాలకై ఎద దగ్గర నోరు తెరుస్తుంది.
పాలు కుడిపే ఆ ఎద ఎవరిది? దేహం ఎవరిదో వారిది.
స్త్రీది. మహిళది. యువతిది. వివాహితది. అవివాహితది.
ఆమె వితంతువు కావచ్చు. డైవోర్సీ కావచ్చు.
ఆమె ఎవరైనా బిడ్డకు జన్మనిచ్చేది ఆమెనే.
మరి ఆమె శరీరం మీద హక్కు ఆమెకు ఉందా?
ఎప్పుడు కనాలో ఎప్పుడు వద్దనుకోవాలో
నిర్ణయించుకుంటోందా?
అవాంఛిత గర్భం వస్తే 'ఈ గర్భం నాకు వద్దు'
అని గట్టిగా చెప్పి తొలగించుకుంటోందా?
ఎన్నో అడ్డంకులు నిన్న మొన్న వరకూ ఉన్నాయి.
ఇవాళ ఆ సకల ఇబ్బందులను, అడ్డంకులను,
చట్టపరమైన చికాకులను, సాంఘికపరమైన మూసను
సుప్రీంకోర్టు బద్దలు కొట్టింది.
స్త్రీల తరఫున చాలా స్వాగతించదగిన తీర్పు ఇచ్చింది.
దేశ మహిళా చరిత్రలో ఇదొక ముఖ్య ఘట్టం.
ఈ సందర్భంగా భిన్న రంగాల, నేపథ్యాల
మహిళల ప్రతిస్పందనను ఇక్కడ అందిస్తున్నాం...

'దేశంలో ప్రతి మహిళకు ఆమె వివాహిత అయినా అవివాహిత అయినా గర్భస్రావం చేసుకునే హక్కు ఉంది' అని గురువారం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. 'అంతర్జాతీయ సురక్షిత గర్భస్రావ దినోత్సవం' – సెప్టెంబర్ 28 కాగా ఆ మరుసటి రోజే ఈ తీర్పు రావడం కాకతాళీయమే అయినా సందర్భం, ఆ సందర్భానికి ఈ తీర్పు వన్నె తెచ్చింది.

వ్యక్తిగత గౌరవానికి ప్రాధాన్యత



సుప్రీంకోర్టు తాజా తీర్పుతో స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్లయింది. ఈ తీర్పు హర్షణీయం. అవాంఛిత గర్భాన్ని సురక్షితంగా తొలగించుకునే హక్కు కల్పించడం ద్వారా సుప్రీంకోర్టు మహిళల వ్యక్తిగత గౌరవానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి అత్యాచారం, సహజీవనం వల్ల ఏర్పడిన అవాంఛిత గర్భాన్ని అయిష్టంగా మోయాల్సిన అవసరం స్త్రీకి ఉండకూడదు. మహిళలకు రక్షణ లేని సమాజంలో బడి, గుడి, రైలు పెట్టె, ఇతర వాహనాలు... అన్నీ ఆమె మీద లైంగిక దాడికి వేదికలవుతున్న నేపథ్యంలో ఇలాంటి చట్టం రావడం మంచిదే. అవాంఛిత గర్భాన్ని తొలగించుకోవడం ద్వారా ఆమె భవిష్యత్తు సాఫీగా సాగుతుంది. కెరీర్‌లో కార్యసాధికారత సాధించడానికి ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తోంది ఈ చట్టం.

– చాకలకొండ శారద, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, అశ్లీల ప్రతిఘటన వేదిక, ఆంధ్రప్రదేశ్

చట్టబద్ధం కావడం ప్రాణాలను నిలబెడుతుంది



సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గర్భిణి దశలో భర్తను కోల్పోయిన మహిళలు, గర్భిణిగా ఉండి విడాకులు పొందిన వాళ్లు సదరు వైవాహిక బంధం తాలూకు గర్భాన్ని కొనసాగించి తీరాల్సిన అవసరం ఉండదు. ఆమెకు ఇష్టం అయితే కొనసాగించవచ్చు. బిడ్డను పెంచలేని స్థితిలో ఉన్న మహిళలకు కూడా ఈ తీర్పు ఉపయుక్తమవుతుంది. అలాగే చట్టం ఆమోదించని రోజుల్లో ఒక అవివాహిత గర్భవిచ్ఛిత్తి చేయించుకోవాలంటే, చట్టవిరుద్ధమైన అబార్షన్ చేయడానికి డాక్టర్లు ఆమోదించేవారు కాదు. దాంతో వాళ్లు అరకొర పరిజ్ఞానం ఉన్న వైద్య సహాయకులతో అబార్షన్ చేయించుకోవడం, ప్రాణాల మీదకు తెచ్చుకోవడం జరిగేది. ఇప్పుడు అలాంటి ప్రమాదాలు ఉండవు.

– నిశ్చల సిద్ధారెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

విస్తృతంగా అధ్యయనం చేయాలి



ఈ తీర్పు నిజంగా సంచలనమే. అయితే తీర్పుతోపాటు తదుపరి చట్టాల రూపకల్పనకు ముందు మరింతగా అధ్యయనం చేయాలి. ఈ తీర్పులో ఉన్న క్లాజ్‌ను అడ్డుపెట్టుకుని దుర్వినియోగం చేసుకునే వాళ్లు పెరిగే ప్రమాదం లేకపోలేదు. అది కూడా వివాహిత మహిళల విషయంలోనే. సాధారణంగా తొలి బిడ్డ విషయంలో జెండర్ పట్ల కొంచెం పట్టువిడుపులతో ఉంటారు. మొదటి బిడ్డ ఆడబిడ్డ అయితే... రెండవ బిడ్డ మగపిల్లవాడయితే బావుణ్ను అనే భావజాలం మన సమాజాన్ని ఇంకా వదల్లేదు. రెండవ బిడ్డ విషయంలో రహస్యంగా లింగనిర్ధారణ చేసుకుని ఆ తర్వాత 'భర్తతో సఖ్యత లేని కారణంగా గర్భాన్ని వద్దనుకుంటున్నట్లు చెప్పి అబార్షన్ చేయించుకోమని భర్తలే భార్యల మీద ఒత్తిడి తీసుకువచ్చే' ప్రమాదం ఉంది. లింగనిర్ధారణ ఇరవై వారాలకు తెలుస్తుంది. ఆడ–మగ నిష్పత్తిని సరిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలిగే ప్రమాదాన్ని చట్టబద్ధం చేసినట్లవుతుంది. అలాగే అవివాహితుల విషయంలో కూడా... థైరాయిడ్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఇర్రెగ్యులర్ పీరియడ్స్ చాలామందిలో ఉంటున్నాయి. అలాంటప్పుడు గర్భం దాల్చినట్లు సందేహం కలిగి పరీక్ష చేయించుకునేటప్పటికే మూడు నెలలు దాటి ఉంటుంది. ఇక సహజీవనాలలో అన్‌సేఫ్ సెక్స్ తర్వాత అబార్షన్ పిల్ వేసుకోవడం కూడా చాలా మామూలుగా చేస్తున్నారు. గతంలో అది కూడా డాక్టర్ పర్యవేక్షణలోనే ఉండేది. ఇప్పుడు మెడికల్ షాపులో దొరుకుతోంది. ఆ టాబ్లెట్ వేసుకుంటే కొందరికి విపరీతంగా బ్లీడింగ్ అవుతుంది. స్పృహ కోల్పోయే పరిస్థితుల్లో డాక్టర్ దగ్గరకు వస్తుంటారు. ఇందులో మహిళల ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం కూడా కలగలిసి ఉంది. అందుకే చట్టాన్ని రూపొందించేటప్పుడు మరింత విస్తృతంగా అధ్యయనం చేసి పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ పి.కృష్ణ ప్రశాంతి, చైర్‌పర్సన్, ఏపీఐ, ఆంధ్రప్రదేశ్

'ఆమె' అనుమతి అవసరం!



ఇది ఆహ్వానించదగిన తీర్పు. సమాజంలో అనాథలను తగ్గించడానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అబార్షన్ చట్టం లేకపోవడం అనాథల సంఖ్య పెరగడానికి కారణమయ్యేది. పిల్లల స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణకు ఈ చట్టం దోహదం చేస్తుంది. ఒక ప్రాణిని భూమ్మీదకు తేవాలంటే స్త్రీ–పురుషులిద్దరి అంగీకారం, సంసిద్ధత అవసరం. పుట్టిన బిడ్డను బాధ్యతగా పెంచడానికి సిద్ధమైన తర్వాత మాత్రమే పిల్లల్ని కనాలి. అవాంఛిత గర్భంతో పుట్టిన పిల్లలు వీధిన పడతారు. ఇంట్లో ఉన్నా కూడా నిరాదరణకు గురవుతూ పెరుగుతుంటారు. ఇన్ని అనర్థాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది. అలాగే మన చట్టాల్లో శృంగారజీవితానికి వయో పరిమితి తగ్గుతూ వివాహ వయస్సు పరిమితి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కూడా ఈ నిర్ణయం సహేతుకమైనదే. చాలామంది పెళ్లయిన ఐదారు నెలల్లో విడిపోతుంటారు. విడిపోవాలనే నిర్ణయం తీసుకునేటప్పటికే ఆమె గర్భం దాల్చి ఉంటే... ఆ గర్భాన్ని కొనసాగించాలా వద్దా అనేది ఆమె ఇష్టమే అయి ఉండాలి. అలాగే సహజీవనాల్లో గర్భాన్ని నివారించుకునే జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి పరిస్థితుల్లో స్త్రీ గర్భం దాల్చగానే మగవాళ్లు ముఖం చాటేసే సందర్భాలే ఎక్కువ. అలాంటి పరిస్థితులకు కూడా ఈ తీర్పు సరైన పరిష్కారమే అవుతుంది. శృంగారానికి 'ఆమె' అనుమతి ఎలా అవసరమో, గర్భాన్ని కొనసాగించుకుని బిడ్డను కనాలా లేక తొలగించుకోవాలా అనేది కూడా ఆమె అనుమతితోనే జరగాలి.

– సంధ్య, నేషనల్ కన్వీనర్, పీఓడబ్ల్యు

పురోగతితో కూడిన తీర్పు



ఫెమినిస్టులు, మహిళా సమస్యలపై పనిచేసేవారందరూ ఈ తీర్పును స్వాగతిస్తారు. ప్రధానంగా అబార్షన్ చుట్టూ ఉన్న చాలా కోణాలను ఈ తీర్పులో కవర్ చేసింది. ఒక విషయం కాదు పెళ్లి, పెళ్లికి ముందు, అత్యాచార సంఘటనలలోనూ.. అన్ని సమస్యలను చర్చించింది. అమెరికన్ సొసైటీ మన కంటే చాలా ముందంజలో ఉందంటాం. అయితే, అక్కడ కూడా అబార్షన్‌కి సంబంధించిన హక్కులు అంతగా లేవు. ఆ నేపథ్యంలో చూస్తే ఇది మన దగ్గర పురోగతితో కూడిన తీర్పు. మహిళలకు అబార్షన్ చేయించుకోవడం మీద ఎంత వరకు నిర్ణయాధికారం ఉంటుందో మనకు తెలుసు. పురుషాధిక్య సమాజంలో నిర్ణయాధికారం ఎక్కువగా మగవాడి చేతుల్లో ఉంటుంది. దానిని అరికట్టడానికి చట్టప్రకారం సురక్షితమైన అబార్షన్ అనే క్లాజు మహిళలకు వర్తిస్తుంది. ఇది కూడా మహిళల స్వయం నిర్ణయంతో జరుగుతుందా లేదా.. అనేది ఇంకొంచెం స్పష్టత వస్తే బాగుండు అనిపించింది. కాకపోతే, ఇది లైంగిక స్వేచ్ఛకు సంబంధించి చాలా పెద్ద ముందడుగే అని చెప్పవచ్చు. సమాజపు ఒత్తిడి నుంచి స్త్రీల మీద ఉండే పెద్ద బరువును తగ్గించిందని చెప్పవచ్చు.

– కె.ఎన్ మల్లీశ్వరి, రచయిత

స్వాగతించాల్సిందే!



ఈ రోజుల్లో రిలేషన్స్ విషయంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించాల్సిందే. గర్భం విషయంలో మహిళ మాత్రమే నిర్ణయం తీసుకోగల స్వేచ్ఛ ఉండాలి. స్వతంత్రంగా ఎదుగుతున్న మహిళకు తనకు నచ్చిన నిర్ణయం తీసుకునే హక్కు ఉంది. ఇది అవసరం కూడా. కుటుంబం, స్నేహితులు, కొలీగ్స్.. సమాజంలో ఎవరైనా సరే, ఆమెను తప్పు పట్టడం సరైనది కాదు. ఎవరు సమస్యను ఎదుర్కొంటున్నారో వారు మాత్రమే నిర్ణయం తీసుకోగల స్వేచ్ఛ ఉండాలి.

– డాక్టర్ రిులమ్ ఛత్రాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌బివిఆర్ఆర్ ఉమెన్స్ కాలేజీ

ఉద్దేశ్యం మంచిదే!



ఇండియాలో 1971లో మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత యాభై ఏళ్లుగా వివిధ పరిస్థితుల్లో దీనిని చట్టబద్ధం చేస్తూ వచ్చారు. ఒకప్పుడు బిడ్డ పుడితే కాపురం సెట్ అవుతుంది అనుకునే సంఘటనలు ఉన్నాయి. నాకు ఆడపిల్ల ఇష్టం లేదు, మగపిల్లవాడు కావాలి.. అని అబార్షన్లు చేయించేవారు. ఇలా రకరకాల కారణాల వల్ల మహిళ తనకు ఇష్టం లేకపోయినా ఒత్తిడితో కూడిన బరువును మోసేది. ఈ రోజుల్లో అమ్మాయిలు చాలా తెలివిగా వారి గురించి వారు ఆలోచించుకునే స్థితికి వచ్చేశారు. ఏ స్త్రీ అయినా ప్రేమతో తన బిడ్డను కని, పెంచాలనుకుంటుంది. 'భరించలేను' అనే స్థితి ఉంటే తప్ప అబార్షన్ అనే ఆలోచన చేయదు. మనసుకు ఈ బాధ్యతను తీసుకోలేను అనుకున్నప్పుడు బిడ్డను కనాలా, వద్దా? అనే స్వేచ్ఛ స్త్రీకి ఉండటం అవసరం. దానినే సుప్రీం కోర్టు తీర్పుగా చెప్పింది. ఇది చాలా ఆహ్వానించదగింది.

– రాజేశ్వరి, అడ్వొకేట్

లైంగిక జీవన హక్కులను బలపరిచే తీర్పు



వివాహానికి ఆవల మహిళలకు ఏర్పడే సంబంధాల వల్ల వచ్చే గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకొనే అవకాశం లేదని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తూ చారిత్రాత్మక తీర్పుని వెలువరించింది. అవివాహిత స్త్రీలకు అబార్షన్ హక్కుని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధం అని, అబార్షన్ చట్టం చేసిన నాటి సామాజిక పరిస్థితులు, విలువలూ మారాయనీ, అవివాహితలకు అబార్షన్ హక్కుని నిరాకరించడం ఆర్టికల్ 14కి విరుద్ధం అని బెంచ్ అభిప్రాయపడడం స్త్రీల పునరుత్పత్తి హక్కుల గుర్తింపులో ఖచ్చితంగా ఒక ముందడుగే. అవివాహితుల అబార్షన్ హక్కును రాజ్యం నియంత్రించజాలదనీ, స్త్రీలలో పెరిగే పిండాన్ని తొలగించుకొనే హక్కు వారి శరీరం పై వారికి గల హక్కులలో భాగంగా చూడాలనీ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రకమైంది. ఇది వివాహం బయట స్త్రీల లైంగిక జీవన హక్కులను బలపరిచే తీర్పు.

– కత్తి పద్మ, మహిళా హక్కుల కార్యకర్త

స్వార్థానికి వాడకూడదు..



పెళ్లయినా, అవివాహితైనా బిడ్డను కనాలా, వద్దా అనే నిర్ణయించుకునే హక్కు పూర్తిగా స్త్రీకి ఉండాలి. ఇందులో పెద్దల జోక్యం కూడా ఉండకూడదు. పెళ్లి, ఆర్థిక భద్రత అంశాలను పరిగణనలోకి తీసుకొని అన్ని జాగ్రత్తలతో గర్భం దాల్చిన స్త్రీలను నేను చూశాను. అయితే, తమ స్వార్థ ప్రయోజనాల కోసం దీనిని ఆయుధంగా ఉపయోగించకూడదు.

– పూనమ్ కౌర్, నటి

దుర్వినియోగం కాకూడదు

పరిస్థితిని బట్టి నిర్ణయం ఉంటుంది. అయితే, చట్టంలో ఉంది కదా అని అవకాశాన్ని దుర్వినియోగం చేయకూడదు. కుటుంబం, ఆరోగ్యంపైన తీవ్ర ప్రభావం చూపే ఘటన కాబట్టి అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలి. అవగాహనతో తమ భావి జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి తప్ప ఈజీగా తీసుకోకూడదు, అలాగని ఓకే చేయకూడదు.

– వాణి, గృహిణి

అమ్మకు ఆరగింపు

వంటిల్లు



ఘీ రైస్



కావలసినవి: **బాస్మతి బియ్యం** – కప్పు, **నెయ్యి** – రెండున్నర టేబుల్ స్పూన్లు, **బిర్యానీ ఆకు** – ఒకటి, **యాలకులు** – రెండు, **లవంగాలు** – రెండు, **దాల్చిన చెక్క** – అంగుళం ముక్క, **అనాస పువ్వు** – ఒకటి, **మరాటి మొగ్గ** – ఒకటి, **జీలకర్ర** – టీస్పూను, **ఉప్పు** – రుచికి సరిపడా, **జీడిపప్పు పలుకులు** – టేబుల్ స్పూను, **పచ్చిబఠాణీ** – అరకప్పు, **స్వీట్ కార్న్** – అరకప్పు, **పచ్చిమిర్చి** – మూడు (సన్నగా తరగాలి).

తయారీ: ● స్వీట్‌కార్న్, పచ్చిబఠాణీలను ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● స్టవ్ మీద బాణలి పెట్టి టేబుల్ స్పూను నెయ్యి వేయాలి. వేడెక్కిన నెయ్యిలో బాస్మతి బియ్యాన్ని కడిగి వేసి రెండు నిమిషాలు మంచి వాసన వచ్చేంత వరకు వేయించాలి.
● ఇప్పుడు బిర్యానీ ఆకు, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, అనాస పువ్వు, మరాటి మొగ్గ, అరటీస్పూను జీలకర్ర వేసి తిప్పాలి. దీనిలో ఒకటిన్నర కప్పులు నీళ్లుపోసి అన్నం పొడిపొడిగా వచ్చేలా ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● స్టవ్ మీద మరో బాణలి పెట్టి ఒకటిన్నర టేబుల్ స్పూన్లు నెయ్యి వేయాలి. నెయ్యి వేగాక అరటీస్పూను జీలకర్ర, జీడిపప్పు పలుకులువేసి వేయించాలి. ● ఇవి వేగాక తరిగిన పచ్చిమిర్చి, ఉడికించిన పచ్చిబఠాణీ, స్వీట్ కార్న్ వేసి మీడియం మంటమీద వేయించాలి. ● ఇప్పుడు అన్నం వేసి అన్నింటిని చక్కగా కలిసేలా కలియతిప్పి దించేయాలి. నెయ్యి, బాస్మతీల సువాసనలతో కాస్త ఘాటుగా, తియ్యగా ఉండే నెయ్యి అన్నాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించవచ్చు.

పనీర్ జిలేబీ



కావలసినవి: **పనీర్ ముక్కలు**– అరకప్పు, **మైదా** – అరకప్పు, **వంటసోడా** – చిటికెడు, **కార్న్ ఫ్లోర్** – టేబుల్ స్పూను, **ఆరెంజ్ ఫుడ్ కలర్** – పావు టీస్పూను, **పాలు** – పావు కప్పు, **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా, **పిస్తాపలుకులు** – గార్నిష్‌కు తగినంత.

సుగర్ సిరప్ కోసం: **పంచదార** – కప్పు, **నీళ్లు** – అరకప్పు, **కుంకుమపువ్వు రేకలు** – ఎనిమిది, **నిమ్మరసం** – రెండు చుక్కలు, **యాలకుల పొడి** – పావు టీస్పూను.

తయారీ: ● పనీర్ ముక్కలను బ్లెండర్‌లో వేసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● పనీర్ పేస్టుని ఒక గిన్నెలో వేయాలి. ఈ గిన్నెలోనే కార్న్‌ఫ్లోర్, వంటసోడా, మైదా, ఆరెంజ్ ఫుడ్ కలర్ వేసి కలపాలి. ● ఇప్పుడు టేబుల్ స్పూన్ చొప్పున పాలు పోసి కలుపుతూ మెత్తటి పిండి ముద్దలా కలుపుకోవాలి. పిండి ఎండిపోకుండా తేమగా ఉండేలా పాలు అవసరాన్ని బట్టి పోసి, కలిపి పక్కన పెట్టుకోవాలి. ● పంచదారను మందపాటి బాణలిలో వేసి నీళ్లు, నిమ్మరసం, కుంకుమ పువ్వు వేసి మీడియం మంటమీద పంచదార తీగపాకం రానివ్వాలి. పాకం వచ్చిన వెంటనే యాలకుల పొడి వేసి కలిపి దించేయాలి. ● కలిపి పెట్టుకున్న పిండిముద్దను మౌల్డ్‌లో వేసుకుని నచ్చిన పరిమాణంలో జిలేబీ ఆకారంలో వేసి డీప్‌ఫ్రై చేసుకోవాలి. ● జిలేబీలు గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారాక తీసి పాకంలో వేయాలి. రెండు నిమిషాలు నానాక మరోవైపు తిప్పి మరో రెండు నిమిషాలు నాననిచ్చి పిస్తా పలుకులతో గార్నిష్ చేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టుకోవాలి.

స్వీట్ సుర్నోలి



కావలసినవి: **బియ్యం** – కప్పు, **అటుకులు** – పావు కప్పు, **పచ్చికొబ్బరి తురుము** – పావు కప్పు, **బెల్లం తురుము** – పావు కప్పు, **పెరుగు** – పావు కప్పు, **మెంతులు** – పావు టీస్పూను, **పసుపు** – అరటీస్పూను, **ఉప్పు** – టీస్పూను, **వంటసోడా** – పావు టీస్పూను, **నెయ్యి** – సుర్నోలి వేయించడానికి సరిపడా.

తయారీ: ● బియ్యం, మెంతులను శుభ్రంగా కడిగి, ఒకటిన్నర కప్పులు నీళ్లుపోసి నాలుగు గంటలు నానబెట్టుకోవాలి. ● నానిన బియ్యంలో కడిగిన అటుకులను వేసి ఉంచాలి. ● ఐదు నిమిషాల తరువాత బియ్యంలో నీటిని తీసేసి, బెల్లం తురుము, కొబ్బరి, పెరుగు, ఉప్పు వేసి దోశపిండిలా రుబ్బుకుని పక్కన పెట్టుకోవాలి. ● ఆరు గంటల తరువాత పిండిలో బేకింగ్ సోడా వేసి కలుపుకోవాలి. ● పెనం వేడెక్కిన తరువాత నెయ్యి వేసి గరిటతో పిండి తీసుకుని దోశలా పలుచగా కాకుండా కొద్దిగా మందంగా వేసి రెండువైపులా చక్కగా కాల్చుకుని తీసి అమ్మవారికి నివేదించుకోవాలి.

కదంబం



కావలసినవి: **బియ్యం** – కప్పు, **కందిపప్పు** – అరకప్పు, **సొరకాయ, బంగాళ దుంప, క్యారట్, చిక్కుడు కాయ, బెండకాయ, బఠాణీ, దొండకాయ, టొమాటో, వంకాయ ముక్కలు** – ఒక్కోటీ కప్పుడు చొప్పున తీసుకోవాలి, **పచ్చికొబ్బరి తురుము** – పావు కప్పు, **చింతపండు రసం** – పావు కప్పు, **పచ్చిమిర్చి** – నాలుగు, **జీడిపప్పు** – పావు కప్పు, **కరివేపాకు** – రెండు రెమ్మలు, **పల్లీలు** – టేబుల్ స్పూను, **ఇంగువ** – చిటికెడు, **పచ్చికొబ్బరి ముక్కలు** – పావు కప్పు, **పచ్చిశనగపప్పు** – రెండు టేబుల్ స్పూన్లు, **ధనియాలు** – రెండు టేబుల్ స్పూన్లు, **జీలకర్ర** – టేబుల్ స్పూను, **మెంతులు** – అర టీస్పూను, **ఆవాలు** – టీస్పూను, **ఎండు మిర్చి** – ఆరు, **పసుపు** – అర టీస్పూను, **నెయ్యి** – రెండు టేబుల్ స్పూన్లు, **నూనె** – రెండు టేబుల్ స్పూన్లు, **ఉప్పు** – రెండు టీస్పూన్లు, **కొత్తిమీర తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బియ్యం, కందిపప్పుని కడిగి విడివిడిగా ఉడికించి మెత్తగా చిదిమి పక్కన పెట్టుకోవాలి. ● కుకర్ గిన్నెలో నెయ్యి, నూనె వేయాలి. ఇవి రెండు వేడెక్కిన తరువాత ఆవాలు, కరివేపాకు, జీడిపప్పు,పల్లీలు, పచ్చిమిర్చిని నిలువుగా చీల్చివేయాలి. ఇవి వేగాక ఇంగువ వేయాలి. ● ఇప్పుడు పచ్చికొబ్బరి, పసుపు వేసి నిమిషం పాటు వేయించాలి. ● తీసుకున్న కూరగాయ ముక్కలు, రెండు కప్పుల నీళ్లుపోసి ఒక విజిల్ వచ్చేంత వరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● చిన్న బాణలిలో పచ్చిశనగపప్పు, ధనియాలు, ఎండుకొబ్బరి, మెంతులు, ఎండు మిర్చి, జీలకర్ర వేసి దోరగా వేయించి దించేయాలి. ఈ మసాలా దినుసులన్నీ చల్లారాక బ్లెండర్‌లో వేసి పొడిచేసుకోవాలి. ● ఇప్పుడు ఉడికిన కూరగాయ ముక్కల్లో చింతపండు రసం, మసాలా పొడి, ఉప్పు, ఉడికించిన అన్నం, పప్పు వేసి నూనె పైకి తేలేంత వరకు ఉడికించాలి. చక్కగా ఉడికిన తరువాత కొద్దిగా కొత్తిమీర చల్లుకుని అమ్మవారికి నైవేద్యంగా పెట్టుకోవాలి.